

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 166

శుక్రవారం 1-3-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



నేడే 'ఫైనల్' కూత...

ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్ కోసం పుణేరి పల్టన్‌తో హరియాణా 'ఢీ' - స్పోర్ట్స్‌లో



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు డీలా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో 13% క్షీణత - బిజినెస్‌లో

పెద్దదైన చిన్నదైన, అన్నిటికి ఒక్కటే bob!

కొత్త కరెంట్ ఖాతలు అన్ని రకాల బిజినెస్ కోసం



సమర్పిస్తున్నాం

bob CURRENT ACCOUNT PACKAGE

- జీరో బ్యాలెన్స్ ఖాతలు
- ఉచిత RTGS/NEFT
- ఉచిత సౌండ్‌బాక్స్/POS/QR
- ఉచిత కార్పొరేట్ క్రెడిట్ కార్డ్
- రిటైల్ లోన్ల ప్రాసెసింగ్ ఫీ లో తగ్గింపు
- ఉచిత SMS/ఫోలియో చార్జీలు ఉండవు

Bank of Baroda

Hamesha Aapke Liye

(24x7) : 1800 5700 | www.bankofbaroda.in

జనం లేక జంట షాక్

జెండా సభకో దండం అంటూ మొహం చాటేసిన కేడర్

తొలి అడుగులోనే టీడీపీ-జనసేనకు అసమ్మతి పిడుగు

- ఊదరగొట్టిన ఉమ్మడి సభకు హాజరైంది 40 వేలలోపే
- జనం లేక ఇరుపక్షాల నేతలపై చంద్రబాబు, పవన్ చిర్రుబుర్రులు
- ప్రజలకు ఏం చేస్తారో చెప్పకుండా సీఎం జగన్‌ను దూషించడంలో పోటాపోటీ
- తొలి సభే అట్టర్ ఫ్లాప్ కావడంతో టీడీపీ-జనసేన శ్రేణుల్లో నైరాశ్యం
- వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభలు ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్
- ఉమ్మడి, తెలుగు రాష్ట్రాల చరిత్రలోనే అతి పెద్ద ప్రజాసభగా నిలిచిన రాప్తాడు సిద్ధం సభ
- ఎన్నికల్లో మరోసారి 'ఫ్యాన్' ప్రభంజనానికి సంకేతంగా నిలిచిన మూడో సభ
- వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని తేల్చిచెప్పిన దజనుకుపైగా జాతీయ మీడియా సంస్థల సర్వేలు



చంద్రబాబు, పవన్ వచ్చిన సమయంలో ఖాళీగా దర్శనమిస్తున్న 'జెండా' సభాప్రాంగణం (ఫైల్)

సాక్షి, అమరావతి: రహస్య అజెండాతో ఐదేళ్లుగా ముసుగులో గుద్దులాట.. బేరసారాల అనంతరం ప్రకటించిన టీడీపీ – జనసేన పొత్తుల వ్యవహారం తొలి అడుగులోనే బెడిసికొట్టింది! పొత్తులు కుదిరాక తొలిసారిగా బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన 'జెండా సభ' జనం లేక వెలవెలబోయింది. పొత్తుల పేరుతో తమకు సీట్లు ఇవ్వకపోవటాన్ని నిరసిస్తూ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పలువురు కీలక నేతలు, కేడర్ ఈ సభను బహిష్కరించి దూరంగా ఉండటం గమనార్హం. ఉమ్మడిగా నిర్వహించిన మొదటి సభకు ఐదారు లక్షల మంది తరలివస్తారంటూ రెండు పార్టీల అగ్రనేతలు ఎంతో నమ్మకం పెట్టుకోగా కేవలం 40 వేల నుంచి 50 వేల మంది లోపే హాజరైనట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. జనం లేక సభా ప్రాంగణం కళ తప్పడంతో ఇరు పక్షాల నేతలపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిర్రుబుర్రులాడారు. తీవ్ర నిరాశ నిస్పృహకు గురైన వారిద్దరూ తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామో చెప్పకుండా సీఎం జగన్‌పై పోటీ పడి దూషణలకు దిగడం

మిగతా 2వ పేజీలో ▶

అమరావతిలో 'ప్రత్తిపాటి' దోపిడీ

రూ.66.03 కోట్లు కొల్లగొట్టిన మాజీ మంత్రి ప్రత్తిపాటి కుటుంబం

టీడీపీ నేత ప్రత్తిపాటి కుటుంబ కంపెనీ అవెక్సా బాగోతం ఇదీ

విజయవాడ పోలీసులకు డీఆర్ఐ ఫిర్యాదు.. ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్ అరెస్టు

- ఆయనతోపాటు మరో ఆరుగురిపై పోలీసుల కేసు..
- అమరావతిలో సబ్ కాంట్రాక్టుల పేరుతో గోల్‌మాల్
- బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి రూ. కోట్ల ప్రజల సొమ్ము స్వాహా
- కాంట్రాక్టు సంస్థ నుంచి సబ్ కాంట్రాక్టుకు పనులు
- ఆ పనులు మరికొన్ని కంపెనీలకు అప్పజెప్పినట్లుగా బిల్లులు
- ఆ కంపెనీల ద్వారా అక్రమంగా నిధుల మళ్లింపు
- ఈ పనులు చేసినందుకు రూ.17.85 కోట్లు ఇన్‌పుట్ ట్యాక్స్ సబ్సిడీ
- జీఎస్టీ ఇంటెలిజెన్స్, డీఆర్ఐ సోదాల్లో వెల్లడి



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతిలో జరిగిన కుంభకోణాల్లో మరో భారీ అవినీతి బయటపడింది. చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబం రాజధానిలో మౌలిక సదుపాయాల కాంట్రాక్టుల పేరిట రూ.66.03 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు వెల్లడైంది. ప్రత్తిపాటి కుటుంబానికి చెందిన అవెక్సా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్

మిగతా 2వ పేజీలో ▶

రూఫ్‌టాప్ సోలార్ రాయితీ రూ.78,000

'పీఎం–సూర్య ఘర్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

రూ.75,021 కోట్లతో పథకం అమలు.. కోటి కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్

6లో

గాజాలో ఘోరం

ఆహార ట్రక్కులపై ఎగబడిన పాలస్తీనియన్లు

వారిపై ఇజ్రాయెల్ కాల్పుల మోత

100 మందికి పైగా దుర్మరణం

760 మందికి గాయాలు

- వివరాలు 6లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Venco'bb CHICKEN

సూచించిన నేటి గుడ్లు & చికెన్ అనంతపురం జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹ 72	ఫారం దగ్గర లైవ్ బర్డ్	134	డ్రస్సడ్ స్కిన్‌తో	226
	రిటైల్ లైవ్ బర్డ్	156	స్కిన్‌లెస్	257



సాక్షి SAKSHI TV ఇప్పుడు సాక్షి SAKSHI TV

మా ప్రయాణం ఒక వాగ్దానంతో మొదలైంది
మేం వాగ్దానం చేశాం. నాణేనికి మరోవైపు చూపిస్తామని
మేం హామీ ఇచ్చాము నిజాలను నిర్భయంగా చెబుతామని
మేం ప్రమాణం చేశాము. ప్రజల పక్షాన నిలబడతామని
ప్రజాక్షేత్రంలో మీతో మాది పదిహేనేళ్ల అనుబంధం
సాక్షి... తెలుగు వారి మనస్సాక్షి...
ఇప్పుడు సరికొత్త రంగుల్లో...

15 ఏళ్ల విశ్వసనీయత..

ఇప్పుడు మరింత మెరుగైన అనుభూతితో

వైఎస్సార్‌సీపీలో చేరిన సీనియర్ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్

- సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితుడినై పార్టీలో చేరా
- కర్నూలు నగరం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని సీఎం జగన్ ఆదేశించారు
- సమష్టిగా పనిచేసి ఇంతియాజ్‌ను గెలిపించుకుంటాం: ఎస్వీ మోహన్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇంతియాజ్

సాక్షి, అమరావతి: సీనియర్ ఐఏఎస్ అధికారి ఎ.ఎండి. ఇంతియాజ్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన సీఎం వైఎస్ జగన్ సమక్షంలో పార్టీలో చేరారు. సెర్ప్ సీఈవోగా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఇంతియాజ్ బాధ్యతలు నిర్వహించి, అనంతరం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, కర్నూలు మేయర్ బి.వై.రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన సీఎం క్యాంపు కార్యాలయం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ''కర్నూలు నగరం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని నన్నుసీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన నేను అక్కడే పుట్టి పెరిగి విద్యాభ్యాసం చేశాను. కర్నూలు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నాను. అసమానతలు లేని సమాజం కోసం ప్రభుత్వ సంక్షేమ పథకాలు సీఎం జగన్ అమలు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో ప్రజలకు న్యాయం జరుగుతోంది. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితుడినై పార్టీలో చేరాను. ప్రజల మధ్యన, ప్రజలతో నిత్యం ఉండే భాగ్యం జగన్ కల్పించారు. ప్రజలకు అనుక్షణం అండదండగా ఉంటాను'' అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో– ఆర్డినేటర్ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో పనిచేయాలని ఇంతియాజ్ భావించారని, మైనార్టీ వెల్ఫేర్ శాఖలో కీలక అధికారిగా పనిచేసిన ఇంతియాజ్ పార్టీలో చేరటాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. కర్నూలు నుంచి ఇంతియాజ్‌ను పోటీ చేయించాలని సీఎం నిర్ణయించారని, ఆయన అభ్యర్థిత్వానికి ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మద్దతిస్తారని చెప్పారు. ఎమ్మెల్యేగా ఇంతియాజ్‌ను గెలిపిస్తామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంతియాజ్‌కు తామంతా సపోర్టు చేస్తామన్నారు. కర్నూలుకు ఇంతియాజ్ సుపరిచితులని, ఆయన్ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని చెప్పారు. పార్టీ బాగుంటే తాము అంతా బాగుంటామన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. కలసి కట్టుగా పనిచేసి ఇంతియాజ్‌ను గెలిపించుకుంటామన్నారు. తాను ఈసారి ఎన్నికల్లో ఎక్కడా పోటీ చేయడం లేదని, పార్టీ కోసం పని చేస్తానని తెలిపారు.

FORM IV
(See Rule 8)

Statement about ownership and other particulars about newspaper ***SAKSHI***

1. Place of Publication	:	**CHENNAI**
2. Periodicity of its publication	:	DAILY
3. Printer's Name	:	**V. MURALI**
Nationality	:	INDIAN
Address	:	**Jagati Publications Limited** 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
4. Publisher's Name	:	**V. MURALI**
Nationality	:	INDIAN
Address	:	**Jagati Publications Limited** 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034.
5. Editor's Name	:	**V. MURALI**
Nationality	:	INDIAN
Address	:	Flat No. 301, Rajya Lakshmi Residency, Padma Colony, Nallakunta, Hyderabad - 500 044.
6. Name & Addresses of Individuals who own the Newspaper and shareholders holding more than one percent of the total capital	:	1. **M/s. Jagati Publications Limited,** 6-3-249/1, Sakshi Towers, Road No.1, Banjara Hills, Hyderabad -500 034. 2. **M/s.Carmel Asia Holdings Pvt Ltd.,** No. 12/2, Commerce at mantri, Bannerghatta Main road, Opposite mantri home care office, Bangalore, Karnataka - 560 076. 3. **M/s.Gilchrist Investments Pvt Ltd,** # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 4. **M/s. Alpha Avenues Pvt Ltd.,** # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 5. **M/s. Alpha Villas Pvt Ltd.,** # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 6. **M/s. India Cements Ltd.** # 827, Annasalai, Dhun Building, IVth Floor, Chennai - 600 002 7. **M/s. P.R. Enerrgy Holding Limited** Lakshmi Nivas, Plot. No. 705, Road. No.3, Banjara Hills, Hyderabad-500 034 8. **M/s. PVP Business Ventures Pvt. Ltd.** # 46, Avenue 4, Street No.1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034 9. **M/s. PVP Business Towers Pvt Ltd.,** 8-2-609/K, Avenue 4, Street No. 1, Road No. 10, Banjara Hills, Hyderabad - 500 034. 10. **M/s.R.R. Global Enterprises Pvt. Ltd.** 8-2-120/86/5, Third Floor, Sneha House, Road No. 3, Banjara Hills, Hyderabad - 500 034. 11. **M/s. Sentia Developers Ltd.** 1A-Hamilton House, 1st Floor, Connaught Place, New Delhi - 110 001. 12. **M/s.Avant Garde Fashion Wear Pvt. Ltd,** 54/3, Ejipura Main Road, Vivek Nagar, Bangalore - 560 047. 13. **M/s. Beta Avenues Pvt. Ltd.,** # 1-1-151 & 1-1-151/1, Ground Floor, Sairam Towers, Alexander Road, Secunderabad - 500 003. 14. **M/s. IA and IC Pvt. Ltd.,** Pada.No.3, Balkum, Opp Casa Lodha Royal, Near Jalaram Mandir, Thane (West) - 400 608.

I, V. MURALI hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-
(V. MURALI)
Publisher

Date: 29-02-2024

జనం లేక 'జంట' షాక్



▶ మొదటి పేజీ తరువాయి

ఇరు పక్షాల శ్రేణులను విస్మయానికి గురి చేసింది.

'గూడెం' దెబ్బకు గుండె గుభేల్

ఉమ్మడిగా నిర్వహించిన తొలి సభే అట్టర్ ఫ్లాప్ కావడంతో టీడీపీ-జనసైన శ్రేణులు నైతిక స్థైర్యాన్ని కోల్పోయాయి. దీంతో ఎన్నికలకు ముందే కాడి పారేసే దిశగా కదులుతున్నాయి. మరోవైపు సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన 'సిద్ధం' సభలు మూడూ ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ కావడంతోపాటు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయమని జీ న్యూస్ మ్యాటరైజ్, జనాధార్ ఇండియా, టైమ్స్ నౌ లాంటి డజన్‌కుపైగా జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేలు వెల్లడిస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహంతో ప్రజాక్షేత్రంలో దూసుకెళ్తున్నాయి.

పొత్తు ఆదిలోనే 'చిత్తు'..

పొత్తులో భాగంగా 24 శాసనసభ, 3 లోక్‌సభ స్థానాలను జనసేనకు కేటాయించాక కాపు సామాజిక వర్గం అధికంగా ఉండే గోదావరి జిల్లాల్లో సభను నిర్వహించడం ద్వారా బలం చాటుకోవాలని తాడేపల్లిగూడెంను వేదికగా ఎంచుకున్నారు. అయితే అవకాశవాద పొత్తును ప్రజలు ఆదిలోనే చిత్తు చేశారనేందుకు ఆ సభ వెలవెలబోవడమే నిదర్శనమని పేర్కొంటున్నారు. 2014లో జనసేనను స్థాపించిన పవన్ ఆ ఎన్నికల్లో పోటీ చేస్తే తనకు నష్టం జరుగుతుందని చంద్రబాబు వారించడంతో పోటీకి దూరంగా ఉన్నట్లు పలు సందర్భాల్లో చెప్పారు. నాడు టీడీపీ–బీజేపీ కూటమిలో చేరి చంద్రబాబుకు మద్దతుగా ప్రచారం చేశారు. 2019 ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చడం ద్వారా మళ్లీ చంద్రబాబును అధికారంలోకి తేవాలన్న లక్ష్యంతో టీడీపీ కూటమి నుంచి వేరుపడ్డ పవన్ బీఎస్పీ–సీపీఐతో జతకట్టి పోటీ చేశారు. ఇప్పుడు బాబును గద్దెనెక్కించడమే లక్ష్యంగా మళ్లీ టీడీపీతో జత కలిశారు. వీటిని పరిశీలిస్తున్న ప్రజలు చంద్రబాబు కోసం.. చంద్రబాబు చేత.. చంద్రబాబే ఏర్పాటు చేయించిన పార్టీ జనసేన అని భావిస్తున్నారు.

ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల దూకుడు

సార్వత్రిక ఎన్నికలకు శ్రేణులను సన్నద్ధం చేస్తూ సీఎం జగన్ 'సిద్ధం' సభలను తొలుత భీమిలిలో ఆ తర్వాత దెందులూరులో నిర్వహించారు. ఆ రెండు సభలకు సముద్రాన్ని తలపించే రీతిలో జనం కదలి వచ్చారు. ఫిబ్రవరి 18న రాప్తాడులో నిర్వహించిన మూడో 'సిద్ధం' సభకు 10-11 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. ఉమ్మడి ఏపీ, తెలుగు రాష్ట్రాల చరిత్రలో అతి పెద్ద ప్రజాసభగా రాప్తాడు సభ నిలిచిపోయింది. సీఎం జగన్ నాయకత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ప్రతీకగా రాప్తాడు సభ నిలిచిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఎన్నికల హామీల్లో 99% అమలు చేయడం, పేదల జీవన ప్రమాణాలు పెరిగేలా డీబీటీతో నేరుగా రూ.2.55 లక్షల కోట్లను పారదర్శకంగా అందించడం, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తేవడంతో సీఎం జగన్‌పై విశ్వాసం ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతోందని పేర్కొంటున్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజల నాడిని గుర్తించేందుకు పలు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన ప్రీపోల్ సర్వేల్లోనూ ఇదే విషయం వెల్లడైంది.

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 24 నుంచి 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని, టీడీపీ కూటమి 0–1 స్థానంలో మాత్రమే ఉనికి చాటుకునే అవకాశం ఉందని టైమ్స్‌నౌ సర్వే తేల్చింది.
- రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకుగానూ 19 ఎంపీ సీట్లలో వైఎస్సార్‌సీపీ విజయభేరీ మోగిస్తుందని, టీడీపీ–జనసేన కూటమి 6 స్థానాలకే పరిమితం అవుతుందని జీన్యూస్ మ్యాటరైజ్ సర్వే స్పష్టం చేసింది.
- 49.2 శాతం ఓట్లతో 125 శాసనసభ, 17 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని, టీడీపీ–జనసేన కూటమి 46.3 శాతం ఓట్లతో 50 శాసనసభ, 8 లోక్‌సభ స్థానాలకు పరిమితం అవుతుందని జనాధార్ ఇండియా సర్వే వెల్లడించింది. 62 శాతం మంది ప్రజలు సీఎం వైఎస్ జగన్ పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపింది.

విఫల అ'జెండా'

తొలిసభ ఫ్లాప్‌తో రెండు పార్టీల పరస్పర నిందలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడిగా నిర్వహించిన తొలి సభే అట్లర్ ఫ్లాప్ కావడంతో టీజే (టీడీపీ, జనసేన)లో అంతర్మథనం మొదలైంది. సభకు 50 వేల మందిలోపే రావడం రెండు పార్టీల అగ్రనేతలకు మింగుడు పడటం లేదు. వైఎస్సార్ సీపీ సిద్ధం సభలకు ధీటుగా నిర్వహిస్తున్నట్లు ఎల్లో మీడియాలో ఊదరగొట్టి చివరకు నియోజకవర్గ స్థాయి సభలా కూడా నిర్వహించలేకపోవడంతో రెండు పార్టీల మధ్య నిందల పర్వానికి తెరలేచింది. జన సమీకరణలో విఫలమైన టీడీపీ తమకు ఏలూరు, తణుకు, ఆచంట జనసేన నేతలు అసమ్మతితో సహకరించలేదని విమర్శించింది. టీడీపీ ఇన్‌చార్జులు పూర్తిస్థాయిలో ఉన్న చోట్ల కూడా జనాలను తీసుకురాలేకపోయారని జనసేన ప్రతి విమర్శకు దిగింది. ఏలూరులో జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు సభను బహిష్కరించి అనుచరులతో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. తణుకు జనసేన ఇన్‌చార్జి రామచంద్రరావు, ఆచంట జనసేన ఇన్‌చార్జి సూర్యప్రకాష్ సభను బాయ్‌కాట్ చేశారు. పలువురు నరసాపురం నేతలు కూడా సభను బహిష్కరించారు.

పవన్ జెండా కూలీ మాత్రమే..



సాక్షి, అమరావతి: చంద్రబాబుకు జెండా కూలీగా మాత్రమే పవన్ కళ్యాణ్ రాజకీయాలు చేస్తున్నారని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ మండిపడ్డారు. ఆయన గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పవన్‌లకు రాజకీయ సమాధి తథ్య మని చెప్పారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ కంటే పవన్‌కు ఏదీ ముఖ్యం కాదన్నారు. అందుకే గతంలో అమరావతిని కుల రాజధానిగా చెప్పిన పవన్‌కు.. ఇప్పుడు అది ఇంద్రప్రస్థ పట్టణంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ తన తల్లిని తిట్టినవారి పంచన చేరి నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. తనను ఎవరూ ప్రశ్నించడానికి వీల్లేదని సొంత కేడర్‌నే ఆయన బెదిరిస్తున్నారన్నారు. ఎప్పుడూ ప్రశ్నించడమే కాదు.. 'హూ కిల్డ్ సినీస్టార్ ఉదయ్‌కిరణ్?' అనే ప్రశ్నకు కూడా పవన్ సమాధానం చెప్పాలన్నారు. పార్టీ పెట్టి పుష్కరం దాటి నా ఎమ్మెల్యే కాలేకపోయానన్న నిరాశ లో పవన్ దిగజారిపోయి వ్యవహరిస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెం సభలో బీరాలు పలికిన పవన్.. జనసేన కార్యకర్తలకు తెలియకుండానే ఆ పార్టీ జెండాను ఎప్పుడో మడతపెట్టేశారని ఎద్దేవా చేశారు. జగన్.. అనే బ్రాండ్ వింటేనే చంద్రబాబు, పవన్ వణికిపోతున్నా రని ఎద్దేవా చేశారు. వంగవీటి రంగాను హత్య చేయించి, కాపులను బలహీనం చేస్తున్న చంద్రబాబుతో అంటకాగొద్దని సలహానిచ్చే హరిరామ జోగయ్య, ముద్రగడ పద్మనాభం వంటివారిని పవన్ తన శత్రువులుగా చూస్తున్నారన్నారు. పవన్ మానసికస్థితి సరిగా లేకపోవడంతోనే పెళ్లిళ్ల పెటాకులవుతున్నాయని అన్నారు.

పవన్‌ను ఎప్పుడో పాతాళానికి తొక్కేశారు



సాక్షి, విశాఖపట్నం: పవన్ కళ్యాణ్‌ను ప్రజలెప్పుడో పాతాళానికి తొక్కేశారని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేనతోపాటు టీడీపీని కూడా పూర్తి స్థాయిలో ప్రజలు పాతాళానికి తొక్కేస్తారన్నారు. గురువారం విశాఖలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఒక్కసారి కూడా గెలవని పవన్ ముఖ్యమంత్రిని అగౌరవపరిచేలా మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. 24 సీట్లే ఎందుకు అడిగారని కార్యకర్తలు ప్రశ్నిస్తుంటే గాయత్రీ మంత్రంలో అక్షరాలంటూ పవన్ సినిమా కథలు చెబుతున్నారన్నారు. ఒకవేళ రెండు సీట్లు తీసుకుని ఉంటే నరనారాయణులు మంత్రమని, 3 సీట్లు ఇస్తే త్రిమూర్తులని, 4 సీట్లు ఇస్తే నలుదిక్కులూ అని చెప్పేవారని ఎద్దేవా చేశారు. మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌కే ప్రజలు పట్టం కడతారన్నారు. సిద్ధం సభల్లో సీఎం వైఎస్ జగన్ తాను అందించిన సంక్షేమ పాలన, అభివృద్ధి చూసి ఓటు వేయాలని ప్రజలకు చెబుతున్నారన్నారు.

అమరావతిలో 'ప్రత్తిపాటి' దోపిడీ

▶ మొదటి పేజీ తరువాయి

కాంట్రాక్టులు, సబ్ కాంట్రాక్టుల పేరుతో బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి నిధులు కొల్లగొట్టి.. షెల్‌కంపెనీల ద్వారా దారి మళ్లించినట్టు ఆధారాలతోసహా బట్టబయలైంది. కేంద్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ), రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఏపీ డీఆర్ఐ) సోదాల్లో ఈ వ్యవహారం మొత్తం బయట కొచ్చింది. ఈ కంపెనీ కేంద్ర జీఎస్టీ విభాగాన్ని బురిడీ కొట్టించడంతోపాటు రాష్ట్ర ఖజానాకు గండి కొట్టి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడినట్టు తేటతెల్లమైంది. దీంతో డీఆర్ఐ ఫిర్యాదు మేరకు విజయవాడ పోలీసులు కేసు నమోదు చేసి అవెక్సా కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను గురువారం అరెస్టు చేశారు. ఆయనతోపాటు మరో ఆరుగురిపై ఐపీసీ సెక్షన్లు 420, 409, 467, 471, 477(ఎ), 120 (బి) రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశారు. ఆయన్ని న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు.



ప్రత్తిపాటి శరత్

అవును ... బోగస్ బిల్లులతో నిధులు కొల్లగొట్టాం

ఈ వ్యవహారంపై డీజీజీఐ, ఏపీ డీఆర్ఐ విచారణలో మొత్తం లోగుట్టు బట్టబయలైంది. అవెక్సా కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న కుర్ర జగదీశ్ తాము బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి అక్రమంగా బిల్లులు డ్రా చేసుకున్నామని అంగీకరించారు. ఈ కుంభకోణానికి ఎలా పాల్పడిందీ ఆయన సవివరంగా వెల్లడించారు. దాంతో అవెక్సా కంపెనీ ముసుగులో ప్రత్తిపాటి కుటుంబం అవినీతి బాగోతం ఆధారాలతోసహా బట్టబయలైంది.

తీగ లాగితే కదిలిన డొంక

ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబానికి చెందిన అవెక్సా కార్పొరేషన్‌కు హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం, నెల్లూరు, విజయనగరం జిల్లా మానాపురంలలో బ్రాంచి కార్యాలయాలున్నాయి. ప్రత్తిపాటి పుల్లారావు భార్య తేనే వెంకాయమ్మ డైరెక్టర్‌గా, ఆయన కుమారుడు ప్రత్తిపాటి శరత్ అదనపు డైరెక్టర్‌గా ఉన్నారు. ఆ కంపెనీకి టీడీపీ ప్రభుత్వం అడ్డగోలుగా కాంట్రాక్టులు కట్టబెట్టింది. వాటి పనులు చేయకపోయినప్పటికీ, చేసినట్లు గా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించిన అవెక్సా కంపెనీ బిల్లులు డ్రా చేసుకోవడంతోపాటు జీఎస్టీ విభాగం నుంచి అడ్డగోలుగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ని కూడా పొందింది. దేశవ్యాప్తంగా అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందిన కంపెనీలపై డీజీజీఐ విచారణ చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అవెక్సా కంపెనీ అక్రమంగా ఐటీసీ పొందిందని వెల్లడి కావడంతో ఆ కంపెనీకి డీజీజీఐ రూ.16 కోట్ల జరిమానా విధిస్తూ షోకాజ్ కమ్ డిమాండ్ నోటీసు జారీ చేయాలని ప్రతిపాదించింది. అసలు అవెక్సా కార్పొరేషన్ వ్యవహారాలు, కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపులపై డీజీజీఐ, ఏపీ డీఆర్ఐ దృష్టిసారించాయి. ఆ కంపెనీ కార్యాలయాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించడంతో మొత్తం బాగోతం బట్టబయలైంది.

షెల్ కంపెనీలను సబ్ కాంట్రాక్టర్లుగా చూపించి రూ.21.93 కోట్లు

అవెక్సా కార్పొరేషన్ ముసుగులో ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబం ప్రజాధనాన్ని ఎలా కొల్లగొట్టిందీ అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చింది. 2017 నుంచి అవెక్సా కార్పొరేషన్ పేరుతో ప్రత్తిపాటి కుటుంబం అమరావతిలో కాంట్రాక్టు సంస్థలను బెదిరించి సబ్ కాంట్రాక్టులు తీసుకుంది. పనులు చేయకుండానే అక్రమంగా నిధులు కొల్లగొట్టింది. జాక్సన్ ఎమినెన్స్ (ప్రస్తుత పేరు జైశ్నవి ఎమినెన్స్) అనే కంపెనీ అమరావతిలో మౌలిక సదుపాయాల కాంట్రాక్టును పొందింది. ఆ కంపెనీ నుంచి రూ.37.39 కోట్ల విలువైన పనులను అవెక్సా కార్పొరేషన్ సబ్ కాంట్రాక్టుకు తీసుకుంది. సీఆర్‌డీయే పరిధిలో రోడ్లు, వరదనీటి కాలువలు, కల్వర్టులు, సివరేజ్ పనులు, వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనం తదితర పనులు అవెక్సా కార్పొరేషన్ చేయాల్సి ఉంది. అయితే, ఈ సంస్థ తానిషా ఇన్‌ఫ్రా, రాలాన్ ప్రాజెక్ట్స్, అనయి ఇన్ఫ్రా అల్వేజ్ టౌన్ ప్లానర్స్ అనే నాలుగు కంపెనీలకు రూ.21.93 కోట్లకు సబ్ కాంట్రాక్టుకు ఇచ్చినట్టు చూపించింది. ఆ సబ్ కాంట్రాక్టుల ముసుగులోనే అవెక్సా కంపెనీ ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు డీఆర్ఐ సోదాల్లో వెల్లడైంది. సబ్ కాంట్రాక్టుకు ఇచ్చామని చెప్పిన నాలుగు కంపెనీల నుంచి బోగస్ ఇన్వాయిస్‌లు, బిల్లులు పొంది ఆ మేరకు పనులు చేసినట్టుగా కనికట్టు చేసింది. ప్రభుత్వ ఖజానా నుంచి బిల్లుల సొమ్ము పొందింది. కేంద్ర జీఎస్టీ నుంచి అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను కూడా తీసుకుంది. వాస్తవానికి సబ్ కాంట్రాక్టు సంస్థల నుంచి అవెక్సా కంపెనీ ఎలాంటి సేవలూ పొందలేదు. అవి ఏ పనులూ చేయలేదు. ఆ నాలుగు కంపెనీలూ షెల్ కంపెనీలే. వాటి పేరుతో మొత్తం రూ.21,93,08,317 నిధులను ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబం అక్రమంగా తరలించింది.

రహదారి కాంట్రాక్టుల ముసుగులో రూ.26.25 కోట్లు దోపిడీ

అంతటితో అవెక్సా కంపెనీ అక్రమాలు ఆగలేదు. అమరావతిలోని ఉద్దండరాయపురం నుంచి నిడమర్రు వరకు ఎన్ 9 రోడ్డు నిర్మాణ కాంట్రాక్టును బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా ఇండియా లిమిటెడ్ కంపెనీ నుంచి సబ్ కాంట్రాక్టుకు తీసుకుంది. కానీ ఎలాంటి రోడ్డు పనులు చేయకుండానే అక్రమంగా బిల్లులు సమర్పించి ప్రజాధనాన్ని సొంత ఖాతాలోకి మళ్లించుకుంది. రహదారి నిర్మాణం కోసం మెటీరియల్ కొనుగోలు చేసినట్టు, వివిధ వృత్తి నిపుణుల సేవలు పొందినట్టు బీఎస్ఆర్ కంపెనీ పేరిట బోగస్ బిల్లులు సమర్పించి కనికట్టు చేసింది. అందుకోసం క్వాషిష్ మార్కెటింగ్ లిమిటెడ్, నోయిడా ఎస్‌పాత్ లిమిటెడ్, ప్రశాంత్ ఇండస్ట్రీస్, గోల్డ్ ఫినెక్స్ ఐరన్ – స్టీల్ కంపెనీల నుంచి మెటీరియల్ కొనుగోలు చేసినట్టు బోగస్ బిల్లులు సమర్పించింది. ఆ విధంగా ఏ పనీ చేయకుండానే వివిధ దశల్లో రూ.26,25,19,393 దోపిడీ చేసింది.

గృహ నిర్మాణ ప్రాజెక్టుల పేరిట అక్రమంగా రూ.17.85 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్

పేదల గృహ నిర్మాణ ప్రాజెక్టులోనూ అవెక్సా కంపెనీ అడ్డగోలుగా నిధులు కొల్లగొట్టింది. ఏపీ టిడ్కో కింద జి+3 గృహ నిర్మాణ ప్రాజెక్టు, విశాఖపట్నంలో హుద్‌హుద్ తుపాను బాధితులకు 800 గృహాల నిర్మాణ ప్రాజెక్టు, మిడ్ పెన్నార్ ప్రాజెక్టు ఆధునీకరణ సబ్ కాంట్రాక్టులు పొందింది. ఆ ప్రాజెక్టుల బిల్లుల కింద బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి ప్రభుత్వ ఖజానా నుంచి సొమ్ము పొందింది. ఈమేరకు ఆధ్యా ఎంటర్‌ప్రైజెస్, మెస్సెర్స్ సంజయ్ కుమార్ భాటియా, తనిష్క్ స్టీల్ లిమిటెడ్, మౌంట్ బిజినెస్ బిల్డ్ లిమిటెడ్ కంపెనీల నుంచి మెటీరియల్ కొన్నట్టు బోగస్ ఇన్వాయిస్‌లు, బిల్లులు సమర్పించింది. ఆ పేరుతో ఏకంగా రూ.17,85,61,864 ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందింది. ఈ విధంగా అవెక్సా కార్పొరేషన్ కంపెనీ ద్వారా ప్రత్తిపాటి పుల్లారావు కుటుంబం మొత్తం రూ.66,03,89,574 ప్రజాధనాన్ని కొల్లగొట్టింది.

తనయుడి కోసం తండ్రి పుల్లారావు చక్కర్లు

విజయవాడ స్పోర్ట్స్/గుణదల (విజయవాడ తూర్పు): అమరావతి పనుల కుంభకోణంలో దొరికిపోయిన ప్రత్తిపాటి శరత్ కోసం అతని తండ్రి, టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విజయవాడలో చక్కర్లు కొట్టారు. డీఆర్ఐ ఫిర్యాదుపై శరత్‌ను విజయవాడ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పోలీసులు అత్యంత గోప్యంగా విచారణ చేపట్టారు. దీంతో శరత్ జాడ కోసం అతని తండ్రి పుల్లారావు టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, ఇతర టీడీపీ నాయకులను వెంటేసుకుని పోలీస్ స్టేషన్ల చుట్టూ ప్రదక్షణలు చేశారు. ముందుగా గురునానక్ కాలనీలోని ఏసీపీ కార్యాలయానికి, అక్కడ లేకపోవడంతో మాచవరం పోలీస్ స్టేషన్‌కు, ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి వెళ్లారు. సాయంత్రం తన అనుచరులను నగరం నలుదిక్కులకు పంపారు. ఆ తరువాత సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతోందని తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. అక్కడా లేకపోవడంతో టీడీపీ కార్యాలయానికి వచ్చారు. రాత్రి 8.30 పుల్లారావు, పట్టాభి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులతో కలిసి పోలీసు కమిషనరేట్‌కు చేరుకొని తన కొడుకును చూపించాలంటూ ఆందోళనకు దిగారు. కొద్ది సేపటి తరువాత రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు వచ్చి ఓ గంటలో న్యాయమూర్తి వద్ద నిందితుడు శరత్‌ను ప్రవేశపెడతామని చెప్పడంతో ఆందోళన విరమించి మాచవరంలోని జడ్జి క్వార్టర్స్‌కు వెళ్లారు.

నేడు 'జగనన్న విద్యా దీవెన' జమ

- పామర్రులో బటన్ నొక్కి జమచేయనున్న సీఎం జగన్
- గతేడాది అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి రూ.708.68 కోట్లు విడుదల
- ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 9.44 లక్షల మందికి లబ్ధి

సాక్షి, అమరావతి/పామర్రు : రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 9.44 లక్షల మంది విద్యార్థులకు అక్టోబరు–డిసెంబరు–2023 త్రైమాసికానికి సంబంధించిన జగనన్న విద్యా దీవెన కింద రూ.708.68 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాజిల్లా పామర్రులో బటన్‌నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను జమచేయనున్నారు. దీంతో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు సీఎం జగన్ ప్రభుత్వం ఇప్పటివరకూ రూ.18,002 కోట్లను వ్యయం చేస్తోంది. పేద విద్యార్థులు పెద్ద చదువులకు వెళ్లాలన్న సమున్నత లక్ష్యంతో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు పూర్తి ఫీజులను క్రమం తప్పకుండా త్రైమాసికాల వారీగా చెల్లిస్తోంది. కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఇస్తూ ఉన్నత చదువులు చదివిస్తోంది. వీటితో పాటు భోజన, వసతి ఖర్చులకు ఇబ్బందిపడకుండా జగనన్న వసతి దీవెనను అందిస్తోంది. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున రెండు విడతల్లో జమచేస్తోంది. ఇలా విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ 57 నెలల కాలంలో రూ.72,919 కోట్లు ఖర్చుచేసింది.



నేడు పామర్రుకు సీఎం వైఎస్ జగన్ రాక..

జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కృష్ణాజిల్లా పామర్రు రానున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కనే ఉన్న సభాస్థలిని గురువారం మంత్రి జోగి రమేష్ స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఉ.10 గంటలకు సీఎం తాడేపల్లి నుంచి బయల్దేరి 10.30 గంటలకు పామర్రుకు చేరుకుంటారు. 10.50 గంటలకు సభాస్థలికి చేరుకుంటారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేస్తారు. సభానంతరం స్థానిక పార్టీ నేతలతో ముఖ్యమంత్రి సమావేశమవుతారు. మ.1.55కు తాడేపల్లి చేరుకుంటారు.

ఇదండీ జగత్



శిడిబండి ఉత్సవానికి పోటెత్తిన భక్తజనం



కృష్ణా జిల్లా ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవంలో ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక గురువారం నయనానందకరంగా సాగింది. డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో పట్టణంలో సందడి నెలకొంది. వేడుకకు అశేష భక్తజనం తరలివచ్చి కనులారా వీక్షించి భక్తిపారవశ్యం చెందారు. ఉత్సవం పూర్తి కావటంతో భక్తులు శిడి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో 11 వ రోజు శిడి బండి ఉత్సవం నిర్వహిస్తుంటారు.

- ఉయ్యూరు

ఏపీకి 465 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు కావాలి

కేంద్రానికి సీఎస్ జవహర్ రెడ్డి విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: త్వరలో జరగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లకై ఏపీకి 465 కంపెనీల సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మర్డ్ పోలీస్ ఫోర్సెస్) బలగాలు, 58 కంపెనీల ఎస్ఏపీ(స్పెషల్ ఆర్మర్డ్ ఫోర్సెస్) అవసరమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా.కేఎస్.జవహర్ రెడ్డి కేంద్ర హోం శాఖ కార్యదర్శికి చెప్పారు. గురువారం ఢిల్లీ నుండి కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా పలు రాష్ట్రాల సీఎస్, డీజీపీ, సీఈవో, హోం శాఖ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ఎస్ఏపీకు సంబంధించి ప్రస్తుతం 32 బలగాలు మాత్రమే ఉన్నాయని, ఈ నేపథ్యంలో మరో 26 కంపెనీల ఎస్ఏపీ బలగాలను పంపాలని కోరారు. రాష్ట ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా, హోం శాఖ కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా, అదనపు డీజీపీ అతుల్ సింగ్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ యం.రవి ప్రకాశ్, డీఐజీ సెంథిల్ కుమార్, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయ్ కుమార్ పాల్గొన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి వర్చువల్ గా పాల్గొన్నారు.

టీడీపీ నేత కుమార్తెను ఆదుకున్న వైఎస్సార్‌సీపీ నేత

ఆపరేషన్ కోసం రూ.5 లక్షల సాయం



వేదవిక సమస్య గురించి ఫోన్‌లో అడిగి తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్



లివర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వేదవిక

సింథియా(విశాఖ పశ్చిమ): విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్.. పార్టీలకతీతంగా చిన్నారి ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీకి చెందిన టీడీపీ నేత కళ్లారి సురేష్, రత్న కుమారి దంపతుల ఎనిమిది నెలల కుమార్తె కళ్లారి వేదవిక లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆపరేషన్‌కు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి రూ.25 లక్షలు సమకూర్చగా, మిగిలిన డబ్బుకు దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్‌కు గురువారం సమస్యను తెలియజేశారు. స్పందించిన ఆయన బాధితులను ఆత్మీయంగా పలకరించి ఆపరేషన్‌కు కావాల్సిన మిగిలిన రూ.5 లక్షలను తాను ఇస్తానని హామీ ఇచ్చారు. వెంటనే కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి ఫోన్ చేసి ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆనంద్‌కుమార్ చిన్నారి పట్ల స్పందించిన తీరుకు పాప కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జగనన్నను గెలిపించేందుకు ప్రజలు 'సిద్ధం': భూమన కరుణాకరరెడ్డి



ఒంగోలు 'సిద్ధం' సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భూమన తదితరులు

తిరుపతి మంగళం(తిరుపతి జిల్లా): సంక్షేమ పథకాల ద్వారా నేరుగా రూ.3.4 లక్షల కోట్లను ప్రజలకు అందించిన నాయకుడు ఇంతవరకు ప్రపంచంలోనే లేడని.. ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. మార్చి 10వ తేదీన ఒంగోలులో జరిగే సిద్ధం సభపై గురువారం తిరుపతిలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో డిప్యూటీ మేయర్, తిరుపతి సమన్వకర్త భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్ధం సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. కరుణాకరరెడ్డి మాట్లాడుతూ.. జగనన్న పేద ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ఎక్కడికెళ్లినా జగనన్నతో పాటు జగనన్న సైనికులమైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా జగనన్న పార్టీ వైఎస్సాఆర్‌సీపీని గెలిపించుకునేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఒంగోలులో నిర్వహించనున్న సిద్ధం సభ రాప్తాడు సిద్ధం సభను మించి ఉండేలా 14 నుంచి 15 లక్షల మందితో నిర్వహించే లక్ష్యంతో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. టీడీపీ, జనసేన నిర్వహించిన తాడేపల్లిగూడెం సభలో పట్టుమని 20వేల మంది కూడా లేరన్నారు. అయితే ఎల్లో పత్రికల్లో మాత్రం సూపర్, డూపర్ అంటూ గొప్ప చెప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ఒంగోలు సిద్ధం సభ పోస్టర్‌ను నేతలు ఆవిష్కరించారు.

భళా.. ఏపీ స్టాల్స్ !

సాక్షి, న్యూఢిల్లీ: 'భారత్ టెక్స్-2024'లో ఏపీ పెవిలియన్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌కు విదేశీయులు ఫిదా అయ్యారు. పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన 13 స్టాల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. చేనేత వస్త్రాలు, హ్యాండ్‌లూమ్ వస్తువులను విదేశీయులు ఆసక్తిగా గమనించి వాటితో సెల్ఫీలు తీసుకున్నారు. ఢిల్లీలో 3 రోజుల పాటు నిర్వహించిన 'భారత్ టెక్స్-2024' గురువారంతో ముగిసింది. ఇందులో ఏపీకి చెందిన వస్త్ర సమర్పణలు ప్రపంచ ఆకర్షణను సూచించగా, ఆప్కో, చేనేత, లేపాక్షి హస్తకళలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏపీ వస్త్రాలలో పొందుపరిచిన సాంప్రదాయ చేనేత హస్తకళకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ రావడం గమనార్హం. లేపాక్షి వస్త్రాలు, హస్తకళలు చూపరులను మంత్రముగ్ధుల్ని చేశాయి. ఈ ఎక్స్‌పోలో ఆప్కో, లేపాక్షి సంస్థలు రూ.2.65 లక్షల విక్రయాలు జరిగినట్లు తెలిపాయి.

వైభవంగా 7 ఆలయాల్లో విగ్రహ, కలశ ప్రతిష్ట

బాబు హయాంలో బెజవాడలో ఏడు ఆలయాల కూల్చివేత

- వాటిని పునర్నిర్మించిన సీఎం జగన్
- ఉదయం 11.24 గంటలకు ఆలయాల్లో విగ్రహ, కలశ ప్రతిష్ట
- కార్యక్రమాల్లో పాల్గొన్న దేవదాయ శాఖ మంత్రి దంపతులు
- భగవంతుడిపై సీఎం జగన్‌కు అచంచలమైన విశ్వాసం ఉంది
- బాబుకు దేవుడిపై విశ్వాసమే లేదు
- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ



విగ్రహ, కలశ ప్రతిష్ట అనంతరం మంత్రి దంపతులకు వేద ఆశీర్వచనం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): పుష్కరాల పేరుతో 2016లో అప్పటి సీఎం చంద్రబాబు కూల్చివేసిన విజయవాడలోని 7 ఆలయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పునర్నిర్మించారు. వాటి విగ్రహ, కలశ ప్రతిష్ట వైభవంగా జరిగింది. మంగళవారం ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ కార్యక్రమాలు గురువారం ముగిశాయి. గురువారం ఉదయం 11.24 గంటలకు ఒకే సుముహూర్తంలో ఏడు ఆలయాల విగ్రహ, కలశ ప్రతిష్ట కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. తొలుత సీతమ్మ వారి పాదాలు, దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద కలశ స్థాపన, విగ్రహ ప్రతిష్టను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పాత మెట్ల మార్గం వద్ద నిర్మించిన వినాయక, ఆంజనేయ స్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్నారు. కనకదుర్గ ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ శర్మ, రఘునాథ శర్మతో పాటు ఇతర ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం యాగశాలలో ఆలయ అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. విగ్రహ, కలశ ప్రతిష్ట అనంతరం గణపతి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఈ మహోత్సవంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఎఈవో ఎస్. రమేష్‌బాబు, డీఈ వెంకటేశ్వరరావు, ఎఈ కుటుంబరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగన్ అందించిన ప్రతి సంక్షేమ పథకానికి దేవుడి ఆశీర్వాదం

మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి భగవంతుడిపై అచంచలమైన విశ్వాసం ఉందని, ఆయన ప్రవేశపెట్టిన ప్రతి పథకం అమలు వెనుక దేవుడి ఆశీర్వాదాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే దేవుడికి ఎటువంటి అపచారం జరగకూడదన్నది సీఎం జగన్ భావన అని, అందుకే చంద్రబాబు కూల్చివేసిన ఆలయాలను తిరిగి పునర్నిర్మించారని తెలిపారు. చంద్రబాబుకు దేవుడిపై విశ్వాసం లేనందునే విజయవాడ నడిబొడ్డున ఉన్న పురాతన ఆలయాలను చంద్రబాబు నిర్దాక్షిణ్యంగా కూల్చివేయడమే కాకుండా దేవతామూర్తులను చెత్త వాహనాల్లో తరలించారని తెలిపారు. భగవంతుడికి అవమానం చేశాననే విచారం కూడా ఆయనకు లేదన్నారు. ఆయన అకృత్యాల కారణంగానే ఆయన పాలనలో రాష్ట్రంలో దుర్భిక్షం, కరువు రాజ్యమేలాయన్నారు. సీఎం జగన్ పథకాలు అమలు చేయాలంటే దేశ బడ్జెట్ కూడా సరిపోదని చంద్రబాబు, పవన్ విమర్శించారని, అయినా దేవుడి అండతో ఐదేళ్లు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని సీఎం జగన్ అమలు చేశారని తెలిపారు. చంద్రబాబు నోరు మూతపడేలా సీఎం జగన్ ప్రజలకు సంక్షేమం అందించారన్నారు.

6 నుంచి రాష్ట్రస్థాయి ఈఎండీపీ పోటీలు

సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖ మార్చి 6 నుంచి రాష్ట్రస్థాయి ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఈఎండీపీ) పోటీలకు సిద్ధమవుతోంది. ఉపాధినిచ్చే వనరులుగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యాలు, ఆధునిక నైపుణ్యాలు, బేసిక్ ఫైనాన్షియల్ లిటరసీ పెంచుతోంది. ఈఎండీపీలో శిక్షణ పొందిన విద్యార్థులు సామాజిక సమస్యలకు పరిష్కారాల దిశగా ప్రాజెక్టులను రూపొందిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఈ పోటీలు మార్చి 3 వరకు కొనసాగనున్నాయి. అనంతరం ఎంపిక చేసిన 52 ప్రాజెక్టులను విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నారు. ఇప్పటి వరకు వివిధ పాఠశాలల నుంచి 2,429 ప్రాజెక్టులు రాగా వాటిల్లో 93 ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో పోటీపడ్డాయి. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో డీఈవోలు, సైన్స్ అధికారుల నేతృత్వంలో ఈఎండీపీలో విద్యార్థుల సృజనాత్మకత ఆధారంగా 16 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

ఆయా జిల్లాల పాఠశాలల ప్రాజెక్టుల ప్రథమ, ద్వితీయ స్థానాలు ఇలా..

విశాఖపట్నం: జ్ఞాననికేతన్ ఎయిడెడ్ స్కూల్, జీహెచ్ఎస్ రైల్వే కాలనీ స్కూలు
తిరుపతి: జెడ్పీహెచ్ఎస్ తడ, జెడ్పీహెచ్ఎస్ ఆర్టీ కాలనీ
కర్నూలు: జెడ్పీహెచ్ఎస్ చేరుకులపాడు, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ హై స్కూల్
చిత్తూరు: జెడ్పీహెచ్ఎస్, పదిరికుప్పం, జెడ్పీహెచ్ఎస్, జీడీనెల్లూరు
నంద్యాల: జెడ్పీహెచ్ఎస్ నందీవర్గం, కేజీబీవీ, సిర్వెల్
కృష్ణ: ఎస్ఎంకే జెడ్పీహెచ్ఎస్, మొవ్వ, ఎస్ఎల్ ఎస్వీవీఎస్ఓ హైస్కూల్ పెదముత్తేవి
పల్నాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, జెడ్పీహెచ్ఎస్, తూబాడు
శ్రీ సత్య సాయి: జెడ్పీహెచ్ఎస్ ధనపురం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల తలుపుల

నేటి నుంచి ఎంఎస్ఎంఈల సర్వే

రాష్ట్రవ్యాప్తంగా 20 వరకు నిర్వహణ

సాక్షి, అమరావతి: రానున్న నాలుగేళ్లలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఖ్యను రెట్టింపు చేయడంతోపాటు వ్యాపారాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.118 కోట్లతో రైజింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్) పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఉన్న ఎంఎస్ఎంఈల వివరాలను సేకరించడానికి ప్రత్యేక సర్వేను నిర్వహిస్తోంది. పరిశ్రమల శాఖ, ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సర్వే ద్వారా డేటాను సేకరించి ఏపీఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేయనున్నట్లు ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో సేతు మాధవన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహిస్తామని, కలెక్టర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు కాని ఎంఎస్ఎంఈలను గుర్తించి వారికి అవగాహన కల్పించే విధంగా శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. దీనిద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈలకు అందించే పథకాలు, బ్యాంకు రుణాలు సులభంగా పొందడం, ఆలస్యమైన చెల్లింపులను డిలేయ్డ్ పేమెంట్ సమాధాన పోర్టల్‌కు అనుసంధానం చేయడం వంటి ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు. ఎంఎస్ఎంఈలకు చేయూతనిచ్చే విధంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ర్యాంప్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని, సర్వేలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంఎస్ఎంఈ అసోసియేషన్లకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైలంలో నేడు అంకురార్పణ



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో 11 రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరగనుంది. ఉదయం 8:10 గంటలకు యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవ క్రతువులు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామికి విశేష అర్చనలు, భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు, స్వామిఅమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు భేరీపూజ, భేరీతాడనం, సకలదేవతాహ్వానపూర్వక ధ్వజారోహణ, ధ్వజపట ఆవిష్కరణ నిర్వహిస్తారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా మార్చి 2న భృంగి వాహనసేవ, 3న హంస వాహన సేవ, 4న మయూర వాహన సేవ, 5న రావణ వాహన సేవ, 6న పుష్పపల్లకి సేవ, 7న గజ వాహన సేవ, 8న ప్రభోత్సవం, నందివాహన సేవ, అదే రోజు రాత్రి 10గంటలకు లింగోద్భవకాల మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ, కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 9న రథోత్సవం, తెప్పోత్సవం, 10న బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి చేపట్టి సాయంత్రం ధ్వజావరోహణ చేస్తారు. 11న అశ్వ వాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.

నేడు పట్టు వస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వారిచే స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. అలాగే, 2న ద్వారక తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం, 3న విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, 4న కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానాలు పట్టు వస్త్రాలను సమర్పించనున్నాయి. 5న రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతినిధులు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

ఏపీని అనుసరించండి..

- అన్ని రాష్ట్రాలకు సూచించిన బీఈఈ కార్యదర్శి మిలింద్ దేవరా
- విద్యుత్ పొదుపు చర్యలు, సహకారంలో ఆదర్శంగా ఏపీ చర్యలు



సాక్షి, అమరావతి : విద్యుత్ పొదుపును చర్యలు అమలు చేయడంలోనూ.. ఇంధన సామర్థ్య కార్యక్రమాలకు సహకరించడంలోనూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమమని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ(బీఈఈ) కార్యదర్శి మిలింద్ దేవరా అన్నారు. ఏపీ అనుసరిస్తున్న ఇంధన ఆదా విధానాలను అనుసరించాల్సిందిగా అన్ని రాష్ట్రాలకూ ఆయన సూచించారు. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాల ఏజెన్సీల సీఈవోలతో ఆయన వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఆ వివరాలను బీఈఈ దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సలహాదారు చంద్రశేఖరరెడ్డి గురువారం మీడియాకు వెల్లడించారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.160,721 కోట్ల విలువైన ఇంధనాన్ని బీఈఈ డైరెక్టర్ జనరల్, అభయ్ భాక్రే నేతృత్వంలో పొదుపు చేసినట్లు దేవరా వెల్లడించారు. 249.88 బిలియన్ యూనిట్ల విద్యుత్‌తో పాటు, 23.85 మిలియన్ టన్నుల చమురుతో సమానమైన థర్మల్ పవర్‌ను ఏటా ఆదా చేస్తున్నట్లు తెలిపారు. ఈ పొదుపు దేశ ప్రాథమిక ఇంధన సరఫరాలో 6 శాతమని, తద్వారా రూ. 160,721 కోట్ల ప్రయోజనాలు చేకూరాయన్నారు. 2022-23 నుంచి 2024-25 వరకు పెర్మామ్, అచీవ్, ట్రేడ్(పాట్) పథకం ద్వారా జరిగిన ఇంధన ఆదా 8.485 మిలియన్ టన్నుల చమురుతో సమానమని తెలిపారు. కాగా ఇంత భారీ స్థాయిలో ఇంధన సామర్థ్య నిర్వహణ కార్యక్రమాలను అమలు చేయడంలో ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషిని మిలింద్ దేవరా అభినందించారు. ముఖ్యంగా బీఈఈ అమలు చేస్తున్న పాట్ పథకం ద్వారా ఏపీ దాదాపు 1.205 మిలియన్ టన్నుల ఇంధన వినియోగాన్ని రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్(ఏపీఎస్ఈసీఎం) ద్వారా తగ్గించిందని తెలిపారు. బీఈఈ డైరెక్టర్ అభిషేక్ శర్మ మాట్లాడుతూ న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఎనర్జీ ఎఫిషియెన్సీ చర్యల్ని ఏపీ, బీఈఈ అమలు చేశాయని, త్వరలో ఏపీ భవన్‌లో ఇంధన పొదుపు ఫలితాలను ప్రకటించేందుకు ఆలోచన చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ రంగంలో, రాష్ట్రాలు, పట్టణ, స్థానిక సంస్థల్లో ఇంధన పరిరక్షణ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ)ను అమలు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని బీఈఈ డైరెక్టర్ సౌరభ్ దిద్దీ అన్నారు. ఇంధన సామర్థ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మల్టీమీడియా ప్రచారాలు, పాఠశాలల్లో పెయింటింగ్ పోటీలు, రేడియో కార్యక్రమాలు, సోషల్ మీడియాలో ప్రచారం, ఎనర్జీ క్లబ్‌ల ఏర్పాటు వంటి చర్యలు చేపడుతున్నట్లు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు.

3న జాతీయ పల్స్ పోలియో దినోత్సవం

సాక్షి, అమరావతి: జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని ఈనెల 3వ తేదీన నిర్వహించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 53,35,519 మంది 0-5 మధ్య వయసు పిల్లలు ఉన్నట్టు వైద్యశాఖ గుర్తించింది. వీరందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేసేలా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 67,76,100 డోసుల వ్యాక్సిన్ ఇప్పటికే రాష్ట్రానికి రాగా, వ్యాక్సిన్‌ను జిల్లాలకు సరఫరా చేశారు. విద్యా, శిశు సంక్షేమ శాఖలను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 37,921 బూత్‌లలో పోలియో చుక్కలు వేయనున్నారు. 73,581 హౌజ్ టీమ్స్, 1,691 మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. 1.68 లక్షల మంది వ్యాక్సినేటర్‌లు, 4,091 మంది సూపర్‌వైజర్‌లు ఈకార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు.

ముక్కంటి సేవలో 'కాంతార' ఫేం రిషబ్‌శెట్టి



శ్రీకాళహస్తి(తిరుపతి జిల్లా): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం 'కాంతార' ఫేం రిషబ్‌శెట్టి దంపతులు దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నివాసంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి, కుమార్తె పవిత్రారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరుకానున్న 10,52,221 మంది విద్యార్థులు
- 1,559 సెంటర్లను సిద్ధం చేసిన ఇంటర్ బోర్డు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు బోర్డు విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే 8.45 గంటల కల్లా విద్యార్థులు పరీక్ష హాల్లో ఉండాలి. శుక్రవారం మొదటి ఏడాది, శనివారం రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయి. ఈ విద్యా సంవత్సరం మొత్తం 10,52,221 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా, వారిలో మొదటి సంవత్సరం 4,73,058 మంది, రెండో సంవత్సరం 5,79,163 మంది ఉన్నారు. మొత్తం 26 జిల్లాల్లో 1,559 సెంటర్లను సిద్ధం చేశారు. పరీక్షల పర్యవేక్షణకు 147 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 60 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను బోర్డు నియమించింది. వీరితో పాటు ఇంటర్మీడియట్ బోర్డు నుంచి జిల్లాకు ఇద్దరు అధికారులను పంపించారు. పరీక్షలు జరిగే ప్రతి గదిలోనూ సీసీ టీవీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల కెమేరాలతో నిఘా ఉంచారు. పరీక్షకు హాజరైన ప్రతి విద్యార్థి, పరిశీలకుల హాజరును ఆన్‌లైన్ ద్వారా తీసుకోనున్నారు. పరీక్షల సరళిని పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాలోనూ ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షలపై ఇంటర్ బోర్డు 'డిజిటల్ నిఘా'ను ఏర్పాటు చేసింది. పరీక్ష పేపర్లకు మూడు స్థాయిల్లో 'క్యూఆర్' కోడ్‌ను జోడించారు. పేపర్ ఎక్కడ ఫొటో తీసినా, స్కాన్ చేసినా వెంటనే తెలిసిపోయేలా చర్యలు తీసుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే సెంటర్లను కేటాయించడంతో పాటు వీరికి మరో గంట అదనపు సమయం, పరీక్ష రాసేందుకు సహాయకులను అందుబాటులో ఉంచినట్టు ఇంటర్ విద్య కమిషనర్ సౌరభ్ గౌర్ తెలిపారు. కాగా, పరీక్షలు ముగిసేంత వరకు తాడేపల్లిలోని ఇంటర్ విద్య కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణలో ఫిర్యాదులు, గ్రీవెన్స్‌ల స్వీకరణకు 08645-277707, టోల్‌ఫ్రీ నంబర్ 18004251531కు రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కాల్ చేయొచ్చు.

ప్రీతి కేసును నీరుగార్చింది చంద్రబాబే

- సీఎంగా జగన్ వచ్చాక ప్రీతి తండ్రికి ఉద్యోగం, భూమి, ఇంటి స్థలం
- వాస్తవాలను పవన్ వక్రీకరిస్తున్నారు
- ఏపీ ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్ నాయక్



సాక్షి, అమరావతి: పవన్‌కళ్యాణ్ ఒక రాజకీయ పార్టీకి నాయకుడు అనే బాధ్యతను మరిచి మాట్లాడుతున్నాడని, ఏదైనా ఘటనకు సంబంధించిన విషయాలు మాట్లాడేటప్పుడు వాస్తవాలు తెలుసుకోవాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ హితవు పలికారు. తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఉమ్మడి సభలో సుగాలిప్రీతి గురించి పవన్ వాస్తవాలు వక్రీకరించారని ఆయన ఓ ప్రకటనలో ఖండించారు. వాస్తవానికి చంద్రబాబు హయాంలోనే సుగాలి ప్రీతి ఘటన జరిగితే సీఎం జగన్‌కు ఆపాదించి పవన్ మాట్లాడిన తీరు బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. కర్నూలు కట్టమంచి రామలింగారెడ్డి స్కూల్లో సుగాలి ప్రీతి బాయిని 2017 ఆగస్టు 19న అతి కిరాతకంగా అత్యాచారం చేసి హత్య చేశారని తెలిపారు. జరిగిన ఘటనపై వేగంగా దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించి సుగాలి ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేసినా చంద్రబాబు కనీసం స్పందించకపోగా.. కళాశాల యాజమాన్యంతో కుమ్మక్కై కేసును నీరుగార్చారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కర్నూలు పర్యటనకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ దృష్టికి ప్రీతిబాయి తల్లి జరిగిన దారుణం గురించి వివరించగా.. ప్రత్యేక కమిషన్‌కు ప్రీతి కేసు దర్యాప్తును అప్పగించారని గుర్తు చేశారు. ప్రీతిని అత్యాచారం చేసి హత్య చేసినట్టు దర్యాప్తులో నిర్ధారణ అయ్యిందని, అన్యాయానికి గురైన ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రీతి తండ్రి రాజు నాయక్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగంతో పాటు ఐదెకరాల వ్యవసాయ భూమి, 5 సెంట్ల ఇంటి స్థలం ఇచ్చిందని గుర్తు చేశారు.



నిత్య జీవితంలో ఎన్నో కష్టనష్టాలు ఎదురవుతుంటాయి. వాటి వెనుక ఏదో మేలు దాగి ఉంటుందన్న విషయాన్ని గుర్తెరిగితే జీవితం సాఫీగా సాగిపోతుంది.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 1 మార్చి 2024

గోసాయిచిట్కా ప్రకటనలేనా?

ఏ ఉత్పత్తికైనా ప్రచారం కావాలి. ప్రచారానికి ప్రకటనలివ్వాలి. ప్రకటనల్లో చెప్పేదంతా సంపూర్ణ సత్యమని ఎవరూ అనుకోరు కానీ, ప్రజల్ని మభ్యపెట్టేలా అసత్యాల్ని వ్యాప్తిలో పెడితేనే చిక్కు. మరీ ముఖ్యంగా, జీవితాలను ప్రభావితం చేసే ఆరోగ్యం, ఆర్థిక అంశాలపై అసత్య వాణిజ్య ప్రకటనలు ప్రమాదకరం. పాపులర్ యోగాగురు బాబా రామ్‌దేవ్‌కు చెందిన 'పతంజలి ఆయుర్వేద్' సంస్థ ప్రకటనలు సరిగ్గా ఇలాగే 'తప్పుదోవ పట్టించేలా, అసత్యపూర్వకం'గా ఉన్నాయని దేశ సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. రకరకాల జబ్బులు నయమవుతాయంటున్న సదరు ఉత్పత్తుల ప్రకటనలపై తాత్కాలిక నిషేధం విధించింది. పైగా, 'దేశం మొత్తాన్నీ ఇలా ఓ సంస్థ మోసం చేస్తూ ఉంటే', కేంద్రం చోద్యం చూడడాన్ని సుప్రీమ్ కోర్ట్ తప్పుబట్టింది. అలాంటి ప్రచారం చేయరాదని ఉత్తర్వులిచ్చినా సరే ఉల్లంఘించినందుకు గాను సంస్థ ఎండీకి కోర్టు ధిక్కార నోటీసులివ్వడం విశేషం. స్థానిక ఉత్పత్తులతో విపణిలో బహుళ జాతి సంస్థలను మించాలని చూస్తున్న రామ్‌దేవ్ మాత్రం ఇదంతా ఆయుర్వేదంపై, తన మూలికా వ్యాపారంపై సాగుతున్న కుట్ర అని ఆరోపిస్తున్నారు.

టూత్‌పేస్ట్‌ల నుంచి ఆహార ఉత్పత్తులు, మందుల దాకా అన్నీ అందిస్తున్న పతంజలి సంస్థ ఆధునిక వైద్య విధానాలకూ, కోవిడ్ టీకాకరణకూ వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తోందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ 2022లో కోర్టుకెక్కింది. ఇద్దరు జడ్జీల ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. కోవిడ్ వేళ అల్లోపతి వైద్యుల్ని తక్కువ చేసేందుకు రామ్‌దేవ్ ప్రయత్నించారు. ఆ వ్యవహార శైలిని 2022 ఆగస్టులో సుప్రీమ్ కోర్ట్ ప్రశ్నించింది. అసత్య ప్రకటనలు, తప్పుదోవ పట్టించేవాటిని తక్షణమే ఆపేయాలంటూ గత నవంబర్‌లో సుప్రీమ్ ఆదేశించింది. అప్పట్లోనే పతంజలి తరఫు వకీలు సైతం తమ ఉత్పత్తుల ప్రకటనకు సంబంధించి ఇకపై చట్టాన్ని ఉల్లంఘించబోమని కోర్టుకు విన్నవించారు. ఔషధ సామర్థ్యంపై మీడియాలో ప్రకటనలివ్వబోమని కూడా హామీ ఇచ్చారు కానీ కట్టుబడ లేదు.

2006లో ఆరంభమైన పతంజలి శరవేగంతో పైకి వచ్చింది. ప్రపంచమంతా కోవిడ్‌తో అతలాకుతలం అవుతున్నప్పుడు 2020 జూన్‌లో కోవిడ్‌కు మందు కనుక్కున్నామంటూ రామ్‌దేవ్ ప్రకటించారు. 'కరోనిల్, శ్వాసారి' మందుల్ని ఆవిష్కరించారు. అయితే, సంస్థ ఇచ్చిన పత్రాలన్నిటినీ క్షుణ్ణంగా సమీక్షించేంత వరకు సదరు ఉత్పత్తుల వాణిజ్య ప్రకటనల్ని ఆపేయాలంటూ 'ఆయుష్' మంత్రిత్వ శాఖ తేల్చిచెప్పింది. అయినా పతంజలి తన పంథా మానలేదు. సరికదా... కరోనా వేవ్‌లు కొనసాగుతుండగానే 2021 ఫిబ్రవరిలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) నియమానుసారం కోవిడ్ చికిత్సలో అండగా కరోనిల్ మందును వాడవచ్చని 'ఆయుష్' నుంచి ధ్రువీకరణ పత్రం వచ్చినట్టు అబద్ధమాడింది. కానీ, ఏ సాంప్రదాయిక ఔషధ సామర్థ్యాన్నీ తాము పరీక్షించనే లేదనీ, అసలు ధ్రువీకరించనే లేదనీ ఐరాస ఆరోగ్య సంస్థ ప్రకటించేసరికి బండారం బయటపడింది.

ఇదొక్కటే కాదు... పతంజలి చుట్టూ ఎప్పుడూ ఏదో ఒక వివాదమే. 2015లో దేశంలో మ్యాగీ నూడుల్స్‌పై రచ్చ రేగినప్పుడు భారత ఆహార భద్రత, నియంత్రణ సంస్థ ఆమోదమైనా లేకుండానే, పతంజలి ఆటా నూడుల్స్ మార్కెట్‌లోకి వచ్చాయి. ఆహార భద్రతా నియమాలను ఉల్లంఘించారంటూ ప్రభుత్వం ఆనక నోటీసిచ్చింది. అలాగే, 'దివ్యపుత్రజీవక్ బీజ్' వాడితే చాలు అబ్బాయే పుడతాడంటూ 2015లో మరో మందును మార్కెట్‌లోకి తేవడమూ వివాదమైంది. ఇక, 2016లో పతంజలి ఆమ్లా రసం వినియోగానికి పనికిరాదంటూ రక్షణ దళాల క్యాంటీన్ స్టోర్స్ డిపార్ట్‌మెంట్ దాన్ని అమ్మకాన్ని నిలిపేసింది. నిరుడు 'దివ్య దంత మంజన్'ను శాకాహార ఉత్పత్తిగా పేర్కొంటూ దానిలో ఒక జాతి చేపను వాడడమూ రగడయింది. పతంజలి వ్యవహారశైలిపై ప్రత్యర్థుల అభ్యంతరాలు చెప్పడం నిజమే కానీ, ప్రపంచ సంస్థలన్నీ కట్టగట్టుకొని దానిపై కుట్ర చేస్తున్నాయనే మాట అసంబద్ధం.

యోగాతో ఎయిడ్స్, క్యాన్సర్‌లను తగ్గించవచ్చంటూ 2006లోనే ప్రకటించిన రామ్‌దేవ్ వ్యాపార ప్రయాణం రెండు దశాబ్దాలవుతున్నా నేటికీ అనుమానాస్పదమే. రామ్‌దేవ్ మాటల్నే కాదు, పతంజలి ప్రకటనల్నీ ఆరోగ్యశాఖ కొట్టిపారేస్తున్నా సరే... అవే అసత్యాలు విస్తృత ప్రకటనలుగా వ్యాప్తిలో ఉండడం దురదృష్టం. ఏ ఔషధమైనా సరే ఔషధ రెగ్యులేటర్ల కఠిన పరీక్షల్లో పాసై, నిర్ణీత చికిత్సకు ఉపయోగమని ఆమోదం పొందడం అల్లోపతిలో గీటురాయి. అలాగని సంప్రదాయ ఔషధ విధానాలన్నిటినీ కొట్టిపారేయమని కాదు కానీ, పరీక్షకు నిల్చి ఫలితాలతో గెలిస్తేనే ప్రపంచంలో ప్రామాణికత. పతంజలి తన ఉత్పత్తుల టముకు ఎంత మోగిస్తున్నా, అధీకృత శాస్త్రీయ సంస్థలేవీ వాటికి ఆమోదముద్ర వేయలేదు. సాధారణ ఆరోగ్యం కోసమని స్పష్టంగా చెప్పే సంప్రదాయ మందుల్ని నమ్మకం మీద వాడవచ్చు కానీ, కరోనా లాంటి నిర్ణీత వ్యాధుల నివారణకు పరమౌషధం అన్నప్పుడు శాస్త్రీయ నిర్ధారణ పరీక్షలు, ఫలితాలు కీలకం.

అందులో వెనుకబడ్డ పతంజలి తీరా శాస్త్రీయ వైద్యవిధానాలపై అపనమ్మకం రేపుతోంది. సర్వ రోగ నివారిణి తమదే అన్నట్టు ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తే అనవసర ఆరోగ్య సంక్షోభమే. నకిలీ వైద్యులు, గోసాయిచిట్కాలతో ఇల్లు ఒళ్ళు గుల్లవుతాయి. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర యాడ్స్) యాక్ట్-1954 లాంటివి ఎప్పటి నుంచో ఉన్నా, పకడ్బందీగా అమలు చేయడంలో నిర్లిప్తత నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు సుప్రీమ్ చేసిన వ్యాఖ్యలు కీలకమైనవి. అరచేతిలో ఆరోగ్య స్వర్గం చూపే ప్రకటనల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలి. అలాంటి సంస్థలపైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ఇక నైనా, బుద్ధి తెచ్చుకొని పతంజలి తీరు మార్చుకోవాలి. తలబొప్పి కట్టిన పాలకులు బాధ్యతల నిర్వహణలో చిత్తశుద్ధి చూపాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.3.14 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** స్వాతి ఉ.9.16 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** ప.3.11 నుండి 4.50 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.41 నుండి 9.28 వరకు తదుపరి ప.12.34 నుండి 1.21 వరకు, **అమృతఘడియలు:** రా.1.15 నుండి 2.56 వరకు.

సూర్యోదయం : 6.24
సూర్యాస్తమయం: 6.57
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కలిసి నడుస్తోన్న భారత్!

విశ్లేషణ


మనోజ్ జోషీ

భౌగోళిక రాజకీయ స్థిరత్వంపై భాగస్వామ్య ఆసక్తి దృష్ట్యా ఈ ప్రాంత భద్రత విషయంలో భారతదేశం పెద్ద పాత్రనే పోషిస్తోంది. గత సంవత్సరం యూఏఈతో, ఫ్రాన్స్‌తో తన మొదటి త్రైపాక్షిక విన్యాసాలను భారత్ నిర్వహించింది. ప్రస్తుతం భారత నౌకాదళం వాయవ్య అరేబియా సముద్ర జలాల్లో అసాధారణంగా చురుకుగా ఉంది. హౌతీల హెచ్చరికలకు గురైన వాణిజ్య నౌకలకు రక్షణ కల్పిస్తోంది. అంతేకాదు, బహ్రెయిన్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న అమెరికా నేతృత్వంలోని కంబైన్డ్ టాస్క్ ఫోర్స్‌లో భారతదేశం పూర్తి స్థాయి సభ్యదేశంగా మారింది. పశ్చిమాసియాలో ఈ విధమైన భారతదేశ ప్రయత్నాలు.. దేశ భద్రత, ఆర్థిక ప్రయోజనాల రీత్యా ముఖ్యమైన వ్యూహాత్మక అవకాశాలకు దారితీశాయి.

ఇటీవల భారతదేశ విదేశాంగ విధానం ఆసక్తికరమైన ఒక వైరుధ్యాన్ని కనబరిచింది. కేంద్ర ప్రభుత్వం తూర్పు వైపు చూడటం, తూర్పు దేశాలతో వ్యవహరించడం గురించి మాట్లాడుతోంది కానీ వాస్తవానికి అది పశ్చిమ దేశాలతోనే ఎక్కువగా ఉంది. ఆ వైరుధ్యం ఎలాగున్నా ప్రధానమంత్రి మోదీ స్వయంగా పశ్చిమాసియా దేశాలను ఆకర్షించడంలో అపారమైన సమయాన్ని, కృషిని పెట్టుబడిగా పెట్టారు. ఈ కారణంగా.. ఇంధనం మీద, ప్రవాసులపైన ఆధారపడిన మన సంబంధాలు ఇప్పుడు రాజకీయ, ఆర్థిక, రక్షణపరమైన ప్రయోజనాలను పొందుతున్నాయి. వాస్తవానికి చైనా మాదిరిగా పశ్చిమాసియా ప్రాంతంలో పెట్టుబడులు పెట్టగల సామర్థ్యం భారతదేశానికి లేదు, అయితే ప్రవాస భారతీయులు, అమెరికా, ఇజ్రాయెల్, ఫ్రాన్స్‌లతో భాగస్వామ్యం భారత్‌కి ఆ దిశగా ఇతర ప్రత్యామ్నాయ ఎంపికలను కల్పిస్తోంది.

ఇజ్రాయెల్, ఇండియా-యూఏఈ, యు.ఎస్.లతో కూడిన ఐ2యూ2 గ్రూపింగ్‌లోనూ; ఇండియా, మధ్యప్రాచ్యం, యూరోప్ ఎకనామిక్ కారిడార్‌లోనూ భారతదేశ భాగస్వామ్యంలో ఈ చొరవ వ్యక్తమవుతోంది. మొదటిది ఇజ్రాయెల్, ఇండియా, యూఏఈ, అమెరికాలను కలుపుతూ ఒక రకమైన పాశ్చాత్య క్వాడ్‌గా పరిగణన పొందుతోంది. ఇక రెండోది యూఏఈ, సౌదీ అరేబియా, ఇజ్రాయెల్‌ల నుంచి వెళుతున్న మల్టీమోడల్ ప్రాజెక్ట్ ద్వారా భారతదేశాన్ని యూరప్‌తో అనుసంధానించడానికి అమెరికా ముందుకు తెచ్చిన ప్రతిష్ఠాత్మకమైన కనెక్టివిటీ వెంచర్. 2014లో అధికారం చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ ఏడోసారి యూఏఈ పర్యటనకు ఈ నెల ప్రారంభంలో వెళ్లారు. అబుదాబీలో తొలి హిందూ దేవాలయాన్ని ప్రారంభించి, ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందంపై సంతకం చేశారు. ఆ తర్వాత ఆయన ఖతార్‌కు వెళ్లారు. గూఢచర్యం ఆరోపణతో అక్కడ ఖైదీలుగా ఉన్న ఎనిమిది మంది భారతీయులకు ఖతార్ రాజరికపు క్షమాపణను పొందే క్రమంలో 2048 వరకు 78 బిలియన్ డాలర్ల విలువైన సహజ వాయువు దిగుమతి ఒప్పందాన్ని పొడిగించగలిగారు.

ఈ ప్రాంతంలో ముఖ్యమైన 'ప్లేయర్' అయిన చైనా తన ఆటను జాగ్రత్తగా ఆడుతోంది. గల్ఫ్ దేశాలు, పాలస్తీనా, ఇజ్రాయెల్ మధ్య భారతదేశం తన స్థానాన్ని నిర్దేశించుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలోనే... చైనా ఇజ్రాయెల్ నుండి పక్కకు తొలగిపోయింది. పైగా తటస్థ, సంభావ్య శాంతికర్తగా తనను తాను ప్రదర్శించుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఈజిప్ట్, ఇరాన్ నుండి సౌదీ అరేబియా, ఒమన్ వరకు మొత్తం ప్రాంతాన్ని తన పెట్టుబడితో, ప్రాధాన్యంతో చుట్టుముడుతున్న చైనాకు పోటీదారుగా ఉద్భవించడానికి భారతదేశం ఇప్పుడు పావులు కదుపుతోంది.

ఇటీవలి కాలంలో యూఏఈ భారతదేశ రెండవ అతి పెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉద్భవించింది. 2022లో ఇరుపక్షాలు స్వేచ్ఛా


యు.ఎ.ఇ.లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన (ఫైల్ ఫొటో)

వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశాయి. సంవత్సరంలో యూఏఈతో భారత వాణిజ్యం 16 శాతం పెరిగి 85 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారతదేశంతో ద్వైపాక్షిక మదుపు ఒప్పందం (బీఐటీ), స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) రెండింటిపై సంతకం చేసిన ఏకైక దేశం యూఏఈ. ఈ విధానంలో భాగంగా ఒక ప్రధాన ప్రయత్నం ఏమిటంటే, జెబెల్ అలీ ఫ్రీ ట్రేడ్ జోన్‌లో రిటైల్, వేర్ హౌసింగ్, లాజిస్టిక్స్ సౌకర్యాల సృష్టి ద్వారా భారతీయ ఎగుమతుల్ని ప్రోత్సహించడం. భారత్ మార్ట్ అనే జాయింట్ వెంచర్‌తో ఇది లాజిస్టిక్స్, పోర్ట్ కార్యకలాపాలు, సముద్ర సేవలలో ప్రత్యేకత కలిగిన డీపీ వరల్డ్ అనే యూఏఈ కంపెనీతో ముడిపడి ఉంది.

భౌగోళిక రాజకీయ స్థిరత్వంపై భాగస్వామ్య ఆసక్తి దృష్ట్యా, ఈ ప్రాంత భద్రత విషయంలో భారతదేశం పెద్ద పాత్ర పోషిస్తోంది. గత సంవత్సరం యూఏఈతో, ఫ్రాన్స్‌తో తన మొదటి త్రైపాక్షిక విన్యాసాలను భారత్ నిర్వహించింది. ప్రస్తుతం భారత నౌకాదళం వాయవ్య అరేబియా సముద్రజలాల్లో అసాధారణంగా చురుకుగా ఉంది. హౌతీల హెచ్చరికలకు గురైన వాణిజ్య నౌకలకు రక్షణ కల్పిస్తోంది. బహ్రెయిన్‌లో ప్రధాన కార్యాలయం ఉన్న అమెరికా నేతృత్వంలోని కంబైన్డ్ టాస్క్ ఫోర్స్‌లో భారత్ పూర్తి స్థాయి సభ్యదేశంగా మారింది.

ఈ ప్రాంతంలో భారత్‌కు అవకాశాల కొరత లేదు. సౌదీ అరేబియా ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ వంటి పాలకులు భారత్‌కు తలుపులు తెరిచేశారు. అంతర్జాతీయ గోల్ఫ్ నుండి ప్రీమియర్ సాకర్ వరకు, భవిష్యత్ కొత్త నగరం నుండి ప్రపంచ విమానయాన సంస్థను నిర్మించడం వరకు ప్రతిదానిలో పెట్టుబడి పెట్టడానికి లేదా పెట్టుబడిని ప్రతిపాదించడానికి వారు ముందుకొచ్చారు. యూఏఈకి చెందిన అతి పెద్ద సావరిన్ వెల్త్ ఫండ్ భారతీయ మౌలిక సదుపాయాల కోసం 75 బిలియన్ డాలర్లకు పైగా మదుపు చేయడానికి కట్టుబడింది. సౌదీ కంపెనీలు 100 బిలియన్ డాలర్లను ఆఫర్ చేశాయి.

సంపన్న అరేబియా రాజ్యాలు రెండూ చమురును దాటి తమ ఆర్థిక ప్రణాళికల్ని ముందుకు తీసుకెళ్లే మార్గాల్ని భారత ఆర్థికవృద్ధిలో చూస్తున్నాయి. సౌదీ రాజు 'విజన్ 2030'... రెండు ట్రిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను నిర్వహించడానికి, సౌదీ వెల్త్ ఫండ్ అయిన పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌కి పిలుపునిచ్చింది. అదిప్పుడు 718 బిలియన్ డాలర్ల వరకు చేరుకుంది. సౌదీలు తమ ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో ఉన్నారు. సాంకేతికత బదిలీపై, అభివృద్ధిపై షరతులు విధించిన చైనా కంపెనీలు తిరిగి సౌదీలకు అపూర్వ మైన ఒప్పందాల్ని అందించడానికి చైనా ఆర్థిక సమస్యలే ఒప్పించాయి.

ఈ పరిణామాలకు వెలుపలే మిగిలిన ఒక ప్రధాన దేశం ఇరాన్. అమెరికా ఆంక్షలే దీనికి కారణం. ఇష్టం ఉన్నా లేకున్నా పాకిస్తాన్, మధ్య ఆసియాకు సంబంధించి భారత్ లెక్కలలో ఇరాన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది భారతదేశానికి దగ్గరగా ఉన్న హైడ్రోకార్బన్ దేశం కూడా. చైనీయుల విషయానికొస్తే సౌదీ-ఇజ్రాయెల్‌కు సంబంధించి తమ ఇటీవలి ఎత్తుగడల విషయమై వారు పునరాలోచనలో పడినా, ఇప్పటికీ కొనసాగుతున్న సౌదీ-ఇరాన్ ఘర్షణ విషయమై మధ్యవర్తిత్వం నెరపటంలో వారు విజయవంతమయ్యారు.

చైనా తన పెట్టుబడులను ఈ ప్రాంతం అంతటా విస్తరించినప్పటికీ, ఇరాన్‌లో దాని వాగ్దానాలను అమలుపరచలేదు. యూఏఈ, సౌదీ అరేబియా (ఒక్కొక్కటి 8 బిలియన్ డాలర్లు), టుర్కీయే (5.8 బిలియన్ డాలర్లు) ఇరాక్ (4.3 బిలియన్ డాలర్లు) కంటే 2013-16 కాలంలో 16 బిలియన్ డాలర్ల విలువైన చైనీస్ పెట్టుబడితో దాని పెద్ద లబ్ధిదారుగా పాకిస్తాన్ నిలిచింది. ఇరాన్‌కు 0.35 బిలియన్ డాలర్లే లభించాయి. సాంకేతికత, ఆయుధాల ఎగుమతి దన్నుగా ఉన్న చైనాతో పాటుగా ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టగల సామర్థ్యం భారత దేశానికి లేదు. కానీ తనకున్న అపారమైన వలస నైపుణ్యాలతో పాటు అమెరికా, ఇజ్రాయెల్, ఫ్రాన్స్‌లతో భాగస్వామ్యం ఇండియాకు ఇతర ప్రత్యామ్నాయాల ఎంపికలకు వీలు కల్పిస్తోంది.

ప్రస్తుతానికి, పశ్చిమాసియా ప్రాంత భౌగోళిక రాజకీయ భవిష్యత్తు ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంతో మసకబారిపోయి ఉంది. ఇజ్రాయెల్‌తో సంబంధాల్ని మామూలు స్థితికి తెచ్చే విధానం నుండి యూఏఈ వైదొలగనప్పటికీ, శాంతికై సౌదీలు ఇంకా వేచి చూస్తూనే ఉన్నారు. ఈలోగా ఇథియోపియా, ఇరాన్, ఈజిప్టులతో పాటు యూఏఈ, సౌదీ అరేబియా రెండూ విస్తరించిన బ్రిక్స్‌లో చేరిపోయాయి.

పశ్చిమాసియాలో ఈ విధమైన భారతదేశ ప్రయత్నాలు... దేశానికి భద్రత, ఆర్థిక ప్రయోజనాలలో ముఖ్యమైన వ్యూహాత్మక అవకాశాలను తెరవడానికి దారితీశాయి. అయితే ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదం, చైనా ప్రాంతీయ ఆకాంక్షలు రేపిన అల్లకల్లోలం మధ్య న్యూఢిల్లీ జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది.

వ్యాసకర్త 'డిస్టింగ్విష్డ్ ఫెలో', అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

సోషల్ నెట్‌వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

పారిపోకండి



చీకాకుల నుంచి బయటపడేందుకు నిజాయతీగా నేను చెప్పే మార్గం ఏమిటంటే – ఆ చీకాకులకు సంబంధం లేని, ఊహల్లో మిమ్మల్ని హాయిగా విహరింపజేసే పాటలను విననేవద్దని!
– నీనా ఉప్పల్, 'ఫూల్ మీ ట్వైస్' రచయిత్రి

ఇకనైనా విధిస్తారా?!



మణిపుర్‌లో ఒక సీనియర్ పోలీసాఫీసర్ కిడ్నాప్‌కు గురైతే, నిరసనగా కమెండోలు ఆయుధాలు పక్కనబెట్టారు. భద్రతా దళాలకే భద్రత లేక, 8 నెలలుగా శాంతి భద్రతలు కుప్పకూలిన రాష్ట్రంలో ఇకనైనా రాష్ట్రపతి పాలన పెడతారా? లేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలోనే రాష్ట్రపతి పాలన కావాలని కోరతారా?!
– సాగరికా ఘోష్, సీనియర్ జర్నలిస్ట్

నీటి 'కోత'



ముంబై ఇప్పుడు నీటి 'కోత'ను ఎదుర్కొంటోంది. అది కూడా ఎంతో ముఖ్యమైన 'వర్లీ సీ ఫేస్' ప్రాంత సమీపంలో! నీళ్ల ట్యాంకర్‌లతో సిటీని శుభ్రంగా కడిగించటం అనే పనికిమాలిన ఆలోచన చేసిన అసమర్థ సీఎం వల్ల ఈ కోత ఏర్పడింది. ట్యాంక్ ధర ఎంతో తెలుసా?!
– ఆదిత్య ఠాక్రే, శివసేన 'యువసేన' అధ్యక్షులు

ఇదీ రియాలిటీ!



ఊహించండి. విశ్వ విఖ్యాతి చెందిన, ఎంతో ఖరీదైన మిచెలిన్ స్టార్ రెస్టారెంట్‌లో అతి కష్టమ్మీద, మీ పలుకుబడి ఉపయోగించి సీటు సంపాదించి వెళ్లి కూర్చున్నాక, లోపల వంటగదిలో 'మాస్టర్ చెఫ్' కుకింగ్ షో షూట్‌లో మాస్టర్‌లు తగాదా పడుతుండటం వల్ల వెయిటర్ మీకు ఉడికీ ఉడకని పదార్థాలను వడ్డించినప్పుడు మీకెలా అనిపిస్తుంది?!
– రాయ్ చోప్రా, గూగుల్ యూత్ అడ్వైజర్

అడుగుతారా?



వివిధ ఛానళ్ల విలేఖరులు జామ్‌నగర్‌లో అంబానీ కుటుంబాన్ని ఇంటర్వ్యూ చేస్తున్నారు. ముఖేశ్ అంబానీ నడుపుతున్న న్యూస్ 18లో భారత ముస్లిమ్ వర్గంపై సాగుతున్న దాడి, ఆ ఛానల్ యాంకర్ల పాత్ర గురించి అడిగే ధైర్యం ఎవరైనా చేస్తే బాగుండు! డిబేట్లలో తమ స్టార్ యాంకర్ల పద్ధతి యజమానులైన అంబానీలకు ఒకేనా? లేక ఇది కూడా మేనేజ్‌మెంట్ వ్యూహంలో భాగమా?
– మహమ్మద్ జుబైర్, 'ఆల్ట్ న్యూస్' కో ఫౌండర్

ఓటర్లకు 'విజ్ఞప్తి'!!



"మీరు మాకు వ్యతిరేకంగా ఓటు వేయటానికి బయటికి వస్తే మేము మీ చర్మం ఒలిచి, ఎముకలు విరిచేస్తాం. మీ చేతులు నరికేస్తాం"– ఈ మాట అన్నది ఈడీ అధికారులపై దాడి చేసి పరారీలో ఉన్న టీఎంసీ నాయకుడు షేక్ షాజహాన్ కాదు. పశ్చిమ బెంగాల్‌లోని పంచాయితీ లెవల్ టీఎంసీ లీడర్ జ్యోతిలేశ్వర్ మండల్! హత్య చేసి ఎలా తప్పించుకోవచ్చో అతడికి బాగా తెలిసినట్లుంది.
– అభిజిత్ మజుందార్, చీఫ్ ఎడిటర్, 'ఇయర్‌షాట్.ఇన్'

ఒకటి చాలదా!!



1999లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పతనమైందన్న సంగతి మనం మరచిపోకూడదు. ఆ ఓటు ఎవరు వేశారు? గిరిధర్ గొమాంగ్ (కాంగ్రెస్) ఒడిశా సీఎం అయినప్పటికీ లోక్‌సభకు రాజీనామా చేయలేదు. ఆ సందేహాస్పద ఓటుతో 13 నెలల ప్రభుత్వం కుప్పకూలిపోయింది. ప్రతి ఓటూ ముఖ్యమైనదే!
– స్మితా ప్రకాష్, ఏషియన్ న్యూస్ ఇంటర్నేషనల్

ఇన్ బాక్స్

యువతను రక్షించుకోవాలి!


నేటి అంతర్జాల యుగంలో యువత చుట్టూ భయంకరమైన ప్రతికూల వాతావరణం అలముకుని ఉంది. వారిలో నెలకొన్న నిరాశావాదం, చిరాకు, నిరుత్సాహం, అసంతృప్తి, అనిశ్చితత్వం, విరక్తి వంటి గుణాలు క్రమేణా ఈ ప్రతికూల వాతావరణం వల్ల పెరిగి, వారిలోని సృజనాత్మకతనూ, చైతన్యాన్నీ నశింప చేస్తున్నాయి. దీనివల్ల వారిలో విపరీతమైన కోపం, ఆవేశం, అలసట అలుముకుంటున్నాయి. ఫలితంగా కనీసం తమ కుటుంబ సభ్యులతో కూడా కూర్చుని మాట్లాడే ఓపిక వారిలో మాయమవుతోంది. నేడు సమాజంలో జరుగుతున్న హింసాత్మక సంఘటనలు, విద్వేష పూరితమైన రాజకీయ వాతావరణం, విషపూరితమైన సంస్కృతి వంటి వాటివల్ల యువత ఆలోచనా ధోరణి పెడమార్గంలో సాగుతోంది.

ఇటువంటి వాతావరణం నుంచి మనం భావి పౌరుల్ని రక్షించుకోవాలి. మన చుట్టూ నేడు అలుముకున్న కుల, మత, వర్గ, వర్ణ విభేదాలన్నిటినీ దాటుకుని మనం ఆలోచించగలిగినప్పుడే ఇది సాధ్యపడుతుంది. మనలోని ప్రతి ఒక్కరం యువతలో మార్పు తీసుకు రాగలం. ఒక ఉపాధ్యాయుడు భిన్న సంస్కృతుల మధ్య మెలిగే విద్యార్థులలో పరస్పర అవగాహన, స్నేహభావాలను పెంపొందించ గలగాలి. ఒక సామాజిక కార్యకర్త పాఠశాల విద్యార్థులకు మన దేశంలోని విభిన్నమైన సాంస్కృతిక సమ్మేళనం, జీవన విధానాల గూర్చి అవగాహన కలిగించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలు చూస్తున్న సినిమాలు, చదువుతున్న పుస్తకాలు, సామాజిక మాధ్యమాలలో వారి కార్యకలాపాలు వంటి వాటిపై ఒక కన్ను వేసి ఉంచాలి. తరచుగా పిల్లలతో కూర్చొని మంచి చెడ్డలు మాట్లాడి వారిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. గాంధీ, రవీంద్రనాథ్ టాగూర్, అంబేడ్కర్ వంటి వాళ్ళు ప్రతికూల పరిస్థితులను ఏ విధంగా అధిగమించారో తెలియ చెప్పాలి. నిజమైన జ్ఞానం రుచి తెలియక, నేడు వాళ్లకు అందుబాటులో ఉన్న సమాచారాన్నే జ్ఞానంగా యువత భ్రమిస్తున్నారు. వీరిచుట్టూ ఉన్న ఈ బురదను కడిగితే కలువ పూలలా వికసిస్తారు. ఇవేవీ చేయకుండా మనం కనుక ఇప్పుడు మౌనంగా, ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోతే, చరిత్ర మనల్ని క్షమించదు.
– ఈదర శ్రీనివాస రెడ్డి, నాగార్జున యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

పేదల ఇంట చదువుల దీపం

సందర్భం


కైలే అనిల్ కుమార్

సమాజాన్నీ, దేశాన్నీ సమూలంగా మార్చ గలిగిన శక్తి ఒక్క విద్యకే ఉంది. అందుకే వైసీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీట వేసింది. దాని ఫలితాలు ఇప్పటికే కనిపించడం ప్రారంభమయింది. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి చేస్తున్న సేవ సామాన్యమైనది కాదు. ఆయన కాలంలోనే ప్రభుత్వ బడులకు జీవం వచ్చింది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే కళ వాటికి వచ్చింది. పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం చదువు వచ్చింది. బడుల్లో రుచికరంగా తినడానికి 'జగనన్న గోరు ముద్ద' వచ్చింది. పుస్తకాలు కొనుక్కోవడానికే కష్టపడే నిరుపేద విద్యార్థుల చేతికి ఏకంగా ట్యాబ్ వచ్చింది. కార్పొరేట్ స్కూళ్లలో చదివే ధనవంతుల పిల్లలకు కూడా లేని 'బైజూస్' కంటెంట్ వచ్చింది. పట్టణాలకే... అది కూడా ధనవంతులకే పరిమితమైన సీబీఎస్సీ సిలబస్ మన ఊరి బాట పట్టింది. 'ఐబీ' సిలబస్ కూడా మన గవర్నమెంట్ బడులకు వస్తోంది. మన బ్లాక్‌బోర్డుల స్థానంలో 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్' వచ్చి చేరాయి.

ఫలితంగా పేదల పిల్లలకు నాణ్యమైన చదువు వస్తుంది. ఇంగ్లీష్ బాగా వస్తుంది. మేథమేటిక్స్, సైన్స్‌లో మన పిల్లలు రాటు దేలుతారు. మంచి మంచి కాలేజీల్లో సీట్లు సంపాదిస్తారు. సీట్లు సంపాదిస్తే 'విద్యా దీవెన', 'వసతి దీవెన' ఇచ్చి... సీఎం జగన్ వెన్ను దన్నుగా నిలబడి పేద పిల్లలను చదివిస్తారు. అలా చదువుకున్న పిల్లలు మంచి మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. దీంతో వాళ్ల కుటుంబాలు బాగు పడతాయి. ఇంట్లో ఒక్కరు మంచి ఉద్యోగం సంపాదిస్తే చెల్లి, తమ్ముడు ఉంటే వారిని చేయిపట్టి నడిపిస్తారు. వారిని కూడా వృద్ధిలోకి తెస్తారు. అలా ఒక్కో పేదింటికి వెలుగులు వస్తాయి. మొత్తం సమాజమే



పేదరికం నుంచి బయటపడుతుంది.

ఇది ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వల్లే జరుగుతుంది. ఆయనకు పేదలను గట్టెక్కించి వారి ఇళ్లల్లో వెలుగులు నింపాలనే తపన, చిత్తశుద్ధి ఉంది. వారి అభివృద్ధిని చూసి ఉప్పొంగిపోయే మనసు ఉంది. పేదల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన త్యాగ గుణం ఉంది. ఎన్ని కష్టాలు ఎదురైనా పేదల కోసం నిలబడే తెగువ ఉంది. ఎవరు వచ్చినా, ఎందరు ఏకమైనా సరే... మనందరి బాగు కోసం తెగబడి కొట్లాడే చిత్తశుద్ధి ఉంది. పార్టీలన్నీ ఏకమై ఉన్నవీ, లేనివీ కల్పించి ముప్పేట దాడికి తెగబడినా; గాలి పోగేసి యెల్లో మీడియా నిత్యం కడుపు మంటతో బురద జల్లుతున్నా... తొణకని, బెణకని గుండె నిబ్బరంతో ముందుకుసాగుతున్నారు. ఆయన ప్రభుత్వం వల్ల ప్రయోజనం పొందని కుటుంబం ఈ రాష్ట్రంలో ఒక్కటైనా ఉందా? అందుకే ఎన్ని గాలి వార్తలు షికారు చేసినా ముఖ్యమంత్రి జగన్ తాను మేలు చేసిన ప్రజలనే నమ్ముకుని వారికి మరింత మేలు చేయడానికి కృషి చేస్తున్నారు.

పెత్తందార్ల పాలన నుంచి బయట పడిన పేదలు ఇవ్వాళ ఆత్మగౌరవంతో బతుకుతున్నారు. బడుగులూ, బలహీనులూ, మైనారిటీలూ సామాజికంగా, ఆర్థికంగా మునుముందుకు పోతున్నారు. మహిళా సాధికారత వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రధాన విజయం అని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ఇవ్వాళ అన్ని వర్గాల వారిలో అడుగడుగునా అండగా ప్రభుత్వం ఉందనే భరోసా కనిపిస్తోంది. ఇంతకంటే ఇంకేం కావాలి? అందుకే మరోసారి ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డే ఉండాలనే వాంఛ ప్రజల్లో ప్రబలుతోంది.

వ్యాసకర్త పామర్రు ఎమ్మెల్యే, కృష్ణా జిల్లా
(నేడు పామర్రులో సీఎం జగన్ 'విద్యా దీవెన' నిధుల విడుదల చేస్తున్న సందర్భంగా)

మహనీయ చరితులు

భారతీయ తాత్విక చింతనా స్రవంతిని జీవ జలధారలచే పరిపుష్టం చేసిన మహనీయులు కొందరు చరిత్రలో ఒక సమూహంగా మనకు దర్శనమిస్తారు. వారి గురించి సంగ్రహంగా...

1. **సప్తర్షులు:** వీరు ఏడుగురు ఏడు నక్షత్రాలుగా ఆకాశంలో ప్రకటమౌతున్నారు. అదే సప్తర్షి మండలం. వీరు ప్రతి మన్వంతరంలో మారుతుంటారు. ఇపుడు నడుస్తున్నది ఏడోదైన వైవస్వత మన్వంతరం. ఈ మన్వంతరంలో సప్తర్షులు: కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, వసిష్ఠుడు, జమదగ్ని. సప్తర్షుల పేర్లు వివిధ గ్రంథాలలో స్వల్ప మార్పులతో కన్పిస్తాయి.

జ్యోతిర్మయం

2. **పంచర్షులు:** వీరు ఐదుగురు. సానగు, సనాతన, అహభూన, ప్రత్న, సుపర్ణ. సప్తర్షుల, పంచర్షుల ప్రస్తావన వేదాల్లో ఉన్నది. వీరందరూ గోత్ర ఋషులుగా ప్రసిద్ధులు.

3. **నవనాథులు:** వీరు తొమ్మండుగురు. దత్తాత్రేయ సంప్రదాయాన్ని వ్యాప్తి చేసినవారు. వీరి పేర్లు మచ్ఛేంద్రనాథ్, గోరఖ్‌నాథ్, జలంధర్ నాథ్, కనీఫ్‌నాథ్, గహినీనాథ్, నగేష్‌నాథ్, చర్పత్‌నాథ్, భర్తరీనాథ్, రేవణనాథ్.

4. **మహాసిద్ధులు:** వీరు 84 మంది. బౌద్ధంలో 'మహాముద్ర' అనే తాంత్రిక సంప్రదాయం ఒకటి ఉన్నది. మొదటగా ఆ సంప్రదాయాన్ని నెలకొల్పి వ్యాప్తి చేసినవారు వీరు. వీరిని మహాసిద్ధులని పిలుస్తారు. వీరు భారతదేశంలో క్రీ.శ. 8-12 శతాబ్దాల మధ్య జీవించారు. వీరిలో కొందరి పేర్లు విరూప, సరహా, నరోపా, నిర్గుణపా. వీరిలో యోగిని మణిభద్ర, యోగిని భద్ర మేఖల వంటి స్త్రీలూ ఉన్నారు. వీరందరి గురించిన సమాచారం కీత్‌డౌన్ రాసిన 'మాస్టర్స్ ఆఫ్ మహాముద్ర' అనే ఆంగ్ల గ్రంథంలో చూడవచ్చు.

5. **నాయన్మార్లు:** వీరు 63 మంది. శివభక్తులు. వీరి గురించి చెప్పేదే పెరియ పురాణం. తమిళ దేశంలో శివాలయాలు దర్శిస్తూ భక్తి పాటలు పాడుతూ సంచరించారు. వీరి కాలం క్రీ.శ. 6-9 మధ్య. సుందరర్, అప్పర్, సంబంధర్ వీరిలో ముఖ్యులు.

6. **ఆళ్వార్లు:** వీరు పన్నిద్దరు. అనగా పన్నెండుగురు. విష్ణు భక్తులు. వీరు పాడిన పాటలు పాశురాలు. అవి నాలుగు వేలు. నాలాయిరంగా ప్రసిద్ధం. నమ్మాళ్వార్, ఆండాళ్ వీరిలో ముఖ్యులు.

నాయన్మార్లు, ఆళ్వారులు దేశంలో భక్తి పరిమళాన్ని గుబాళింపచేశారు.
– దీవి సుబ్బారావు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఓ అన్నలా మమ్మల్ని ఆదుకున్నారు



నా వయస్సు 28 సంవత్సరాలు. నాలుగేళ్ల క్రితం ఓ ప్రమాదంలో నా భర్త యువరాజు, కొడుకు కార్తీక్ చనిపోయారు. మిగిలిన కూతురుతో కలిసి అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం గుట్టపల్లె పంచాయతీ బి.వడ్డిపల్లెలో బతుకు వెళ్లదీస్తున్నా. నా భర్త, కొడుకు చనిపోయినపుడు ఎలా బతకాలో తెలియక ఓ సమయంలో ఆడబిడ్డతో కలిసి చనిపోదామనుకున్నా. అలాంటి సమయంలో నా భర్త పేరిట వైఎస్సార్ బీమా ఉందని వలంటీర్ చెప్పారు. బీమా కింద రూ.5 లక్షలు అందాయి. మా బతుకులకు కాస్త ధైర్యం వచ్చింది. నా కూతురు కీర్తి కస్తూర్బా పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. అమ్మఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు అందుతున్నాయి. వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రూ.40 వేలు అందింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఓ అన్నలా మమ్మల్ని ఆదుకుంటున్నారు. ప్రతి నెల పింఛన్ ఇస్తున్నారు. ఏ దిక్కూ లేని నాకు పింఛనే ఆధారం. మాకు సొంతంగా ఇంటి స్థలం ఉండటంతో దానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇప్పించారు. మాలాంటి అభాగ్యులు ఆనందంగా జీవించాలంటే జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– దేరంగుల మమత,
బి.వడ్డిపల్లె, సంబేపల్లె మండలం
(ముక్తా జయప్రసాద్, విలేకరి, సంబేపల్లె)

మా పిల్లల చదువు ఈ ప్రభుత్వ చలవే



నా భర్త ప్రైవేట్ (మోటార్ ఫీల్డ్) పనులు చేస్తుంటారు. ఆయన సంపాదన జీవనానికే సరిపోతోంది. 18 ఏళ్లుగా విశాఖ నగరంలోని మాధవధార రాజీవ్‌నగర్‌లో ఉంటున్న మాకు పిల్లల్ని పెద్ద చదువులు చదివించే స్థాయి లేదు. సరైన సమయంలో వైఎస్ జగన్ అధికారంలోకి రావడం మా అదృష్టం. ఆపన్న హస్తంలా మా పిల్లల చదువుకు సాయం అందించారు. మా ఇద్దరు పిల్లలు ఇంజినీరింగ్ చదువుతున్నారంటే దానికి కారణం ఈ ప్రభుత్వమే. పెద్దబ్బాయి అనిట్స్‌లో బీటెక్ 4వ ఏడాది చదువుతున్నాడు. రెండో అబ్బాయి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీలో 3వ ఏడాది బీటెక్ చదువుతున్నాడు. ఇద్దరికీ జగనన్న విద్యా దీవెన అందుతోంది. మాకు శ్రీకాకుళం జిల్లాలో 65 సెంట్ల పొలం ఉంది. దానిపై ఏటా రూ.13,500 వంతున వైఎస్సార్ రైతు భరోసా వస్తోంది. నాకు వైఎస్సార్ చేయూత మంజూరైంది. టిడ్కో ఇల్లు కూడా ప్రాసెస్‌లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో మాకు ఎలాంటి సాయం అందలేదు. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– పాలవలస లావణ్య,
మాధవధార, విశాఖపట్నం
(పి.పద్మజ, విలేకరి, మద్దిపాలెం)

ఇంటిల్లిపాదినీ ఆదుకున్నారు



మాది వ్యవసాయ మధ్య తరగతి కుటుంబం. విజయనగరం జిల్లా మెరకముడిదాం మండలం పెదపూతికవలస గ్రామంలో ఒక పూరింట్లో ఉండేవాళ్లం. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇంటి కోసం ఆ పార్టీ నాయకుల దగ్గరకు వెళితే జన్మభూమి కమిటీల వద్దకు వెళ్లాలని చెప్పేవారు. జన్మభూమి కమిటీల వద్దకు వెళితే నాయకుల సిఫార్సు కావాలనేవారు. ఇలా కాళ్లరిగేలా తిప్పించుకున్నారే కానీ ఇల్లు మాత్రం మంజూరు చేయలేదు. ఇక మాకు సొంతిల్లు కలగానే మిగిలి పోతుందని బాధ పడేవాళ్లం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, నాలాంటి వారికి ఇల్లు మంజూరు చేస్తున్నారని తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నాను. కొద్ది రోజుల్లోనే ఇంటి స్థలం మంజూరైంది. ప్రభుత్వం 1.80 లక్షలు ఇవ్వడంతో ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు ఆ ఇంటిలోనే నివసిస్తున్నాం. మా అమ్మ మజ్జి సూరీడమ్మకు వైఎస్సార్ చేయూత ద్వారా సంవత్సరానికి రూ.18,750 చొప్పున వచ్చాయి. మా నాన్న మజ్జి పైడినాయుడుకు పింఛను వస్తోంది. 1వ తేదీ వేకువజామునే ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. నాకు, మా నాన్నకు రైతు భరోసా కింద మూడేళ్లుగా లబ్ధి కలిగింది. నా భార్య మజ్జి సుజాత టైలరింగ్ చేస్తోంది. ఆమెకు రూ.10 వేల చొప్పున మూడు పర్యాయాలు వచ్చింది. మా పాప మజ్జి సౌమ్యకు అమ్మఒడి కింద ఏటా రూ.15 వేలు వచ్చాయి. రెండు జతల యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగు, షూస్ ఇచ్చారు. ఒక కుటుంబానికి ఇంతకంటే ఏం కావాలి?

– మజ్జి భాస్కరరావు, మెరకముడిదాం
(ఎస్.వి.సత్యనారాయణరాజు, విలేకరి, మెరకముడిదాం)

కోటలు కూలుతాయనే కాకమ్మ కథలు

రాష్ట్రంలో పేదల గూటికి ఏ ధోకాలేదు


నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లపై నిస్సిగ్గుగా ఈనాడు తప్పుడు రాతలు

సాక్షి, అమరావతి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలైతే తాను భూములను కబ్జాచేసి, చట్టాలను ఉల్లంఘించి కట్టుకున్న ఫిలింసిటీ, సహా తన కోటలకు బీటలు వారుతాయన్న ఆందోళనతో రామోజీరావు కల్లు తాగిన కోతిలా చెలరేగిపోతున్నారు. ఏదో ఒకటి చేసి తన పార్ట్‌నర్ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్న తపనతో సీఎం జగన్ ప్రభుత్వంపై తన అక్కసును నిత్యం వెళ్లగక్కుతున్నారు. తాజాగా.. పేదలకు 'సొంతిళ్లు నమ్మక ద్రోహం'.. 'ఏ నిమిషానికి ఏమి కూలునో!' అంటూ నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంపై విషం చిమ్ముతూ గురువారం తన క్షుద్ర పత్రిక ఈనాడులో వాస్తవాలకు దూరంగా అవాస్తవ కథనాలను వండి వార్చడం ఇందులో భాగమే. జగనన్న ఇళ్లు ఏ నిమిషంలో కూలుతాయో.. తద్వారా పేదల ప్రాణాలకు ముప్పు అంటూ ఓ సరికొత్త డ్రామాకు ఈ కథనం ద్వారా రామోజీరావు తెరతీశారు. నిజానికి.. పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్రంలో 31.19 లక్షల మంది నిరుపేదలకు ఉచితంగా ఖరీదైన ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, వాటిల్లో సొంతిళ్లు సమకూరుస్తుంటే సిగ్గూశరం లేకుండా ఈ రాతలు ఏమిటి రామోజీ అంటూ పేదలు ప్రశ్నిస్తున్నారు. వైఎస్ జగన్ పాలనలో పేదల గూటికి, పేదోడికి ఏ ఢోకాలేదు.. అసలు ఈ రాష్ట్రంలో పేదలకు పట్టిన ఏలినాటి శని నువ్వు, మీ బాబే రామోజీ అని పేదలు చెబుతున్నారు. దీంతో పేదలు ఈ జన్మలో బాబుకు ఓటు వేయరని.. అదే జరిగితే తన కోటలు కూలుతాయని రామోజీ బెంబేలెత్తి కట్టుకథలు, కాకమ్మ కబుర్లతో ఈనాడులో చేతికొచ్చింది నిస్సిగ్గుగా రాసిపారేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. పేదల గూడుపై ఈనాడులో ప్రచురించిన దుర్మార్గపు రాతల వెనుక వాస్తవాలు ఏమిటంటే..

ఈనాడు ఆరోపణ: అనంతపురం జిల్లా రాయదుర్గం పరిధిలోని మల్లాపురం లేఅవుట్‌లో ఓ లబ్ధిదారునికి ప్రభుత్వం కట్టించిన ఇల్లు నెలైనా కాకముందే కూలింది. కాంట్రాక్టర్ శ్లాబ్ వేస్తున్న సమయంలో సిమెంట్ తక్కువ వాడాడు..

వాస్తవం: రాయదుర్గం మున్సిపాలిటీలో ఉండే హేమజ్యోతి, ఆనందు దంపతులకు మల్లాపురం లేఅవుట్‌లో ఇల్లు మంజూరైంది. వీరు తమ ఇంటిని తామే నిర్మించుకునే ఆప్షన్ 1, 2 ఎంచుకున్నారు. ఇంటి నిర్మాణానికి బిల్లులు మంజూరుచేయడంతో పాటు, 15 టన్నుల ఇసుకను ఉచితంగా, 55 బస్తాల సిమెంట్, 270 కిలోల స్టీల్ సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేసింది. లబ్ధిదారులే ఒక తాపీ మేస్త్రీని గుర్తించి ఇంటి నిర్మాణం చేసుకున్నారు. గత ఏడాది ఆగస్టులోనే ఇంటి నిర్మాణం పూర్తయింది. ఈ ఇల్లు ఆప్షన్-3 (ప్రభుత్వమే నిర్మించి లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్లు) కింద నిర్మించినది కాదు. పైగా.. కూలింది శ్లాబ్ కాదు. ఇంటి ముందు భాగంలో ఉండే మూడు అడుగుల సన్‌షేడ్ భాగం. ఎక్కడ ఏం జరిగినా దానిని ప్రభుత్వానికి ఆపాదించి దుమ్మెత్తిపోయడమే పనిగా పెట్టుకున్న రామోజీరావు.. ఈ వ్యవహారంలోనూ తన దగుల్బాజీతనాన్ని ప్రదర్శించారు.




పేదలకు సొంతిళ్లు జగన్ నమ్మక ద్రోహం

ఆరోపణ: పట్టణ ప్రాంతాల్లో పేదల ఇంటి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.30 వేలు మాత్రమే ఖర్చుచేస్తోంది.

వాస్తవం: ఇల్లులేని నిరుపేదలందరికీ రూ.15 లక్షల వరకూ మార్కెట్ విలువైన ఇంటి స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఉచితంగా పంపిణీ చేసింది. ఈ లేఅవుట్‌లలో లెవెలింగ్, తాత్కాలిక నీటి సరఫరా కోసం రూ.రెండు వేల కోట్లు వెచ్చించారు. శాశ్వత మౌలిక సదుపాయాల కోసం రూ.32,909 కోట్లు ఖర్చుచేస్తున్నారు. దీనికి తోడు.. ఒక్కో యూనిట్‌కు ఇంటి నిర్మాణం కోసం రూ.1.80 లక్షలు ఇస్తున్నారు. ఇందులో పట్టణాల పరిధిలో రూ.30 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.78 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. దీనికి అదనంగా పావలా వడ్డీకి రూ.35వేలు బ్యాంకు లోన్ సమకూరుస్తున్నారు. రూ.15 వేలు విలువైన 20 టన్నుల ఇసుకను ఉచితంగా ఇవ్వడంతోపాటు, రూ.40వేల వరకూ మేలుచేస్తూ స్టీల్, సిమెంట్ ఇతర నిర్మాణ సామాగ్రిని ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. ప్రభుత్వం పేదలకు ఇంత పెద్దఎత్తున మేలు చేస్తుంటే కేవలం రూ.30 వేలు ఖర్చుచేస్తున్నారని రామోజీరావు రాయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం.

ఆరోపణ: ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణం కేవలం ఒక శాతం మాత్రమే పూర్తయింది. ఇళ్ల నిర్మాణాల కేటాయింపులో కేవలం ఒక ఏజెన్సీకే మేలు చేశారు..

వాస్తవం: ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోలేమని, ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇచ్చే ఆప్షన్-3ని 3,55,256 మంది ఎంచుకున్నారు. వీరందరినీ స్థానికంగా గుర్తించిన లేబర్ ఏజెన్సీలకు అనుసంధానం చేసి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తోంది. ఇప్పటివరకూ 72,906 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అంటే మొత్తం ఆప్షన్-3 ఇళ్లలో 20 శాతం నిర్మాణం పూర్తయ్యాయి. కానీ, ఈనాడు మాత్రం ఒక శాతం మాత్రమే పూర్తయ్యాయని ప్రజలను పూర్తిగా తప్పుదోవ పట్టించే రాతలు రాశారు. లబ్ధిదారుల అంగీకారం మేరకు లేబర్ ఏజెన్సీలతో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా రాష్ట్రంలో మొత్తం 897 ఏజెన్సీలు నిర్మాణాలు చేపడుతున్నాయి. ఇందులో 57 ఏజెన్సీలు వివిధ జిల్లాల్లో పనులు చేస్తున్నాయి. గరిష్టంగా ఒక్కో ఏజెన్సీకి 40,590 ఇళ్లను కేటాయించారు. దీన్ని బట్టి చూస్తే ఒక ఏజెన్సీకే మేలు చేసినట్లు ఎక్కడాలేదు.

చంద్రబాబును ప్రజలే పాతాళానికి తొక్కేస్తారు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: చంద్రబాబు కుటిల రాజకీయాలు, వెన్నుపోటు విధానాలు, కుల రాజకీయాలు, నీచ సంస్కృతిని గమనించిన ప్రజలు ఆయన్ను పాతాళానికి తొక్కేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. తాడేపల్లిగూడెం సభలో పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై కొడాలి నాని గురువారం స్పందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పవన్‌కళ్యాణ్ తొక్కడం కాదు.. ఆయనను, చంద్రబాబును ప్రజలే భూస్థాపితం చేస్తారన్నారు. కుక్కకాటుకు చెప్పుదెబ్బలా కాపు సామాజికవర్గానికి చెందిన వారే చంద్రబాబుకు బుద్ధి చెబుతారని తెలిపారు. పవన్ ఓటు బ్యాంక్‌తో గెలవాలనే స్థాయికి బాబు దిగజారిపోయాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను పవన్ చదువుతున్నాడన్నారు. దానిపై స్పందిస్తూ తాము మాట్లాడితే పవన్ సామాజికవర్గాన్ని తనకు అనుకూలంగా మలుచుకునేందుకు చంద్రబాబు కుటిల రాజకీయాలు చేస్తున్నాడని తెలిపారు. చేసిన మంచి పనులను చెబుతూ ప్రజలను నమ్ముకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 175 స్థానాల్లో విజయం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు తన సామాజికవర్గానికి చెందిన వారికి ఇప్పటికే 21 మందికి సీట్లు ప్రకటించగా.. మరో 10 స్థానాల్లో అదే సామాజికవర్గానికి సీట్లు కేటాయిస్తున్నాడన్నారు. రాష్ట్రంలో 3 శాతం ఓటు బ్యాంక్ ఉన్న ఆ వర్గానికి 31 సీట్లు ఇస్తే 20 శాతం ఓట్లు ఉన్న జనసేన శ్రేణులకు ఎన్ని సీట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే నాని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చేతుల్లో మోసపోవడానికి జనసైనికులు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు సిద్ధంగా లేరని కొడాలి నాని తెలిపారు.

టీడీపీ అడ్రస్ గల్లంతే

స్మగ్లర్‌కు నగరి టికెట్ ఇవ్వడం దారుణం

- టీడీపీ సీనియర్ నేత అశోక్‌రాజు
- పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడి



తిరుపతి సిటీ: వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓటమి తథ్యమని.. చిత్తూరు జిల్లా నగరిలో పార్టీ అడ్రస్ గల్లంతవడం ఖాయమని టీడీపీ సీనియర్ నేత, సిద్ధార్థ గ్రూప్ విద్యాసంస్థల అధినేత అశోక్‌రాజు పేర్కొన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. 1983 నుంచి టీడీపీలో కొనసాగుతున్నానని, నాలుగుసార్లు తనకు టికెట్ ఇస్తానని చెప్పి చంద్రబాబు మోసం చేసినా బాధపడలేదన్నారు. 2019 ఎన్నికల్లో పెద్దఎత్తున సొంత డబ్బు వెచ్చించి ప్రజలను, కార్యకర్తలను ఏకతాటిపై తీసుకొచ్చి పార్టీ కోసం కష్టపడితే ఈసారి కూడా టికెట్ ఇవ్వకుండా మళ్లీ చంద్రబాబు తమను నట్టేట ముంచారని మండిపడ్డారు. పార్టీ కోసం పనిచేసిన తమను గాలికొదిలేసి గాలి భానుప్రకాశ్‌ను అభ్యర్థిగా ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గాలి కుటుంబంలో తగాదాలు తారస్థాయిలో ఉన్నాయని.. అతడి తల్లి భానుప్రకాశ్‌కు టికెట్ ఇవ్వొద్దని చంద్రబాబు వద్ద గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోలేదన్నారు. ఆయన ఒక స్మగ్లర్‌గా, అరాచకాలకు నిలువుటద్దంగా ప్రజలు చెబుతున్నా చంద్రబాబు అతని వైపే మొగ్గు చూపడం దారుణమన్నారు. ఒక అసాంఘిక శక్తికి పార్టీ టికెట్ ఇవ్వడం దారుణమని, ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీకి రాజీనామా చేస్తున్నానని వెల్లడించారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు. త్వరలో మరింత మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో టీడీపీని వీడనున్నారని తెలిపారు.

అవినీతి అనకొండ చంద్రబాబు

రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు


మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చంద్రబాబు పాలనంతా అవినీతి, అక్రమాలమయమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో గురువారం వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాజధాని భూములను సింగపూర్ కంపెనీలకు అప్పనంగా కట్టబెట్టి దానికి 'జి టు జి' అని ఓ పనికిమాలిన పేరుతో అమరావతి రైతులను మోసగించింది చంద్రబాబు కాదా.. అని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమాన్ని అందించిన గొప్ప నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అవినీతి సామ్రాట్ చంద్రబాబు నీతివంతమైన పాలకుడ్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా ప్రజాధనాన్ని కొల్లగొట్టడమే తప్ప ప్రజల జీవనప్రమాణాలు పెంచిన సందర్భాలు లేవని చెప్పారు. అవినీతికి తావులేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పారదర్శకంగా పాలన అందిస్తున్నారని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పాల్గొన్నారు.

అజెండా లేని 'జెండా'

టీడీపీ, జనసేన సభపై మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శ



రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నిర్వహించిన టీడీపీ, జనసేన జెండా సభకు అసలు అజెండానే లేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ విమర్శించారు. ప్రజలకు ఏం మేలు చేస్తారో చెప్పకుండా.. సీఎం జగన్‌ను తిట్టడమే లక్ష్యంగా సభ నిర్వహించారని మండిపడ్డారు. గురువారం రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేశ్‌ను సీఎంను చేయాలనే కోరిక చంద్రబాబుకు కలగానే మిగిలిపోతుందన్నారు. చంద్రబాబు, పవన్ తమ పక్కన నాదెండ్ల మనోహర్, బాలకృష్ణను కూర్చోబెట్టుకొని.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి తగిన ప్రాధాన్యమివ్వకుండా బీసీలను అవమానించారని మండిపడ్డారు. కాపుల ఓట్ల కోసం మాత్రమే జనసేనతో చంద్రబాబు పొత్తు పెట్టుకున్నారని దుయ్యబట్టారు. కాపు సామాజికవర్గాన్ని, ముద్రగడ పద్మనాభం ఆశయాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. జనసేన కార్యకర్తలతో టీడీపీ జెండాలు మోయిస్తున్న పవన్‌కళ్యాణ్.. సీఎం జగన్‌ను దూషిస్తున్నారని.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి వాటిని ప్రజలు సహించరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సీఎం జగన్ ఎన్నికలకు సిద్ధమంటే.. పవన్ యుద్ధమనడం హాస్యాస్పదమన్నారు.

వైఎస్సార్‌సీపీని మళ్లీ గెలిపించేందుకు ప్రజలు 'సిద్ధం'

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175కు 175 శాసనసభ స్థానాల్లో ఘన విజయం సాధించడం ఖాయమని మంత్రి వేణు అన్నారు. వైద్య సేవలపై విమర్శిస్తున్న చంద్రబాబు.. తన హయాంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కాలేజీ అయినా కట్టించారా? అని ప్రశ్నించారు. సంపద సామాన్యుడి చేతికి చేరాలన్నదే సీఎం జగన్ ఆశయమని చెప్పారు. సీఎం జగన్ పాలనలో 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటవుతున్నాయని చెప్పారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని.. ప్రభుత్వాస్పత్రుల రూపురేఖలు మారాయని, ఆరోగ్య శ్రీతో పాటు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి పథకాలతో పేదలకు నాణ్యమైన వైద్యం అందుతోందని వివరించారు. విద్య, వ్యవసాయ రంగంలో కూడా ఎన్నో సంస్కరణలను వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అందుకే ప్రజలు కూడా వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు 'సిద్ధం' అంటున్నారని చెప్పారు.

ఆరని మంటలు.. బాబుకు చెమట్లు!

- అనకాపల్లిలో తాడోపేడో తేల్చుకుంటామంటున్న పీలా వర్గీయులు
- నారా భువనేశ్వరిని రోడ్డుపైనే అడ్డుకున్న ఆయన అనుయాయులు
- పి.గన్నవరంలో సరిపెళ్ల రాజేశ్‌కు వ్యతిరేకంగా దళితుల ఆందోళన
- మడకశిరలో సునీల్ వద్దంటూ టీడీపీ నేతల నిరసన
- బీకే పార్థసారథికే పెనుకొండ టికెట్ ఇవ్వాలని నేతల డిమాండ్
- నమ్మినందుకు నట్టేట ముంచారని ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని ఆగ్రహం

రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థిత్వాలపై రగిలిపోతున్న తమ్ముళ్లు


అనకాపల్లి జిల్లా కూండ్రం వద్ద నారా భువనేశ్వరిని అడ్డుకుంటున్న పీలా వర్గీయులు

సాక్షి, అనకాపల్లి/సాక్షి, అమలాపురం/ అయినవిల్లి/మడకశిర/పెనుకొండ/ఉదయగిరి: రాష్ట్రంలో టికెట్ల కేటాయింపు వ్యవహారం టీడీపీలో కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నాయి. అభ్యర్థుల ఖరారు విషయంలో అధినేత అనుసరిస్తున్న వైఖరిపై బహిరంగంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా జెండా మోసినవారిని పక్కన పెట్టి కొత్తగా వచ్చినవారికి అందలం ఎక్కించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోవైపు జనసేనతో పొత్తు నేపథ్యంలో ఆ పార్టీకి కేటాయించిన స్థానాల్లోనూ ఆందోళనలు మిన్నంటుతున్నాయి.

అనకాపల్లిలో పెల్లుబికిన నిరసనలు

అనకాపల్లి స్థానాన్ని టీడీపీ-జనసేన కూటమి తరఫున కొణతాల రామకృష్ణకు కేటాయించడంపై అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇన్నాళ్లుగా తాను పార్టీకోసం కష్టపడితే తనను పార్టీ అధిష్టానం గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా అక్కడి అభ్యర్థి కొణతాల తనను పట్టించుకోకుండా తన వ్యతిరేక వర్గమైన బుద్ధా నాగజగదీశ్‌ను కలవడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ఈ విషయంలో తాడో పేడో తేల్చుకోవాలని పీలాపై ఆయన వర్గీయులు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

బాబు సతీమణి భువనేశ్వరి అడ్డగింత

'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో పర్యటిస్తున్న నారా భువనేశ్వరిని యలమంచిలి వెళ్లే దారిలో కూండ్రం వద్ద పీలా గోవింద వర్గీయులు అడ్డుకున్నారు. అనకాపల్లి రూరల్ మండల అధ్యక్షుడు పచ్చికూర రాము ఆధ్వర్యంలో నాయకులు సుమారు 10 నిమిషాలపాటు రోడ్డుకు అడ్డంగా నిలబడి పీలా గోవిందకే అనకాపల్లి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. అయితే భువనేశ్వరి కారు దిగి పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో వారంతా తప్పుకున్నారు.

తాడోపేడో తేల్చుకునేందుకు 'బొల్లినేని' నిర్ణయం


ఆత్మీయ సమావేశంలో ఏడుస్తున్న బొల్లినేని వెంకటరామారావు


నెల్లూరు జిల్లా ఉదయగిరి అభ్యర్థిగా తనను నియమించనందుకు ఇక తాడోపేడో తేల్చుకోవాలని అక్కడి టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు నిర్ణయించుకున్నారు. పన్నెండేళ్లుగా పార్టీని, కేడర్‌ను కాపాడుకుంటూ వస్తే ఇప్పుడు ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్‌కు టికెట్ కేటాయించడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఆత్మీయుల వద్ద వెలిబుచ్చి కన్నీటిపర్యంతం కావడంతో కేడర్ ఉద్రేకానికి లోనైంది. ఒక్క మాట చెబితే కాకర్లను ఉదయగిరిలో నామినేషన్ కూడా వేయనివ్వమని తేల్చిచెప్పింది. గురువారం కలిగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆత్మీయులతో మాట్లాడుతూ తనకు టికెట్ విషయంలో న్యాయం జరగకపోతే కార్యకర్తల అభీష్టం మేరకు మార్చి రెండో తేదీన అధినేతను కలసిన తరువాత తుది నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు.

రాజేష్‌కు అసమ్మతి సెగ


ముక్తేశ్వరంలో రాజేష్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తున్న పి.గన్నవరం నియోజకవర్గ దళిత నాయకులు


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ఖరారైన సరిపెళ్ల రాజేష్ కుమార్(మహాసేన రాజేష్)కు అసమ్మతి సెగ తగులుతోంది. ఆయనకు ఐదు రోజులుగా అటు టీడీపీ, ఇటు జనసేన నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గురువారం ఆయన అయినవిల్లి శ్రీ వరసిద్ధి వినాయక ఆలయంలో పూజలు చేసి, కార్యకర్తలు, నాయకులను కలిసేందుకు వెళ్లగా.. ముక్తేశ్వరం సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు జాలెం సుబ్బారావు ఆధ్వర్యంలో దళిత నాయకులు ఆందోళనకు దిగారు. 'రాజేష్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. గతంలో హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా రాజేష్ మాట్లాడారని భజరంగ్‌దళ్ నాయకుడు శిరంగు నాయుడుస్వామి ఆధ్వర్యాన నిరసన తెలిపేందుకు రాగా సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని అంబాజీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాజేశ్ అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం అక్కడున్న వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ముద్దు పెట్టారు. దీనిపై ఆగ్రహించిన జనసేన యూత్ నాయకులు గురువారం రాత్రి రంగా విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

పెనుకొండలో కొనసాగుతున్న నిరసనలు


బీకే పార్థసారథి ఇంటి వద్ద నిరసనలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం జిల్లా పెనుకొండలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథికి కాదని అన్నా క్యాంటీన్ అంటూ హడావుడి చేసిన సవితకు టికెట్ ఇవ్వడంపై నిరసనలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి టీడీపీ కార్యకర్తలు రోజూ బీకే ఇంటి వద్దకు చేరుకుని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గురువారం కూడా నిరసనలు కొనసాగాయి. పార్థసారథికి టికెట్ ఇవ్వకుంటే టీడీపీని ఓడిస్తామని నేతలు చెబుతున్నారు.

సునీల్‌ను మార్చకుంటే రాజీనామా


మడకశిరలో సునీల్ మాకొద్దంటూ.. నినాదాలు చేస్తున్న టీడీపీ నాయకులు


శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గురువారం మరోసారి తిప్పేస్వామి వర్గీయులు నిరసనకు దిగారు. సునీల్‌ను మార్చకుంటే తామంతా రాజీనామా చేయడానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.

చండ ప్రచండ మార్తాండ!

శివమెత్తిన సూరీడు


- 25వ సౌరచక్రంలో ఉచ్ఛ దశ
- జూన్ ముగిసేలోపే 'సోలార్ మాగ్జిమమ్'
- మహామచ్చ 'ఏఆర్3590' ఆవిర్భావం
- భూమికేసి చూస్తూ 3 ఆగ్రహ జ్వాలలు
- ముస్ముందు కరోనల్ మాస్ ఎజెక్షన్స్ ముప్పు
- ఖగోళ శాస్త్రవేత్తల్లో ఆందోళన

భగభగలాడే భానుడిపై ఓ నల్ల మచ్చ తొలిసారి ఈ నెల 18న కనిపించింది. భయం పుట్టించేలా అది నేరుగా భూమికేసి కసిగా చూస్తోంది. వారం రోజుల క్రితం తన నోట్లోంచి భూమి వైపు మూడు సౌరజ్వాలల్ని కక్కింది. దాంతో హై ఫ్రీక్వెన్సీ రేడియో కమ్యూనికేషన్లకు అంతరాయం కలిగింది. అదృష్టవశాత్తు కరోనల్ మాస్ ఎజెక్షన్స్ లేకపోవటంతో పెద్దగా నష్టం సంభవించలేదు. తర్వాత ఫిబ్రవరి 24–26 తేదీల మధ్యకాలంలో కేవలం రెండు రోజుల్లోనే ఆ మచ్చ అమాంతంగా 25 శాతం పెరిగింది. తొమ్మిది భూగోళాలకంటే పెద్ద మచ్చ అది. 2019లో మొదలైన ప్రస్తుత 25వ సౌరచక్రంలో సూర్యుడిపై ఏర్పడిన అతిపెద్ద మచ్చ ఇదే. దీనికి ఏఆర్3590 అని పేరుపెట్టారు. ఏఆర్ అంటే యాక్టివ్ రీజియన్. క్రియాశీల ప్రాంతం అని అర్థం. సూర్యుడిపై నల్ల మచ్చలు మామూలే. అయితే భూమికి పొంచి వున్న ముప్పు దృష్ట్యా ఈ సౌరమచ్చపై ఖగోళ శాస్త్రవేత్తలు ఓ కన్నేశారు. సౌరజ్వాలలకు పుట్టినిల్లయిన ఈ మచ్చలు అంతరిక్ష వాతావరణం, సౌరవ్యవస్థలోని గ్రహాలపై ప్రభావం చూపుతాయి. సూర్యుడి ఉపరితలంపై భారీ వైశాల్యంలో ఏర్పడే ఈ మచ్చల అయస్కాంత క్షేత్రం భూ అయస్కాంత క్షేత్రం కంటే 2,500 రెట్లు శక్తిమంతమైంది. సూర్యుడు అంతర్గతంగా క్రియాశీలంగా ఉన్నచోట ఈ సౌరమచ్చలు ఏర్పడతాయి. అక్కడి పరిసరాలతో పోలిస్తే ఈ మచ్చ ఉష్ణోగ్రత తక్కువ. మచ్చలో 3,600 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుంది. ఇక మచ్చల సంఖ్య 11 ఏళ్ల సౌరచక్రాన్ని అనుసరించి మారుతుంది. సౌర చక్రంలో ఇప్పుడు మనం ముప్పు ముంగిట ఉన్నాం. గణించడం ఆరంభమయ్యాక ప్రస్తుతం 25వ సౌరచక్ర ప్రక్రియ కొనసాగుతోంది. ఈ సౌర చక్రం భూమికి అనర్థాలు, చిక్కులు తెచ్చిపెడుతుందేమోనని ఖగోళ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సూర్యుడిపై మచ్చలు తరచూ ఏర్పడటం, వాటి సైజు పెరగడం, తీవ్ర సౌర తుపాన్లు చూస్తుంటే సూర్యుడు తన 11 ఏళ్ల సౌరచక్రంలో ఉచ్ఛ స్థితిలో ఉన్నాడని, మహోగ్ర విస్ఫోట దశను సమీపిస్తున్నాడని తెలుస్తోంది. తాము గతంలో ఊహించిన దాని కంటే చాలా ముందుగానే అంటే 2024 జూలైలోపే 'చండ మార్తాండ'(సోలార్ మాగ్జిమమ్/సౌర గరిష్టం) దశ దాపురిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. భూమిపై ఇది ఏ ఉత్పాతాలకు దారితీస్తుందో, ఏ ఉపద్రవాలు తెచ్చిపెడుతుందోనని కలవరపడుతున్నారు. ఈ ఉగ్ర రూపం అనంతరం సూర్యుడు మళ్లీ నెమ్మదిస్తాడు. సోలార్ మాగ్జిమమ్ దశ ముగిసిందనేది అది పూర్తయిన ఆరు నెలలకుగాని ఖగోళవేత్తలు గుర్తించలేరు.



ఏఆర్3590తో ప్రమాదమే!

సూర్యుడు లోలోపల ప్రజ్వలిస్తాడు. తన ఉపరితలంపై కొన్ని చోట్ల అకస్మాత్తుగా విస్ఫోటిస్తాడు. అప్పుడు ఆయా ప్రాంతాల నుంచి ఒక్కసారిగా హెచ్చు మొత్తంలో విద్యుదయస్కాంత వికిరణం విడుదలవుతుంది. వీటినే సౌరజ్వాలలు (సోలార్ ఫ్లేర్స్) అంటాం. ఇవి సూర్యుడి ఉపరితలంపై అత్యంత ప్రకాశవంతంగా కనిపిస్తాయి. తీవ్రత ఆధారంగా 'సోలార్ ఫ్లేర్స్'ను X, M, C, B, A అంటూ అవరోహణ క్రమంలో 5 రకాలుగా వర్గీకరించారు. వీటిలో X రకం ఫ్లేర్స్ మహా శక్తిమంతం, భూమికి హానికరం. సౌరమచ్చ ఏఆర్3590 ఈ నెల 21న రెండు X రకం సౌరజ్వాలలను వెదజల్లింది. 22న X 6.3 తీవ్రతతో సౌరజ్వాలను వదిలింది. ఈ మచ్చలోని అస్థిర బీటా–గామా–డెల్టా అయస్కాంత క్షేత్రంలో మరిన్ని X రకం సౌరజ్వాలలకు కావాల్సిన శక్తి ఉండవచ్చని, మరో X రకం మహా సౌరజ్వాల కోసం అది శక్తిని సమీకరిస్తోందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కరోనల్ మాస్ ఎజెక్షన్స్ రూపంలో ముప్పు తొలగిపోలేదని హెచ్చరిస్తున్నారు.



సౌరజ్వాలల ప్రభావం భూమి దిశగా విస్తరిస్తున్న ఊహా చిత్రం

సౌరచక్రంలో అయస్కాంత ధ్రువాల మార్పిడి

సూర్యుడిలో 11 ఏళ్లకోసారి సౌరచక్రం తిరుగుతుంది. ఈ కాలచక్ర మధ్యంలో సౌరక్రియ గరిష్ట స్థితిని సంతరించుకునే 'సోలార్ మాగ్జిమమ్' దశ సందర్భంగా సూర్యుడి అయస్కాంత క్షేత్రం దాని అయస్కాంత ధ్రువాలను తారుమారు చేస్తుంది. అలా ఉత్తర అయస్కాంత ధ్రువం కాస్తా దక్షిణ అయస్కాంత ధ్రువంగా మారిపోతుంది. ఈ మార్పిడి జరిగేవరకు సూర్యుడు అంతకంతకూ ఉత్తేజితమవుతాడు. అనుక్షణం క్రియాశీలమవుతాడు. సౌరమచ్చలు, జ్వాలలు, సీఎంఈలు పుట్టుకొస్తాయి. ఈ ప్రక్రియ తర్వాత సూర్యుడు నెమ్మదిస్తాడు. మెల్ల గా సౌర కనిష్ట/సోలార్ మినిమమ్ దశకు చేరతాడు. ఇదొక చక్రం.

కరోనల్ మాస్ ఎజెక్షన్స్

'కరోనా' అనేది సౌర ధూళికణాలతో (ప్లాస్మా) నిండిన సూర్యుడి అతి బాహ్య పొర. X, M రకాల సౌర ప్రజ్వలనాలు కరోనల్ మాస్ ఎజెక్షన్స్ (సీఎంఈ)కు కారణమవుతాయి. కరోనా నుంచి ప్లాస్మా, విద్యుదయస్కాంత వికిరణం భారీగా విడుదలై భూ అయస్కాంత క్షేత్రంలోకి చొరబడి దుష్ప్రభావం చూపుతాయి. 'నార్తర్న్ లైట్స్'గా పిలిచే 'అరోరాలు' సాధారణంగా ధ్రువాల వద్దనే కనిపిస్తాయి. కానీ సీఎంఈల వల్ల తలెత్తే భూ అయస్కాంత తుపాన్లు భూమధ్యరేఖ వద్ద 'అరోరా'లను సృష్టిస్తాయి. 1989 మార్చిలో భూమిని తాకిన ఓ కరోనల్ మాస్ ఎజెక్షన్ వల్ల కెనడాలోని క్యూబెక్ ప్రావిన్స్ అంతటా 9 గంటలపాటు విద్యుత్ వ్యవస్థ కుప్పకూలి 60 లక్షల మంది ఇబ్బందిపడ్డారు. కరోనల్ మాస్ ఎజెక్షన్స్ వేళల్లో ఆవేశిత శక్తి కణాలు అతి వేగంగా ప్రయాణిస్తాయి. వీటి వల్ల పవర్ గ్రిడ్స్ కుప్పకూలతాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తగలబడతాయి. జీపీఎస్ నేవిగేషన్ వ్యవస్థలు అస్తవ్యస్తమై నౌకలు, విమానాల రాకపోకలు, ఇతర ప్రజా రవాణా వ్యవస్థలు స్తంభిస్తాయి. టెలిఫోన్, కంప్యూటర్, కమ్యూనికేషన్, ఇంధన పంపిణీ–పైపులైన్ వ్యవస్థలు పాడవుతాయి. ఆ సమయాల్లో సౌరతుపాను గండం గడిచేదాకా కృత్రిమ శాటిలైట్లను స్విచాఫ్ చేస్తారు. లేకపోతే అవి మాడిపోయి భూమిపై పడతాయి. లక్షల కోట్ల ఆస్తినష్టం జరుగుతుంది. వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) బయటకు రారు. X, M రకాల సౌర ప్రజ్వలనాల కారణంగా భూవాతావరణంలో రేడియో తరంగాలు ప్రయాణించే 'దిగువ అయనోస్పియర్'లో ఎలక్ట్రాన్ల సాంద్రత తీవ్రమవుతుంది. దాంతో రేడియో తరంగాల శక్తి క్షీణించి అవి పై పొరల్లోకి ప్రయాణించలేవు. సూర్యకాంతి 8 నిమిషాల్లో భూమిని చేరుతుంది. సోలార్ ఫ్లేర్స్ నుంచి వచ్చే సౌరధార్మికత అదే వేగంతో భూమిని తాకుతుంది. కరోనల్ మాస్ ఎజెక్షన్స్ ఫలితంగా వందల కోట్ల టన్నుల కరోనల్ ప్లాస్మా వెదజల్లబడుతుంది. సీఎంఈ వేగం సెకనుకు 250 కిలోమీటర్ల నుంచి 3 వేల కిలోమీటర్ల వరకు ఉంటుంది. వేగవంతమైన కరోనల్ మాస్ ఎజెక్షన్ 15–18 గంటల్లో భూమిని చేరుతుంది.

అతి పెద్ద సౌర తుపాను!

1860లో సోలార్ మాగ్జిమమ్ దశకు కొన్ని నెలల ముందు 1859 సెప్టెంబరులో ఓ సౌర తుపాను సంభవించింది. చరిత్రలో రికార్డయిన అతి పెద్ద సౌర తుపాను ఇదే. 1859 ఆగస్టులో సూర్యబింబంలో నల్లమచ్చల సంఖ్య పెరగడం ఖగోళ శాస్త్రవేత్తలు ఆసక్తిగా తిలకించారు. లండన్‌లోని ఔత్సాహిక వీక్షకుడు రిచర్డ్ కారింగ్టన్ వీరిలో ఒకరు. 1859 సెప్టెంబర్ ఒకటిన సౌరమచ్చల్ని ఆయన చిత్రీకరిస్తుండగా అకస్మాత్తుగా తెల్లటి కాంతి తళుక్కున మెరిసింది. అది 5 నిమిషాలు అలాగే ఉంది. నిజానికి అది కరోనల్ మాస్ ఎజెక్షన్. ఈ ఘటనకు ఆయన గౌరవార్థం 'కారింగ్టన్ ఈవెంట్' అని పేరు పెట్టారు. ఆ కరోనల్ మాస్ ఎజెక్షన్ 17.6 గంటల్లో భూమిని చేరుకుంది. కారింగ్టన్ ఈవెంట్ తర్వాత మర్నాడు జియోమాగ్నెటిక్ తుపాను ధాటికి టెలిగ్రాఫ్ వ్యవస్థలు మొరాయించాయి. కొన్ని చోట్ల టెలిగ్రాఫ్ లైన్లపై టెక్నీషియన్లు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. కొన్నిచోట్ల టెలిగ్రాఫ్ సాధన సంపత్తి దగ్ధమైంది. నాటి 'కారింగ్టన్ ఈవెంట్'కు కారణమైన నలమచ్చతో పోలిస్తే నేటి సౌర మచ్చ పరిమాణం 60 శాతంగా ఉంది. సూర్యగ్రహణాన్ని వీక్షించడానికి వాడే సురక్షిత కళ్లద్దాలు ఉంటే ఈ మచ్చను నేరుగా చూడొచ్చు.

- జమ్ముల శ్రీకాంత్



రష్యన్లనుద్దేశించి ప్రసంగిస్తున్న పుతిన్

మరింత జోక్యంతో అణు యుద్ధమే

ఉక్రెయిన్‌కు అండగా సైన్యాలను పంపించొద్దు • పశ్చిమ దేశాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక

మాస్కో: ఉక్రెయిన్‌లోని లక్ష్యాలను సాధించే వరకు తమ యుద్ధం కొనసాగుతుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్‌కు అండగా సైన్యాలను పంపించడం ద్వారా మరింత లోతుగా జోక్యం చేసుకోవాలని చూస్తే అణు యుద్ధం తప్పదని పశ్చిమ దేశాలను ఆయన హెచ్చరించారు. వచ్చే నెల్లో దేశాధ్యక్ష పదవికి జరగనున్న ఎన్నికల్లో పుతిన్ విజయం ఇప్పటికే ఖరారైంది. ఎన్నికలను పురస్కరించుకుని గురువారం ఆయన దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. యుద్ధంలో పుతిన్ విజయం యూరప్‌లో తీవ్ర విపరిణామాలకు దారి తీస్తుందని, దీనిని నివారించేందుకు నాటో దేశాలు ఉక్రెయిన్‌లోకి ప్రత్యక్షంగా బలగాలను పంపించే అవకాశాలు సైతం ఉన్నాయంటూ ఫ్రాన్సు అధ్యక్షుడు మాక్రాన్ ఇటీవల చేసిన హెచ్చరికలపై ఆయన పైవిధంగా స్పందించినట్లుగా పరిశీలకులు భావిస్తున్నారు. 'గతంలో మన దేశంలోకి సైన్యాన్ని పంపించిన వారికి ఎలాంటి గతి పట్టిందో మనకు తెలుసు. మళ్లీ అటువంటిదే జరిగితే ఈసారి పరిణామాలు మరింత దారుణంగా ఉంటాయి. మన వద్ద కూడా పశ్చిమదేశాల్లోని లక్ష్యాలను చేరగల ఆయుధాలున్న సంగతిని వాళ్లు గుర్తుంచుకోవాలి. ఆ దేశాలు చేస్తున్న ప్రకటనలు ప్రపంచాన్ని భయపెడుతున్నట్లుగా అగుపిస్తోంది. ఇవన్నీ నిజమైన అణు సంఘర్షణ ముప్పును మరింతగా పెంచుతున్నాయి. దానర్థం మానవ నాగరికత విధ్వంసం. యుద్ధంతో ఎదురయ్యే పెను సవాళ్లు, అణు యుద్ధం తాలూకా పరిణామాలు వాళ్లకు అర్థం కావా?' అని పుతిన్ ప్రశ్నించారు. 'దేశం పూర్తిస్థాయి అణు యుద్ధ సన్నద్ధతతో ఉంది. ఎంతో శక్తివంతమైన నూతన ఆయుధాలను సైన్యం మోహరించింది. వాటిలో కొన్నిటిని ఇప్పటికే ఉక్రెయిన్ యుద్ధక్షేత్రంలో ప్రయోగించి చూసింది' అని చెబుతూ ఆయన శక్తివంతమైన బురెవెస్ట్‌నిక్ అణు క్రూయిజ్ క్షిపణి వంటి వాటిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నాటో దేశాలపై రష్యా దాడి చేసే ప్రమాదముందంటూ పశ్చిమదేశాలు చేస్తున్న ప్రకటనలను భ్రమలుగా అధ్యక్షుడు పుతిన్ కొట్టిపారేశారు. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పైకి భారీగా సైన్యాన్ని పంపించినప్పటి నుంచి పుతిన్ అణు ముప్పుపై పశ్చిమ దేశాలను పలుమార్లు హెచ్చరించిన విషయం తెలిసిందే.

సీబీఐ విచారణకు అఖిలేశ్ గైర్హాజరు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో అక్రమ గనుల తవ్వకం కేసులో సాక్షిగా హాజరై వాంగ్మూలం ఇవ్వాలంటూ సీబీఐ ఇచ్చిన సమన్లను ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ బేఖాతరు చేశారు. సీబీఐ సమన్ల ప్రకారం గురువారం ఢిల్లీలోని సీబీఐ ఆఫీస్‌కు అఖిలేశ్ వెళ్లాలి. కానీ ఆయన లక్నోలోనే ఉండిపోయారు. దీనిపై ఆయన వివరణ ఇచ్చారు. ''అంతకుముందే ఖరారైన షెడ్యూల్ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున గురువారం మీ ఆఫీస్‌కు అఖిలేశ్ రావట్లేదు. కానీ అవకాశం ఉన్నంతమేరకు మీకు నా సహాయసహకారాలు ఉంటాయి'' అని అఖిలేశ్ తరఫున న్యాయవాది సీబీఐకి వివరణ ఇచ్చారు. తర్వాత లక్నోలో పార్టీ ఆఫీస్‌లో జరిగిన వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీల సభలో అఖిలేశ్ బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు సంధించారు. చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో అధికారి బీజేపీకి అనుకూలంగా వ్యవహరించిన తీరును సుప్రీంకోర్టు తప్పుబట్టడాన్ని అఖిలేశ్ ప్రస్తావించారు.

కాంగ్రెస్ రెబల్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

సిమ్లా: రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడి బీజేపీ అభ్యర్థి గెలుపునకు కారకులైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరుగురిపై హిమాచల్ ప్రదేశ్ శాసనసభ స్పీకర్ కుల్దీప్ సింగ్ పథానియా అనర్హత వేటు వేశారు. వారిని ఎమ్మెల్యేలుగా అనర్హులుగా ప్రకటించారు. ఈ వివరాలను స్పీకర్ గురువారం మీడియా సమావేశంలో చెప్పారు. ''బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభకు తప్పకుండా హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ విప్ జారీచేసింది. అయినా సరే ఈ ఆరుగురు ఎమ్మెల్యేలు ఆ రోజు అసెంబ్లీకి రాలేదు. బడ్జెట్‌పై ఓటింగ్‌లో పాల్గొనలేదు. పార్టీ విప్‌ను ఉల్లంఘించారు. అందుకే పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వీరిని అనర్హులుగా ప్రకటించాలని పార్లమెంటరీ వ్యవహారాల రాష్ట్ర మంత్రి హర్షవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరిని అనర్హులుగా ప్రకటిస్తున్నా. రాజ్యసభలో క్రాస్ ఓటింగ్ ఘటనతో ఈ అనర్హతకు ఎలాంటి సంబంధం లేదు' అని స్పీకర్ పథానియా చెప్పారు. అనర్హులైన వారిలో రాజీందర్ రాణా, సుధీర్‌శర్మ, ఇందర్ దత్ లఖాన్‌పూర్, దేవీందర్ కుమార్ భుట్టో, రవి ఠాకూర్, చేతన్య శర్మ ఉన్నారు. ఇరువైపుల వాదనలు విన్న స్పీకర్ బుధవారం తన తీర్పును రిజర్వ్ చేసి గురువారం వెల్లడించారు. కాగా, స్పీకర్ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తానని అనర్హతకు గురైన ఒక ఎమ్మెల్యే రాజీందర్ రాణా చెప్పారు. రెబల్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాక అసెంబ్లీలో ప్రస్తుత సభ్యుల మొత్తం సంఖ్య 68 నుంచి 62కు తగ్గింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం 40 నుంచి 34కు దిగి వచ్చింది. పార్టీ ఫిరాయింపుల చట్టం ద్వారా హిమాచల్‌లో ఎమ్మెల్యేలు అనర్హతకు గురికావడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.


గాజాలో ఘోరం

- ఆహార ట్రక్కులపై ఎగబడిన పాలస్తీనియన్లు
- వారిపై ఇజ్రాయెల్ కాల్పుల మోత
- 100 మందికిపైగా దుర్మరణం
- 760 మందికి గాయాలు

రఫా: యుద్ధంలో సర్వం కోల్పోయి ఉండటానికి ఇల్లు, తింటానికి తిండి లేక అంతర్జాతీయ సాయం కోసం పొట్టచేతబట్టుకుని అర్థిస్తున్న అభాగ్యులపైకి ఇజ్రాయెల్ తుపాకీ గుళ్ల వర్షం కురిపించింది. గురువారం పశ్చిమ గాజాలో ఇజ్రాయెల్ జరిపిన ఈ అమానవీయ దారుణ దాడి ఘటనలో 100 మందికిపైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 66 మంది మహిళలు, చిన్నారులే ఉన్నారు. 760కిపైగా గాయపడ్డారు. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. మానవత్వాన్ని కాలరాస్తూ హమాస్–ఇజ్రాయెల్ యుద్ధం జరుగుతున్న తీరును తాజా ఘటన మరోసారి కళ్లకు కట్టింది. పశ్చిమ గాజాలోని షేక్ అజ్లీన్ ప్రాంతంలోని హరౌన్ అల్ రషీద్‌వీధి ఈ రక్తపుటేళ్లకు సాక్షీభూతమైంది. తాజాగా దాడితో ఇప్పటివరకు ఇజ్రాయెల్ భూతల, గగనతల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పాలస్తీనియన్ల సంఖ్య 30,000 దాటింది. క్షతగాత్రుల సంఖ్య 70,457 దాటేసింది.

మృతదేహాలు గాడిదలపై..

ప్రత్యక్ష సాక్షులు చెప్పిన వివరాల ప్రకారం.. రోజుల తరబడి సరైన తిండిలేక అలమటించిపోతున్న పాలస్తీనియన్లకు పంచేందుకు ఆహార పొట్లాలు, సరుకు నిండిన ట్రక్కులు అల్ రషీద్ వీధికొచ్చాయి. అప్పటికే వందలాదిగా అక్కడ వేచి ఉన్న పాలస్తీనియన్లు ట్రక్కుల చుట్టూ గుమికూడారు. ఇజ్రాయెల్ సైన్యం పర్యవేక్షణలో ట్రక్కుల నుంచి ఆహార పంపిణీ జరగాల్సి ఉంది. అయితే క్యూ వరసల్లో నిల్చున్న వ్యక్తులను కాదని చాలా మంది ట్రక్కులపైకి ఎగబడి గోధుమ పిండి, క్యాన్లలో ప్యాక్ చేసిన ఆహారాన్ని లూటీ చేశారు. దీంతో పరిస్థితి అదుపు తప్పి గందరగోళం నెలకొంది. తోపులాట, తొక్కిసలాట జరిగాయి. వారించబోయిన ఇజ్రాయెల్ సైనికులపై వారు దాడికి పాల్పడ్డారని వార్తలొచ్చాయి. '' పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ఇజ్రాయెల్ బలగాలు పాలస్తీనియన్ల పైకి తుపాకీ గుళ్లవర్షం కురిపించాయి. జనం పిట్టల్లా రాలి పడ్డారు. ఎక్కడ చూసినా మృతదేహాలే. మృతదేహాలు, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు సరిపడా అంబులెన్సులు మా దగ్గర లేవు. విధిలేక గాడిదలపై, గాడిద బండ్లపై మృతదేహాలు, గాయపడిన వారిని తరలించాం'' అని కమల్ అద్వాన్ ఆస్పత్రిలో అంబులెన్స్ సేవల అధికారి ఫరేస్ అఫానా చెప్పారు. లూటీ నుంచి తప్పించుకునేందుకు ట్రక్కులు ముందుకు కదలడంతో వాటి కింద పడి కొందరు మరణించారని వార్తలొచ్చాయి.



పశ్చిమగాజాలో పాలస్తీనియన్లు సహాయక ట్రక్కులను చుట్టుముట్టిన వీడియో దృశ్యం

మళ్లీ మళ్లీ కాల్పులు

ఘటన వివరాలను ప్రత్యక్ష సాక్షి, క్షతగాత్రుడు కమెల్ అబూ నహేల్ చెప్పారు. 'రెండు నెలలుగా పశుగ్రాసం తిని బతుకుతున్నాం. రాత్రిపూట ఆ వీధిలో ఆహారం పంచుతున్నారంటే వెళ్లాం. వందల మందిపై కాల్పులు జరిపారు. తప్పించుకునేందుకు కార్ల కింద దాక్కున్నాం. కాల్పులు ఆగిపోయాక మళ్లీ ట్రక్కుల దగ్గరకు పరుగెత్తాం. ఇజ్రాయెల్ సైనికులు మళ్లీ కాల్పులు జరిపారు. నా కాలికి బుల్లెట్ తగలడంతో కింద పడ్డా. అప్పటికే ముందుకు కదలిన ట్రక్కు నా కాలిని ఛిద్రంచేసింది' అని నహేల్ చెప్పారు.

93 పేలుళ్ల కేసు నుంచి తుండాకు విముక్తి

జైపూర్: 1993 వరుస బాంబు పేలుళ్ల కేసు నుంచి మాఫియా డాన్, వాంటెడ్ ఉగ్రవాది దావూద్ ఇబ్రహీం సన్నిహితుడు అబ్దుల్ కరీం తుండా(81)కు ప్రత్యేక కోర్టు విముక్తి కల్పించింది. అతడిపై మోపిన అభియోగాలను రుజువు చేసేందుకు అవసరమైన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ చూపలేకపోయిందని కోర్టు పేర్కొంది. తుండాపై ఉన్న అభియోగాలన్నిటినీ కొట్టి వేస్తూ గురువారం అజ్మీర్‌లోని ఉగ్రవాద, విచ్ఛిన్నకర కార్యకలాపాల నివారణ చట్టం (టాడా) కోర్టు తీర్పు వెలువరించింది. ఇదే కేసులో రైళ్లలో బాంబులను అమర్చినట్లు ఉన్న ఆరోపణలు రుజువు కావడంతో ఇర్ఫాన్, హమీదుద్దీన్‌లకు కోర్టు జీవిత ఖైదు విధించింది. బాబ్రీ మసీదు విధ్వంసానికి ఏడాదైన సందర్భంగా 1993 డిసెంబర్ 5, 6 తేదీల్లో లక్నో, కాన్పూర్, హైదరాబాద్, సూరత్, ముంబైల్లోని రైళ్లలో వరుసగా పేలుళ్లు జరిగాయి. ఈ ఘటనల్లో ఇద్దరు చనిపోగా 22 మంది గాయపడ్డారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తుండా బాంబుల తయారీకి సహకరించినట్లు ఆరోపణలున్నాయి. కాగా, హమీదుద్దీన్ 14 ఏళ్లుగా, ఇర్ఫాన్ 17 ఏళ్లుగా జైలు జీవితం గడుపుతున్నారు. బాంబు పేలుళ్లతోపాటు వీరిపై పలు కేసులు నమోదై ఉన్నాయి.

టీఎంసీ నేత షాజహాన్ అరెస్ట్

- 10 రోజుల పోలీస్ కస్టడీకి అప్పగించిన కోర్టు
- అతడి ఆగడాలపై దర్యాప్తు జరపనున్న సీబీఐ



బసీర్హాట్ కోర్టుకు షాజహాన్‌ను తీసుకొచ్చిన పోలీసులు

బసీర్హాట్(పశ్చిమబెంగాల్): లైంగిక దాడులు, భూ దందా వంటి పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న టీఎంసీ నేత షాజహాన్ షేక్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. అతడి ఆగడాలపై స్థానిక మహిళలు చేపట్టిన ఆందోళనలు హింసాత్మక రూపం దాల్చడం, ఈ మొత్తం వ్యవహారం అధికార ప్రతిపక్షాల మధ్య మాటలయుద్ధానికి దారి తీసిన విషయం తెలిసిందే. నార్త్ 24 పరగణాల జిల్లా మినాఖాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బమన్‌పుకూర్‌లోని ఓ ఇంట్లో ఉన్న షాజహాన్‌ను గురువారం వేకువజామున అదుపులోకి తీసుకున్నట్లు అదనపు డీజీపీ సుప్రతీమ్ సర్కార్ చెప్పారు. మరికొందరితో కలిసి షాజహాన్ ఆ ఇంట్లో గత 55 రోజులుగా దాక్కున్నాడని ఆయన తెలిపారు. ఉదయం 10.40 గంటల సమయంలో బసీర్హాత్ కోర్టులో హాజరుపరచగా కోర్టు అతడిని 10 రోజుల పోలీస్ కస్టడీకి పంపించిందని అన్నారు. కేవలం రెండు నిమిషాల్లోనే విచారణ ముగిసింది. ఆ వెంటనే కోల్‌కతాలోని పోలీస్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. ఈ కేసు విచారణ జరుపుతున్న సీబీఐ అక్కడే అతడిని ప్రశ్నిస్తుందని ఏడీజీపీ సర్కార్ చెప్పారు.

జనవరి 5 నుంచి అజ్ఞాతంలోకి..

రేషన్ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా జనవరి 5వ తేదీన షాజహాన్ షేక్ ఇంటికి వెళ్లిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులపై దాదాపు వెయ్యి మంది మద్దతుదారులు దాడికి దిగారు. ఘటనకు సంబంధించి నజాత్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన రెండు కేసుల్లో అతడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. జనవరి 5 ఘటన అనంతరం షాజహాన్ కనిపించకుండాపోయాడు. సందేశ్‌ఖలీ ప్రాంతంలో తిరుగులేని నేతగా దశాబ్దకాలంగా షాజహాన్ చెలామణీ అవుతున్నాడు. షాజహాన్, అతడి అనుచరులపై భూ దందా, గ్యాంగ్ రేప్ వంటి ఆరోపణలపై 100కు పైగా కేసులున్నాయి.

ఆరేళ్లపాటు బహిష్కరణ

పోలీసులు అరెస్ట్ చేసిన షాజహాన్ షేక్‌ను ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు అధికార టీఎంసీ నేత డెరెక్ ఒబ్రియాన్ ప్రకటించారు. సందేశ్‌ఖలీ అసెంబ్లీ నియోజకవర్గం పార్టీ కన్వీనర్‌గా, నార్త్ 24 పరగణాల జిల్లా పరిషత్ టీఎంసీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నాడు.

బలీయ ఆర్థికశక్తిగా మార్చేందుకే బరిలో: మోదీ

భోపాల్: ప్రపంచంలో భారత్‌ను మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సార్వత్రిక సమరానికి బీజేపీ సిద్ధమైందని ప్రధాని మోదీ ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లో గురువారం రూ.17,551 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో ప్రారంభించి మోదీ ప్రసంగించారు. ''ఎక్కడ విన్నా ఒకటే మాట. ఈసారి ఎన్‌డీఏ 400 స్థానాల్లో గెలుస్తుందని. ఈ మాట మేం అనలేదు. జనమే ఒక నినాదంగా మార్చేశారు. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా రూపొందిస్తాం. ఆ సంకల్పంతోనే ఎన్నికలకు వెళ్తున్నాం' అని మోదీ చెప్పారు.

సమాజానికి తోడ్పడినప్పుడే టెక్నాలజీకి సార్థకత

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్

న్యూఢిల్లీ: సమాజ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి టెక్నాలజీని ఉపయోగించాలని మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చెప్పారు.ఆయన గురువారం ఐఐటీ–ఢిల్లీలో 'ప్రజల బాగు కోసం నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. వ్యవసాయం, వాతావరణ మార్పుల వంటి రంగాల్లో ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కార మార్గాలు కనుగొనాల్సి ఉందని చెప్పారు. ఇక్కడ నేర్చుకున్న విద్యను స్వలాభం కోసం కాకుండా, సామాజిక సమానత్వం సాధించడానికి ఉపయోగించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయన ప్రధాని మోదీని కలిశారు.

రూఫ్‌టాప్ సోలార్ రాయితీ 78 వేలు

- 'పీఎం–సూర్య'కు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ.75,021 కోట్లతో పథకం అమలు
- కోటి కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రూఫ్‌టాప్ సౌర విద్యుత్ పథకం 'పీఎం–సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని అధ్యక్షతన మంత్రివర్గం గురువారం సమావేశమైంది. రూ.75,021 కోట్లతో అమలు చేసే ఈ పథకం కింద దేశవ్యాప్తంగా కోటి కుటుంబాలకు ప్రతినెలా 300 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయనున్నారు. ఇళ్లపై సౌర ఫలకాల ఏర్పాటుకు లబ్ధిదారులకు రూ.78,000 వరకు రాయితీ ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలియజేశారు. కేబినెట్ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడారు.

జిల్లాకో మోడల్ సోలార్ గ్రామం

రూఫ్‌టాప్ సౌర విద్యుత్ పథకాన్ని ప్రధాని మోదీ ఈ ఏడాది ఫిబ్రవరి 13వ తేదీన ప్రారంభించారు. పథకం అమలులో భాగంగా 2 కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం ఆర్థిక సాయం అందిస్తుంది. 2 కిలోవాట్ల నుంచి 3 కిలోవాట్ల సోలార్ పవర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి అదనంగా మరికొంత ఆర్థిక సాయం అందజేస్తుంది. 3 కిలోవాట్ల వరకే పరిమితి విధించారు. ఒక కిలో వాట్ వ్యవస్థకు రూ.30 వేలు, 2 కిలోవాట్ల వ్యవస్థకు రూ.60 వేలు, 3 కిలోవాట్ల వ్యవస్థకు రూ.78 వేల చొప్పున కేంద్రం నుంచి రాయితీ లభిస్తుంది. లబ్ధిదారులు రాయితీ సొమ్ము కోసం నేషనల్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసే కంపెనీని పోర్టల్ ద్వారా ఎంపిక చేసుకోవచ్చు. కేంద్రం ఇచ్చే రాయితీ మినహా మిగిలిన పెట్టుబడి కోసం ఎలాంటి పూచీకత్తు లేకుండానే తక్కువ వడ్డీకే రుణం తీసుకొనే అవకాశం కల్పించారు. సౌర విద్యుత్‌పై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి జిల్లాలో ఒక మోడల్ సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూఫ్‌టాప్ సోలార్ పథకాన్ని ప్రమోట్ చేసే పట్టణ స్థానిక సంస్థలకు, పంచాయతీరాజ్ సంస్థలకు కేంద్రం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. 2025 నాటికి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 3 కిలోవాట్ల సౌర విద్యుత్ వ్యవస్థ నెలకు 300 యూనిట్లకుపైగా కరెంటును ఉత్పత్తి చేస్తుంది. 300 యూనిట్లు ఉచితంగా ఉపయోగించుకొని, మిగిలిన కరెంటును డిస్కమ్‌లకు విక్రయించి ఆదాయం పొందవచ్చు. పీఎం–సూర్య ఘర్: ముఫ్త్ బిజిలీ యోజన కింద సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి, రాయితీ పొందడానికి https:// pmsuryaghar.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ పథకం ద్వారా కొత్తగా 17 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది.

ఖరీఫ్‌లో రూ.24,420 కోట్ల రాయితీ

న్యూఢిల్లీ: రాబోయే ఖరీఫ్ సీజన్(ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30)లో ఎరువులపై రూ.24,420 కోట్ల రాయితీని భరించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. రైతులు ఎప్పటిలాగే రూ.1,350 ధరకే 50 కిలోల డీఏపీని పొందవచ్చని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర ఎరువుల విభాగం చేసిన ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం గురువారం ఆమోదించింది. అలాగే దేశంలో కొత్తగా మూడు సెమీ–కండక్టర్ల తయారీ యూనిట్ల స్థాపనకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. టాటా గ్రూప్, జపాన్‌కు చెందిన రెనిసస్ వంటి కంపెనీలు కలిసి రూ.1.26 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ మూడు యూనిట్లను ఏర్పాటు చేయనున్నాయి. రక్షణ, ఆటోమొబైల్, టెలికమ్యూనికేషన్ వంటి రంగాలకు అవసరమైన సెమీ–కండక్టర్లను తయారు చేస్తారు.

లోయలో పడిన వ్యాను..14 మంది మృతి

డిండోరి: మధ్యప్రదేశ్‌లోని డిండోరి జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మలుపులో అదుపు తప్పి బోల్తా పడిన వ్యాను రోడ్డు పక్కనే ఉన్న సుమారు 50 అడుగుల లోతున్న లోయలోకి పడిపోయింది. దీంతో అందులోని 14 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. షాపురా బ్లాకులోని మసూర్‌ఘుగ్రి గ్రామానికి చెందిన కొందరు అమ్హాయి దేవ్రి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని తిరుగువస్తూ తెల్లవారు జామున 1.30 గంటల సమయంలో ప్రమాదం బారిన పడ్డారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, ఒక బాలుడు ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

శుక్రవారం ౹ 1 ౹ మార్చి ౹ 2024

కన్నడ బోర్డుల గడువు పెంపు

దొడ్డబళ్లాపురం: బెంగళూరులో అన్ని షాపులు , మాల్స్, హోటళ్లు, ఆస్పత్రులు, సంస్థల బోర్డుల్లో 60 శాతం కన్నడ భాష ఉండాలని విధించిన గడువును మార్చి 14 వరకు పొడిగించినట్లు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. నిజానికి ఫిబ్రవరి 28తో ఈ గడువు ముగిసింది. బోర్డులను మార్చుకోని సంస్థలకు సీజ్, లేదా జరిమానా విధిస్తామని అధికారులు ప్రకటించారు. కర్ణాటక రాష్ట్రంలో కన్నడ భాషకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం తప్పనిసరి అని, దీన్ని అందరూ పాటించాలని డీకే అన్నారు. కన్నడ నామఫలకాల ఏర్పాటుకు సమయం కోరడంతో గడువు పొడిగించామని తెలిపారు. అప్పటికీ మార్చుకోకుంటే లైసెన్సు రద్దు చేస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

పులిధామానికి హైనాల రాక



పులి ధామంలో ఓ హైనా

శివమొగ్గ: శివమొగ్గ తాలూకాలోని త్యావెర కొప్ప దగ్గర ఉన్న పులిధామానికి మైసూరు జూ నుంచి హైనాలను తీసుకొచ్చారు. డైరెక్టర్ ముకుంద చంద్ర మాట్లాడుతూ మైసూరులో ఉన్న మృగాలయం నుంచి ఒక మగ, మూడు ఆడ చారల హైనాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. శుక్రవారం నుంచి వాటిని పర్యాటకులు చూడడానికి అవకాశం కల్పిస్తామన్నారు. ఇప్పటివరకు ఇందులో రెండు హైనాలు ఉండగా, అందులో ఒకటి చనిపోయింది.

విద్యార్థులపై తేనెటీగల దాడి

మైసూరు: చామరాజనగర పట్టణంలోని జెఎస్ఎస్ నర్సింగ్ కళాశాల ఆవరణలో గురువారం మధ్యాహ్న భోజనం సమయంలో తేనెటీగలు దాడి చేశాయి. ఇందులో 8 మంది విద్యార్థులతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు సైతం అస్వస్థతకు గురయ్యారు.

కాలేజీ భవనంపై తేనెపట్టు ఉంది, బయట విద్యార్థులు భోజనం చేస్తుండగా తేనెటీగలు దాడి చేసి కుట్టాయి. దీంతో బాధిత విద్యార్థులు తీవ్రమైన నొప్పితో ఆర్తనాదాలు చేయసాగారు. జెఎస్ఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

లైక్ కొడితే.. రూ.13 లక్షలు టోపీ

మైసూరు: కంపెనీల ఉత్పత్తులకు సోషల్ మీడియాలో లైక్‌లు ఇస్తే దండిగా డబ్బులు వస్తాయని నమ్మించి ఒక యువకుని నుంచి మోసగాళ్లు రూ. 13.31 లక్షలను కాజేశారు. ఈ సంఘటన మైసూరు నగరంలో జరిగింది. నగరంలోని హినకల్‌కు చెందిన బీజీ అశ్వర్థ అనే యువకునికి వాట్సాప్ మెసేజ్ వచ్చింది, తమ కంపెనీ ఉత్పత్తులకు లైక్ ఇస్తే డబ్బులు ఇస్తామని అందులో చెప్పారు. కొన్ని రోజులయ్యాక కంపెనీలో డబ్బులు పెట్టుబడి పెడితే మంచి లాభాలు వస్తాయని చెప్పారు. అతడు సరేనని రూ. 13.31 లక్షలను వారి ఖాతాల్లోకి పంపించాడు. ఎన్నిరోజులైనా లాభం, అసలు రాకపోవడంతో మోసపోయానని తెలిసి బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జడ్జిగా ఎంపికైన యువతి



శ్రీదేవి నాయక్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో ఇటీవల జరిగిన జుడీషియల్ పరీక్షల్లో ఉత్తీర్ణురాలై శ్రీదేవి నాయక్ అనే యువతి న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. సింధనూరు తాలూకా రాగలపర్వికి చెందిన శ్రీదేవి నాయక్ (24) రాయచూరులోని సేఠ్ చూనిలాల్ బోహరచంద్ లా కళాశాలలో న్యాయ విద్యను అభ్యసించారు. ఆమెను పలువురు అభినందించారు.

హక్కు పత్రాలకై నిరసన



శివమొగ్గ: శివమొగ్గ తాలూకాలోని చక్కెర పరిశ్రమ పరిధిలో భూములు సాగు చేస్తున్న రైతులకు, ఇళ్లు కట్టుకున్న కార్మికులకు హక్కు పత్రాలను ఇవ్వాలని కోరుతూ రైతులు, కార్మికులు, నివాసుల భూముల హక్కు పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం శివమొగ్గలో భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని మలవగొప్ప చన్నబసవేశ్వర దేవాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు సుమారు 10 కిలోమీటర్ల దూరం ర్యాలీ జరిగింది. తమకు తక్షణం హక్కు పత్రాలను అందజేయాలని నినాదాలు చేశారు. పలు గ్రామాల నుంచి వేలాదిగా రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళల మరణాలపై విచారణ

పావగడ: పావగడ తాలూకా ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేయించుకున్న ముగ్గురు మహిళలు మరణించడంపై అధ్యయనానికి ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందని రాష్ట్ర యోజనా డైరెక్టర్ డా. శ్రీనివాస్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి పరిశీలించారు. మహిళల మరణాలకు కారణాలపై వైద్యులు, రోగులు, స్టాఫ్ నర్సులతో చర్చించారు. ఆస్పత్రి సిబ్బంది రోగులతో సౌజన్యంతో మెలగాలని, సక్రమంగా ఔషధాలు అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను జిల్లా ఆస్పత్రికి తరలించాలన్నారు. ఆస్పత్రిలో స్వచ్ఛతను కాపాడాలన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు తాను ఆస్పత్రి తనిఖీకి వచ్చానన్నారు. ఇక్కడ వైద్యుల కొరత, నిర్లక్ష్య వైఖరి, లంచగొండితనంపై తనకు ఫిర్యాదులందాయన్నారు.

విద్రోహులను కాపాడుతారా?



గురువారం విధానసభలో స్పీకర్ ముందు ప్రతిపక్ష ఎమ్మెల్యేల నిరసన



సమావేశంలో పెద్దగా కానరాని హాజరు. అనేక సీట్లు ఖాళీగానే ఉన్నాయి

- పాక్ నినాదాలు చేసినవారిని అరెస్టు చేయరా?
- విధానసభలో ప్రతిపక్షాల డిమాండు
- కేసు పురోగతిలో ఉందన్న సీఎం

శివాజీనగర: పాకిస్తాన్ అనుకూల నినాదాల గురించి గురువారం విధానసభలో రభస చెలరేగింది. సంఘటన జరిగి 48 గంటలు గడిచినా కూడా నినాదాలు చేసినవారిని అరెస్ట్ చేయలేదు. దేశ ద్రోహులను ప్రభుత్వం కాపాడుతోందని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు ఆరోపిస్తూ స్పీకర్ ముందు ధర్నా చేసి, ఆపై వాకౌట్ అని సభ నుంచి వెళ్లిపోయారు. ఉదయం సభ ఆరంభం కాగానే పాక్ అనుకూల నినాదాలు చేసినవారిని అరెస్ట్ చేయాలని ప్రతిపక్షాలు ధర్నాను కొనసాగించారు. ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేయసాగారు. సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌పై చర్చలో మాట్లాడుతుండగా, నకిలీ బడ్జెట్ అంటూ కేకలు వేశారు.

ద్రోహులపై మౌనం ఎందుకు

బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్ మాట్లాడుతూ పాక్ అనుకూలంగా నినాదాలు చేసినవారిని ప్రభుత్వం అరెస్ట్ చేయలేదు. దేశ ద్రోహుల విషయంలో మౌనంగా ఉంది. ఎవరూ కూడా ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించలేదు. రాజ్యసభ సభ్యుడు నాసీర్ హుసేన్ అరెస్ట్ చేయలేదు. విధానసౌధ ఉగ్రవాదుల కేంద్రమవుతోంది. ఇలాగైతే ఎలాగ, ప్రభుత్వం పాకిస్తాన్ నినాదాల కేసును ఏదో చిన్న సంఘటనగా భావిస్తోందని దుయ్యబట్టారు. ప్రజలు తమను ఎన్నిక చేసినది తాము వీరి పాలనలో క్షేమంగా ఉండవచ్చనే భావంతోనే. అయితే ప్రజల భద్రత ఎక్కడ జరిగింది. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

సభాపతి సూచన

ఆ సమయంలో సభాపతి యూటీ ఖాదర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ విషయమై బుధవారమే సమాధానమిచ్చింది. విచారణ చేస్తామని చెప్పింది. అదే విషయాన్ని పట్టుకుని నేడు కూడా ధర్నా చేయడం సరికాదు. బడ్జెట్‌పై చర్చకు ముఖ్యమంత్రి సమాధానం ఇవ్వాల్సి ఉంది. ధర్నా విరమించుకోవాలని సూచించారు. ఇందుకు ఆమోదించని ఆర్.అశోక్, నినాదాలు చేసినవారిపై దేశద్రోహం కేసును నమోదు చేయలేదు. ఒకరిపై ఒకరు తోసుకొన్నారని కేసు పెట్టారు. సర్కారు దేశద్రోహులను కాపాడే పని చేస్తోందని ఆరోపించారు.

7 మందిని విచారించారు: హోంమంత్రి

హోం మంత్రి జీ.పరమేశ్వర్ సమాధానమిస్తూ కేసు విచారణ జరుగుతోంది. 7 మందిని విచారించడమైనది. ఆడియో, వీడియో వాస్తవాలు బహిరంగం కావాల్సి ఉంది. ఫోరెన్సిక్ నివేదిక కోసం నిరీక్షిస్తున్నాం. ఈ కేసును తీవ్రంగానే తీసుకొన్నాం. ఎవరు తప్పు చేసిన కఠిన చర్యలు తీసుకొంటామని చెప్పారు. అశోక్ మాట్లాడుతూ వారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదు. దేశ ద్రోహులను అరెస్ట్ చేసేందుకు ఉన్న సమస్య ఏమిటి. ఈ ప్రభుత్వానికి అధికారంలో ఉండే అర్హతను కోల్పోయిందని ధ్వజమెత్తారు.

గంభీరంగా తీసుకున్నాం: సీఎం

సీఎం సిద్దరామయ్య ఈ విషయమై సమాధానమిస్తూ ప్రభుత్వం దీనిని గంభీరంగా తీసుకొన్నది. దేశభక్తి మీకంటే మాకే అధికంగా ఉంది. ఈ కేసులో 7 మంది సాక్షుల వాంగ్మూలాన్ని రికార్డు చేశారు, తనిఖీ పురోగతిలో ఉంది, ఎంతటివారైనాగానీ చర్యలు తీసుకొంటాం. ధర్నా విరమించుకోవాలని కోరారు. ఇందుకు ఒప్పుకోని బీజేపీ–జేడీఎస్ సభ్యులు, ఘటన జరిగి 48 గంటలు గడచినా కూడా ప్రభుత్వం ఎవరినీ అరెస్ట్ చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో గందరగోళం కొనసాగింది. దీని మధ్యే సీఎం బడ్జెట్‌పై మాట్లాడారు. సీఎంను హేళన చేస్తూ విపక్ష ఎమ్మెల్యేలు బురిడీ, అబద్ధం అని కేకలు వేశారు. దేశ ద్రోహుల గ్యారంటీ, రాజీనామా, రాజీనామా అని కేకలు వస్తూ పేపర్లను చించి వాకౌట్ చేశారు.

సీతారాం.. శ్రీరాం నినాదాలు

శాసనసభలో జై శ్రీరామ్ నినాదాలు మారుమోగాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య జై సీతారాం అని చెప్పగా, బీజేపీ ఎమ్మెల్యేలు జై జై శ్రీరాం అని నినాదాలు చేశారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంలో సీఎం మాట్లాడుతూ బీజేపీ వారు రాముణ్ని మాత్రమే జపిస్తారు, మేం రాముడు, సీతను నమ్ముతాం, అందుకే జై జై సీతారాం అంటామని అన్నారు. ధర్నాలో నిమగ్నమైన బీజేపీ సభ్యులు జై జై శ్రీరాం అని నినాదాలు చేశారు. బీజేపీవారు రామాయణం, మహాభారతం చదవలేదని సీఎం ఎద్దేవా చేశారు.



సీఎంకు కులగణన నివేదిక

విపక్షాల వ్యతిరేకత మధ్య వేలాది పేజీల కులగణన నివేదికను సీఎం సిద్దరామయ్య విధానసౌధలో తన ఆఫీసులో స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు వ్యూహాత్మకంగా సిద్దు ప్రభుత్వం కులగణన నివేదికను విడుదల చేసే అవకాశం ఉంది. బీసీ శాశ్వత కమిషన్ అధ్యక్షుడు జయప్రకాష్ హెగ్డే ఆ నివేదికను అందజేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ మినహా ఇతర బీసీ, ఓసీ కులాల జనాభా లెక్కలను పొందుపరిచారు.

ప్రైవేటు బస్సు బోల్తా

- 35 మందికి గాయాలు



పల్టీపడిన బస్సు

గంగావతి: ఓ ప్రైవేటు బస్సు బోల్తాపడి 35 మంది ప్రయాణికులకు గాయాలైన ఘటన గంగావతి తాలూకా హేమగుడ్డ సమీపాన ఉన్న హెచ్ఆర్‌జీ నగర వద్ద జరిగింది. హైదరాబాద్ నుంచి బెళగావికి వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు, ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టబోయి తప్పించుకున్నాయి. ఈ క్రమంలో బస్సు అదుపుతప్పి ఒక వైపునకు బోల్తాపడినట్లు ప్రయాణికులు తెలిపారు. బస్సులోని 35 మంది ప్రయాణికులకు గాయాలుకాగా, ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వారిని కొప్పళకు తరలించారు. మిగతావారికి గంగావతి ఆస్పత్రిలో చికిత్స చేయించారు. గంగావతి రూరల్ పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ మార్గంలో వాహనాలు అతి వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతుంటాయని, స్పీడ్ బ్రేకర్లు, ఇతర నివారణ చర్యలను చేపట్టాలని స్థానికులు సూచించారు.

సర్కారుపై గవర్నర్‌కు బీజేపీ ఫిర్యాదు

శివాజీనగర: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా నడుచుకోవటం లేదని, దేశ వ్యతిరేకను కాపాడుతోందని, అందుచేత ప్రభుత్వాన్ని సస్పెండ్ చేయాలని గవర్నర్‌కు విన్నవించినట్లు బీజేపీ మాజీ సీఎం బసవరాజ బొమ్మై తెలిపారు. బీజేపీ నేతలతో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌వారు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. బడ్జెట్ వాస్తవానికి దూరంగా ఉంది. ఇటీవల పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేసినవారిని కాపాడుతూ నైతికంగా దివాలా తీశారు అని పలు ఆరోపణలు చేశారు. వీటిని రాష్ట్ర ప్రజలు మరువరు. మా పోరాటం ముందుకు కొనసాగుతుందని తెలిపారు. ఆర్.అశోక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బ్రాండ్ బెంగళూరు బడ్జెట్

- రూ.12,371 కోట్లతో పాలికె పద్దు
- వసతుల కల్పనకు పెద్దపీట





ఉత్తమ ట్రాఫిక్ వ్యవస్థ, ఫుట్‌పాత్‌లు తదితర సౌకర్యాల కల్పనకు హామీ

బనశంకరి: సిలికాన్ సిటీవాసులకు అతి ముఖ్యమైన బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) బడ్జెట్ పెద్దగా పన్నుల భారం లేని రీతిలో వచ్చింది. గురువారం టౌన్‌హాల్‌లో బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్‌సింగ్, కమిషనర్ తుషార్ గిరినాథ్, ఆర్థిక విభాగం కమిషనర్ శివానంద కలకేరి.. 2024–25 నగర పాలికె బడ్జెట్‌ను ప్రకటించారు. బడ్జెట్ మొత్తం రూ.12,371 కోట్లుగా కాగా, వ్యయం రూ.12,369 కోట్లు ఉంటుందని తెలిపారు. బెంగళూరు నేడు సిలికాన్ సిటీగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిందన్నారు. 1 కోటి 40 లక్షల జనాభా కలిగిన నగరంలో సౌకర్యాలు, పర్యావరణం, జీవన ప్రమాణాలను కల్పించడం పాలికె సవాళ్లుగా ఉన్నాయన్నారు.

రూ.2 కోట్ల మిగులు

- బడ్జెట్‌లో పాలికె సొంత నిధులు రూ.8,294 కోట్లు ఉండగా కేంద్ర, రాష్ట్ర సహాయ నిధులు రూ.4,077 కోట్లు ఉన్నాయి. రూ.2.17 కోట్లు మిగులు ఉంటుంది.
- బ్రాండ్ బెంగళూరు ఆలోచనలతో సమగ్రాభివృద్ధికి పునాది వేశామని తెలిపారు. పౌరకార్మికులకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీలు, బీసీలకు ఈ–సారథి పథకాన్ని అమలు చేస్తారు.
- నగరంలో 20 లక్షల ఆస్తులకు ఈ–ఖాతా, 16 వేల పౌరకార్మికులు నియామకం, చెత్త డంపింగ్‌కు 100 ఎకరాల భూమి కొనుగోలు, 8 వలయాల్లో పాలన బలోపేతం కోసం ఐఏఎస్ అధికారులు నియామకం, 50 ఇందిరా క్యాంటీన్ల ఏర్పాటు చేస్తారు.
- కొత్త లేఔట్లలో పార్కులు, అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.35 కోట్లు, చెరువుల ఆధునీకరణకు రూ.35 కోట్లు కేటాయింపు.
- రూ. 15 కోట్లతో కొత్త శ్మశాన వాటికలు, విద్యుత్ శ్మశాన వాటికల నిర్మాణానికి రూ.15 కోట్లు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున పన్నుపోటును మినహాయించారు.

బ్రాండ్ బెంగళూరు పథకాలు



బడ్జెట్‌తో బీబీఎంపీ అధికారులు

బ్రాండ్ బెంగళూరుకు పెద్దపీట వేసినట్లు బడ్జెట్లో తెలిపారు. ఇందుకు రూ.1,580 కోట్లతో ఉత్తమ సౌలభ్యాల కల్పించే పథకాలు చేపడతారు. స్వచ్ఛ బెంగళూరు, హసిరు బెంగళూరు, ఆరోగ్య బెంగళూరు, శిక్షణ బెంగళూరు, టెక్ బెంగళూరు, వైబ్రెంట్ బెంగళూరు, జల సుస్థిర బెంగళూరు అనే కల్పనలతో పథకాలను నిర్వహిస్తారు. అత్యాధునిక ట్రాఫిక్ వ్యవస్థ, ఫుట్‌పాత్‌లు, పచ్చదనం పెంపు చేపడతారు.

కొన్ని ముఖ్యాంశాలు

- రూ. 50 కోట్లతో ఎత్తైన స్కై డెక్ నిర్మాణం
- ఆకర్షణీయమైన ఉద్యానవనానికి రూ.100 కోట్లు
- సంచారయుక్త రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లు
- సంయుక్త మెట్రో ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.100 కోట్లు
- నగరంలో వాహనాలు పార్కింగ్ చట్టం 21 జారీ
- పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.211 కోట్లు.

ఏటీఎం మోసగాడు అరెస్టు

- రైతు కార్డుతో బంగారం కొనుగోలు



దొడ్డబళ్లాపురం: నగదు డ్రా చేసుకోవడానికి ఏటీఎంకు వచ్చిన రైతుకు సాయం చేసే సాకుతో ఏటీఎం కార్డును తస్కరించిన మోసగాడు అదే కార్డుతో నగల షాప్‌లో బంగారం కొనుగోలు చేశాడు. ఈ సంఘటన దేవనహళ్లి తాలూకా విజయపుర పట్టణంలో జరిగింది. వివరాలు.. చింతామణి పట్టణానికి చెందిన గురుమూర్తి అనే వ్యక్తి విజయపురలో ఏటీఎం వద్ద కూర్చుని ఎవరైనా అమాయకులు కనిపిస్తారా? అని వేచి ఉన్నాడు. ఇంతలో రాజన్న అనే రైతు వచ్చాడు. పట్టుగూళ్లు విక్రయించగా ఆ డబ్బులు బ్యాంకులో జమయ్యాయి, వాటిని డ్రా చేయడం తెలియక గురుమూర్తిని సాయం కోరాడు. గురుమూర్తి డబ్బులు డ్రా చేసిచ్చాడు కాని, రైతుకు అతని కార్డుకు బదులుగా మరో నకిలీ ఏటీఎం కార్డు ఇచ్చాడు. విజయపుర పట్టణంలో ఒక నగల షాప్‌కి వెళ్లి రైతు ఏటీఎం కార్డుతో గురుమూర్తి బంగారు ఉంగరం కొన్నాడు. ఖాతాలో డబ్బులు కోత పడినట్లు రాజన్న మొబైల్‌కు మెసేజ్ వచ్చింది, దీంతో ఏదో మోసం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరిపి వంచకుడు గురుమూర్తిని అరెస్టు చేశారు. ఇతడు గతంలోనూ చింతామణిలో పలువురు అమాయకులను మోసం చేసి జైలుకెళ్లి వచ్చాడని తేలింది. ఏటీఎం మోసాలే ఇతని వృత్తి అని గుర్తించారు. కార్డును, ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నారు.

మరాఠా బోర్డులు అవసరమా?



యశవంతపుర: బెళగావి నగరంలో జై మహారాష్ట్ర చౌక్ బోర్డును తొలగించాలని కరునాడు విజయసేన కార్యకర్తలు బెళగావి మహానగర పాలికె ఎదుట ధర్నా చేశారు. పాలికె కన్నడ వ్యతిరేక తీరును అనుసరిస్తోందని వారు ఆరోపించారు. బెళగావి మహారాష్ట్రలో ఉందా, లేక కర్ణాటకలో ఉందో అర్థం కావటం లేదని వాపోయారు. పాలికె బోర్డు కూడా హిందీ, మరాఠీలో ఉందని ఆరోపించారు. బెళగావి శివార్లలో అనగోళ గ్రామంలో మరాఠా సమితి కార్యకర్తలు జై మహారాష్ట్ర చౌక్ అని బోర్డులు పెట్టారు. దానిని తీసేయాలని తెలిపారు. బెళగావిలో అన్య రాష్ట్రానికి చెందిన బోర్డులను ఎలా అనుమతించారని ప్రశ్నించారు.

అత్యాచారయత్నం కేసులో పదేళ్ల జైలు

పుట్టపర్తి టౌన్: నల్లమాడ మండలం యర్రవంకం పల్లి చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారయత్నం చేసిన కేసులో ఇద్దరు దోషులకు 10 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ గురువారం అనంతపురం పోక్సో కోర్టు తీర్పు చెప్పింది. వివరాలు.. 2022, మే 15వ తేదీన ఓ బాలిక సాయంత్రం పశువులకు గడ్డి కోస్తుండగా అదే ప్రాంతంలో శ్రీధర్ క్వారీలో పనిచేస్తున్న కర్ణాటకకు చెందిన సిల్వరాజ్ (42), తమిళనాడుకు చెందిన చందిరీస్ కుల్లప్పన్ (48) అనే ఇద్దరు బాలికపై అత్యాచారయత్నం చేశారు. బాలిక కేకలు వేయగా వారి తల్లిదండ్రులు అక్కడికి రాగా ముద్దాయిలు ఉడాయించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నల్లమాడ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జడ్జి ఈ మేరకు తీర్పు వెలువరించారు. బాధితురాలికి ప్రభుత్వం రూ. 2 లక్షల పరిహారం అందజేయాలని ఆదేశించారు.

మహిళపై అమానుష దాడి

- బెళగావి జిల్లాలో మరో ఘోరం



యశవంతపుర: బెళగావి జిల్లాలో మరో అనుమాష కృత్యం జరిగింది. కాగవాడ తాలూకా ఐనాపుర గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని ఆరోపిస్తూ ఓ మహిళపై దాడి చేసి వివస్త్రను చేసి రోడ్డు మీదకు లాక్కొచ్చారు. ఈ గొడవపై కాగవాడ తహసీల్దార్ సంజయ్ ఇంగలే ఆ గ్రామాన్ని పరిశీలించారు.

ఐనాపుర గ్రామానికి చెందిన వరాద సుభాష్, ఆదానోర్లి సురేశ్, మాయప్ప హల్యాళ అనే వ్యక్తులు కలిసి సదరు మహిళను కబ్జా సాకుతో కొట్టి వివస్త్ర చేసినట్లు తెలిసింది. అడ్డు వచ్చి ఆమె కొడుకుపై కూడా కట్టెలు, కత్తులతో దాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. గ్రామంలో తహశీల్దార్ పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందించనున్నారు. గత ఏడాది డిసెంబరులో తమ కూతురిని తీసుకెళ్లాడని యువకునిపై కోపంతో అతని తల్లిని ఇదే మాదిరిగా హింసించారు. జిల్లాలో తరచూ మహిళలపై అమానవీయ సంఘటనలు జరగడం చర్చనీయాంశమైంది.



క్షేమంగా ప్రయాణిద్దాం

అందరూ రోడ్డు నియమాలను పాటిస్తే క్షేమంగా గమ్యం చేరుతారు. ఈ దిశగా గురువారం బెళగావిలో విద్యార్థులు, ఉద్యోగుల జాగృతి ర్యాలీ. సురక్షిత ప్రయాణమే అందరి లక్ష్యం కావాలని తెలిపారు

క్లుప్తంగా

ధార్మిక కార్యక్రమాలతో మనశ్శాంతి



ఆలయాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

విజయపుర(బెంగళూరు గ్రామీణ) : ఆలయాలు మానవాళికి మనశ్శాంతిని ప్రసాదిస్తాయని మహర్షి వాల్మీకి గురుపీఠం అధ్యక్షుడు ప్రసన్నానందపుర మహా స్వామీజీ అన్నారు. మండిబెలె రోడ్డులోని వాల్మీకి ఉద్యానవనంలో వాల్మీకి నాయక సంఘం ఏర్పాటు చేసిన వాల్మీకి ఆలయాన్ని స్వామీజీ ప్రారంభించి మాట్లాడారు. డబ్బు శాశ్వతం కాదని, ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలన్నారు.

మండ్యనుంచి పోటీ ఖాయం



మాట్లాడుతున్న ఎంపీ సుమలత

మండ్య : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మండ్య స్థానం నుంచి బరిలోకి దిగడం ఖాయమని ఎంపీ సుమలత అన్నారు. గురువారం మండ్యలో అభిమానులతో భేటీ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తానని, తన విజయానికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. విలేకరులతో మాట్లాడుతూ తాను పోటీ చేసే విషయంపై తనను నమ్మిన పార్టీ నేతలకు చెప్పినట్లు తెలిపారు. బీజేపీ టికెట్ ఇస్తే ఆ పార్టీ తరఫున పోటీ చేస్తానని, లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకాల్లో పర్యటిస్తానన్నారు.

మైదానంలోకి దూసుకెళ్లిన యువకుడిపై ఎఫ్ఐఆర్

శివాజీనగర: మహిళా ప్రీమియర్ లీగ్‌లో (డబ్ల్యూపీఎల్)భాగంగా చిన్నస్వామి మైదానంలో బుధవారం ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్ మధ్య నిర్వహించిన పోటీల సందర్భంగా మైదానంలోకి మధు అనే యువకుడు దూసుకెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆ యువకుడిపై బెంగళూరు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నగరంలోని ఒక ప్రతిష్టాత్మకమైన క్లబ్ నుంచి పోటీల టికెట్ తీసుకున్నట్లు పోలీసుల తనిఖీ ద్వారా తెలిసింది. నిందితుడు మధుపై ఐపీసీ సెక్షన్ 447 కింద కేసు నమోదు చేశారు.

రాజ్యాంగంపై జాగృతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కృష్ణరాజపురం : బెంగళూరు గ్రామీణ జిల్లా అనుగొండనహళ్లి సమీపంలో ఉన్న యాడగొండనహళ్లిలో గురువారం భారత రాజ్యాంగ జాగృతి జాతా నిర్వహించారు. హోసకోటె ఎమ్మెల్యే, కియోనిక్స్ అధ్యక్షుడు శరత్ బచ్చేగౌడ పాల్గొని రాజ్యాంగ విశిష్టతను వివరించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.

ఘనంగా మారెమ్మ జాతర



జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

తుమకూరు : తురువెకెరె తాలూకా తొరెబావిన హళ్లిలో మారెమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నగర స్వచ్ఛతపై దృష్టి సారించండి

సాక్షి బళ్లారి: మహానగర పాలికె పరిధిలో అన్ని వార్డుల్లో స్వచ్ఛతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పంచాయతీ నజీర్ సభాంగణంలో మేయర్ శ్వేత అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు నగరంలోని సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నగరంలో 15 రోజులైనా పలు వార్డుల్లో మంచినీరు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... నగర సర్వతోముఖాభివృద్ధికి నిధుల కొరత లేదని, అధికారులు పూర్తి సహకారం అందించాలన్నారు.

వ్యవసాయంపై పరిశోధనలు జరపాలి



మాట్లాడుతున్న గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్



ఐదు బంగారు పతకాలు సాధించిన శోభా



నాలుగు బంగారు పతకాలతో దివ్యా

- రాయచూరు వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండ ఇతర దేశాలతో పోటీ పడే విధంగా వ్యవసాయంపై ఆధునిక పరిశోధనలు చేయాలని రాష్ట్ర గవర్నర్, చాన్స్‌లర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. గురువారం రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం 13వ ఘటికోత్సవాలను ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను అభివృద్ధి పరచుకోవాలన్నారు. నేడు పర్యావరణం, జలసంరక్షణ, వాయు సంరక్షణలపై ఆలోచన చేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఢిల్లీ ఐసీఏఆర్ సభ్యుడు ఝూ మాట్లాడుతూ... ప్రతి పంచాయతీకి వ్యవసాయ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు, 26 మందికి డాక్టరేట్ పట్టాలను అందించారు. వేడుకలో వీసీ హనుమంతప్ప, రిజిస్ట్రార్ వీరన గౌడ, అధికారులు పాల్గొన్నారు.

కొత్త దంపతులకు తీవ్ర గాయాలు

- బైక్‌ను ఢీకొన్న కారు



నవ దంపతులు ఉమేష్, వరలక్ష్మీ (ఫైల్)

రోణ్లి: కారు డ్రైవర్ నిర్లక్ష్యం కొత్త దంపతులను ఆస్పత్రిపాలు చేసింది. మండల పరిధిలోని రత్నగిరి గ్రామం హొసకెర వెళ్లే దారిలో ఆర్చ్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమేష్, వరలక్ష్మీ అనే నవదంపతులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అగళి మండలం నందరాజనహళ్లి చెందిన ఉమేష్, తుమకూరు జిల్లా తిప్పగానహళ్లి చెందిన వరలక్ష్మీతో గత నెల 21వ తేదీన పెళ్లయింది. అత్తారింటి నుంచి భార్యతో కలిసి ఉమేష్ బైక్‌లో రత్నగిరి గుండా తమ గ్రామానికి బయల్దేరారు. అయితే ఘటనాస్థలి వద్ద వెనుక నుంచి ఓ కారు అతి వేగంగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. బైక్ కింద పడడంతో ఉమేష్ కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వరలక్ష్మీకి నోటి వద్ద గాయం అయింది. వెంటనే 108 ద్వారా శిర ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు.



పీయూసీ పరీక్షలకు ఏర్పాట్లు సాగుతున్నాయి. గురువారం బెంగళూరు శేషాద్రిపురంలోని ఓ కళాశాలలో ఏర్పాట్లలో నిమగ్నమైన సిబ్బంది

మేయర్ వినూత్న నిరసన

- టాంగాలో సమావేశానికి రాక



టాంగాలో సమావేశానికి మేయర్

సాక్షి,బళ్లారి: ఆమె అధికార పార్టీకి చెందిన పాలికె మేయర్.. అయినప్పటికి నిబంధనలు ప్రకారం వాహనంతో పాటు, డ్రైవర్‌ను కూడా పాలికె ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే పాలికె అధికారులు నిర్లక్ష్యంగా నడుచుకోవడంతో ఆమె వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేసింది. గురువారం విజయపుర మహానగర పాలికె సామాన్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మేయర్ అధ్యక్షత సమావేశం జరగాల్సి ఉండగా, ఆమెకు వాహనం, డ్రైవర్ లేకపోవడంతో విజయపుర మేయర్ మహాజబీన్ హుర్తీ టాంగాలో సామాన్య సమావేశానికి హాజరయ్యారు. ఆమె ఆలస్యంగా రావడంతో సమావేశం కూడా ఆలస్యంగానే ప్రారంభమైంది. తనకు వాహనం కూడా లేదని, డొక్కు వాహనం ఇచ్చారని, అందుకు డ్రైవర్ కూడా ఏర్పాటు చేయలేదని, పాలికె కమిషనర్‌కు ఎన్నిసార్లు చెప్పినాపట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. నగరాభివృద్ధి పనుల్లో తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికార పార్టీకి చెందిన తననే పట్టించుకోవడం లేదని పాలకులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో బీజేపీ సభ్యులు కూడా ఆమెకు మద్దతుగా నిలిచారు. అనంతరం పాలికె కమిషనర్ స్పందించారు. తక్షణం వాహనం ఏర్పాటు చేయడంతో పాటు వాహన డ్రైవర్ కూడా నియమిస్తామని హామీ ఇచ్చారు.

ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలి

రాయచూరు రూరల్: వ్యవసాయ కూలీలకు ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలని మాడగిరి పంచాయతీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అధ్యక్షురాలు తారమ్మ మాట్లాడుతూ...ఐదేళ్లుగా సిరివార తాలూకా పంచాయతీ ఇన్‌చార్జ్ శర్భిన్నుషా నరేగాలో పనిచేసి వారిని కంప్యూటర్ నుంచి తొలగించి అధ్యక్షులకు తెలియకుండా పనులు చేపడుతున్నారని, కూలీలకు డబ్బులు చెల్లించని అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

సత్యసాయి సంస్థల సేవలు విస్తరించేందుకు కృషి



బాగల్‌కోటెలో నిర్మించిన పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జె.రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: విద్య, వైద్య సామాజిక సేవా రంగాల్లో సత్యసాయి సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు పేర్కొన్నారు. బీజాపూర్ (విజయపుర), బాగల్‌కోటెలో నిర్మించిన నూతన పాఠశాలల భవనాలను ఆర్‌జె.రత్నాకర్‌రాజు, ట్రస్ట్ సభ్యుడు మనోహన్ శెట్టితో కలసి ప్రారంభించారు. అక్కడే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సైతం ప్రారంభించారు. చాల సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కర్ణాటక సత్యసాయి సేవా సంస్థలు రూ.2.60 కోట్లు వెచ్చించి నూతనంగా నిర్మించారు. బాగల్‌కోటెలో రూ.1.60 కోట్లు వెచ్చించి మరో నూతన భవనాన్ని నిర్మించారు. ఆర్‌జె.రత్నాకర్ రాజు మాట్లాడుతూ,రాబోవు తరాలకు మంచి భవిష్యత్తును అందించాలన్న లక్ష్యంతో సత్యసాయి గొప్ప విద్యా విధానాన్ని రూపొందించారన్నారు. కర్ణాటక రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

యోగేష్‌గౌడ హత్య కేసు..

- సోదరుడికి బెదిరింపులు



పోలీసు అధికారికి ఫిర్యాదు చేస్తున్న గురునాథ్‌గౌడ

హుబ్లీ: జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు, దివంగత యోగేష్‌గౌడ సోదరుడు గురునాథ్‌గౌడకు ఫోన్ చేసి ప్రాణాలను తీస్తామంటూ బెదిరించిన ఘటనపై ధార్వాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. తాలూకాలోని గోపనకుప్ప గ్రామంలో తన ఇంటికి వచ్చి సోమాపుర గ్రామ మంజూబేగూర అనే వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డారని గురునాథ్ గౌడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొబైల్ ద్వారా బుధవారం అర్ధరాత్రి కాల్ చేసి ఇష్టమొచ్చినట్లుగా దూషించాడని బాధితుడు పేర్కొన్నారు. అంతేగాక తాను ఇంట్లో లేని సమయంలో కాంగ్రెస్ కార్యకర్త అయినా మంజు మా ఇంటికి వచ్చి తీవ్ర పదజాలంతో నిందించి బెదిరించారన్నారు. వెంటనే మంజూపై తగిన చర్యలు తీసుకొని తనకు రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

బయో డీజిల్ అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా స్వామి

రాయచూరు రూరల్: రాష్ట్ర బయోడీజిల్ అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా రాయచూరుకు చెందిన రాజశేఖర్ రామస్వామిని నియమిస్తూ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదేశాలు జారీ చేశారు. గురువారం గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే సిఫార్సుల మేరకు రామస్వామి నియమితులయ్యారు.

కామేశ్వర పాటిల్‌కు కనకగిరి కేసరి ప్రశస్తి

గంగావతి: కనకగిరి ఉత్సవాల సందర్భంగా జరిగిన కుస్తీ పోటీల్లో బెళగావి కామేశ్వర పాటిల్‌కు కనకగిరి కేసరి ప్రశస్తి లభించింది. ఈ ఉత్సవాల సందర్భంగా బుధవారం రోజున రాష్ట్ర స్థాయి 74 కేజీల విభాగంలో కుస్తీ పోటీలను నిర్వహించగా ఇందులో కామేశ్వర్‌పాటిల్‌కు కనకగిరి కేసరి లభించింది. కేసరి ప్రశస్తితో పాటు వెండిగద, రూ. 15 వేల నగదు బహుమతిని అందజేశారు. ఇదే విభాగంలో దావణగెరెకు చెందిన నాగేశ్‌కు కనకగిరి కుమార ప్రశస్తి, బాగల్‌కోటెకు చెందిన అల్తాఫ్‌కు ద్వితీయ ప్రశస్తి లభించింది. 61 కేజీల విభాగంలో రోహన్‌కు కనకగిరి కిశోర్ ప్రశస్తి అందుకున్నారు.

సిడి బండి రథోత్సవంపై ముందస్తు సమావేశం

బళ్లారి టౌన్: నగరంలో మార్చి 19న జరగనున్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం సిడి రథోత్సవంపై ముందస్తు సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర పాల్గొని మాట్లాడుతూ...ఆలయం చుట్టుపక్కల పరిశుభ్రత చేపట్టి తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, పోలీసు బందోబస్తును కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. వైద్య బృందాలు, అంబులెన్స్ సదుపాయాలు, సహాయవాణి కేంద్రాలు, అగ్నిమాపకదళ సేవలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ... రథోత్సవం సందర్భంగా ప్రముఖ కూడలిలో దీపాలంకరణలు చేపట్టి అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీలకు ప్రత్యేక సమయాన్ని కేటాయించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. 2న మోకాలో జరగనున్న ముదిమల్లేశ్వర దేవస్థానం రథోత్సవానికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

కిరాతక తండ్రి ఘాతుకం

హుబ్లీ: బిడ్డ ఏడుస్తుండటంతో ఓ వ్యక్తి ఆ చిన్నారిని గోడకేసి కొట్టి తీవ్రంగా గాయపరిచిన అమానవీయ ఘటన ధార్వాడ తాలూకా యాదవాడ గ్రామంలో గురువారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన శంభులింగయ్య ఈ దారుణానికి పాల్పడిన వ్యక్తి. తండ్రి దారుణ ఘటనతో ఏడాది చిన్నారి చావు బతుకుల మధ్య కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మద్యానికి బానిసైన శంభులింగయ్య ఏడుస్తున్న తన కూతురుని బుజ్జగించలేక కాళ్లను పట్టుకుని గోడకేసి కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో కిమ్స్ ఐసీయూకు తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు గరగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

రక్తదానం మహాదానం

కంప్లి: అత్యవసర సమయాల్లో ప్రాణాలను నిలబెట్టే రక్తదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్‌జీటీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగ కళాశాల పాలక మండలి అధ్యక్షులు ఎస్ఎన్. రుద్రప్ప, కార్యదర్శి నాగరాజ్‌లు యువతకు పిలుపునిచ్చారు. కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

ప్రపంచ సంస్కృతులను తెలిపేది సినిమా

సాక్షి బెంగళూరు: సినిమా ఎంతో ప్రభావవంతమైన మాధ్యమం అని, చూసేవారి మనస్సు, ఆలోచనలపై ప్రభావం చూపించే శక్తి ఒక్క సినిమాకే ఉందని సీఎం సిద్ధరామయ్య తెలిపారు. గురువారం సాయంత్రం 15వ బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాన్ని విధానసౌధ ఎదుట జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభించారు. అంతకుముందు మూడు సార్లు గ్రామీ అవార్డులు సొంతం చేసుకున్న రికీ కేజ్ ఆధ్వర్యంలో జరిగిన సంగీత కార్యక్రమం ఆహుతులను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా సీఎం సిద్ధరామయ్య మాట్లాడుతూ ఇతర దేశాల సంస్కృతులు, ఆచార , వ్యవహారాలను తెలుసుకునేందుకు సినిమా ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిషత్ చైర్మన్ బసవరాజు హొరట్టి, నటుడు శివరాజ్ కుమార్, చిత్రోత్సవం రాయబారి డాలి ధనంజయ్, సినీ రంగ ప్రముఖులు తదితరులు హాజరయ్యారు. మార్చి 7 వరకు జరిగే ఈచలనచిత్రోత్సవంలో భారతీయ సినిమాలతో పాటు వివిధ రకాల అంతర్జాతీయ చిత్రాలు పోటీ పడనున్నాయి. మొత్తం 50 దేశాలకు చెందిన 180 పైగా సినిమాలు ఈ చలనచిత్రోత్సవంలో ప్రదర్శితం కానున్నాయి. కన్నడ చలనచిత్ర పరిశ్రమ 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 30 కన్నడ సినిమాలను ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు.

జేడీఎస్ ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న జేడీఎస్ కార్యకర్తలు

కోలారు: విధాన సౌధ ప్రాంగణంలో పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడాన్ని ఖండిస్తూ గురువారం నగరంలోని మెక్కె సర్కిల్ వద్ద జేడీఎస్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జేడీఎస్ నాయకుడు సిఎంఆర్ శ్రీనాథ్ రాజ్యసభ ఎన్నికల సమయంలో విజేత నాసిర్ హుసేన్ తరఫున వచ్చిన అనుచరులు పాకిస్తాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడం శోచనీయమన్నారు. ఇది దేశ ద్రోహ చర్య అయి అని, వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మీడియాపై ఇష్టానుసారంగా వ్యవహరించిన ఎంపీ నాసిర్ హుస్సేన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కోచిముల్ డైరెక్టర్ వడగూరు డీవీ హరీష్, డికె రమేష్, బణకనహళ్లి నటరాజ్, బాబు మౌని, మూరాండహళ్లి గోపాలప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోట యల్లమ్మ వార్షికోత్సవం



అలంకరణలో అమ్మవారు

మాలూరు: తాలూకాలోని లక్కూరు గ్రామంలో కోట యల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామునుంచే అమ్మవారికి పూజా కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు మధు శాస్త్రి నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యుడు బాబు, మాజీ సభ్యుడు సురేష్, దేవాలయ సమితి అధ్యక్షుడు వెంకటరమణప్ప, కోశాధికారి మునియప్ప తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

అటవీ అధికారిని సస్పెండు చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: ఆక్రమణల పేరుతో రైతులకు అపారనష్టం కలిగించిన జిల్లా అటవీ అధికారిని సస్పెండు చేసి అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కెపిఆర్ఎస్ కార్యకర్తలు గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు., ఈ సందర్భంగా మాట్లాడిన కెపిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ పోరాటాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి ఏడుకొండలు ఇటీవల తాలూకాలోని 97 గ్రామాల 166 సర్వే నెంబర్లలో ఉన్న 25 వేల ఎకరాల భూమిని తహసీల్దార్ సమక్షంలో కార్యాచరణ జరిపి రైతుల భూదాఖలాలు పరిశీలన చేయకుండ ఆక్రమణల పేరుతో రాత్రికి రాత్రే ఎంతో విలువైన మామిడి చెట్లను తొలగించి రైతులకు అపార నష్టం కలిగించారని అన్నారు. అటవీ అధికారిని హైకోర్టు న్యాయమూర్తి కూడా చీవాట్లు పెట్టారు. కేసు కోర్టులో ఉన్నందున అటవీశాఖ అధికారులు ఇకపై ఎట్టి పరిస్థితిలోను ఆక్రమణల పేరుతో తొలగించడానికి రాకూడదన్నారు. అనంతరం తహసీల్దార్ సుధీంద్రకు వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్, నారాయణస్వామి, ఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వొద్దు

కోలారు : ధార్మిక స్థలాలు, పాఠశాలల సమీపంలో మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వొద్దని కోరుతూ గౌనిపల్లి గ్రామస్తులు తాపం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ధార్మిక కేంద్రాల వద్ద మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఉంటారని, అలాంటి చోట మద్యం దుకాణాలు ఉండటం తగదన్నారు. విద్యార్థులకు సైతం అసౌకర్యంగా ఉంటుందన్నారు. ధర్నాలో గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు హెచ్ హరమత్తుల్లా, అమీర్ ఖాన్, జికె సుబ్రమణి, అరీఫ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ద్వితీయ పరీక్షలు



అధికారుల సమావేశంలో కలెక్టర్ పాషా

కోలారు: జిల్లాలోని 28 పరీక్షా కేంద్రాలలో మార్చి 1 నుంచి జరిగే ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్షల సంబంధించి ఇంటర్ విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన పూర్వ సిద్ధతా సమావేశంలో మాట్లాడారు, ఎలాంటి లోపాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప మాట్లాడుతూ... పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, ఈసారి 13,958 మంది విద్యార్థులు కొత్తగా 1089 మంది సప్లిమెంటరీ, 877 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశ్నపత్రాలు తీసుకు వచ్చే వాహనాలకు జీపీఎస్ అమర్చినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల వరకు నిషేధాజ్ఞలు విధించామని, పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జెరాక్స్ సెంటర్‌లను మూసి వేయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్, ఎస్పీ ఎం నారాయణ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కెజీఎఫ్: తాలూకాలోని పిచ్చహళ్లి గ్రామంలో చాముండేశ్వరి దేవి దేవాలయంలో కుంభాభిషేక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. 150 సంవత్సరాల అత్యంత పురాతన దేవాలయంలో పుష్కరాలకొకసారి కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహిస్తారు. 211 కలశాలను మహిళలు ఆలయానికి తీసుకు వచ్చి అమ్మవారికి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్చకులు వేదమంత్ర పారాయణం పఠించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



విజేతలను సన్మానించిన దృశ్యం

క్రీడలతో ఆటవిడుపు

కోలారు: నిరంతరం ఒత్తిళ్ల మధ్య జీవనం సాగిస్తున్న న్యాయవాదులు క్రీడలు, చిన్నపాటి వ్యాయామాలు చేసి ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని న్యాయమూర్తి జీఏ మంజునాథ్ తెలిపారు. గురువారం ముళబాగిలు నగరంలో న్యాయవాదుల క్రికెట్ పోటీలలో విజేతలైన కోలారు న్యాయవాదుల జట్టును సన్మానించి మాట్లాడారు. క్రీడలు ఆరోగ్యంతో పాటుగా మనసు ప్రశాంతంగా ఉంచుతాయన్నారు. నిరంతరం కోర్టు కార్యకలాపాలలో ఉండే న్యాయవాదులకు క్రీడలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. ఈ మధ్య మారుతున్న ఆహారపు అలవాట్లతో ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరు క్రీడలలో పాల్గొనాలన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం మునేగౌడ మాట్లాడుతూ... కోలారు న్యాయవాదుల సంఘం సభ్యులు మూడు జిల్లాల క్రీడాకారులను ఓడించి విజేతలు కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి దివ్య దేవమానె, బాలకృష్ణ భట్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈత కొలనులో పడి బాలుడు మృతి



ఈత కొలనును పరిశీలిస్తున్న పోలీసులు



మృతిచెందిన బాలుడు విశ్వనాథ్

దొడ్డబళ్లాపురం: ఈత కొలనులో పడి బాలుడు మృతిచెందిన సంఘటన దొడ్డ తాలూకా తిప్పూరు వద్ద ఉన్న శ్రీనివాస్ ఫారంలో చోటుచేసుకుంది. బిజాపురకు చెందిన యమనప్ప ఇక్కడి ఫారంలో పనిచేస్తూ అక్కడే తలదాచుకుంటున్నారు. ఫారం వద్దనే ఈత కొలను ఏర్పాటు చేశారు. దానిపై నీలం రంగు టార్పాల్ కప్పారు. ఈ విషయం తెలియక యమనప్ప కుమారుడు విశ్వనాథ్(10) దాని మీద నడవడంతో నీటమునిగి మృతిచెందాడు. దొడ్డబెళవంగల పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు అధికారి ఇంటికే కన్నం

మైసూరు : దొంగలు ఏకంగా పోలీస్ క్వార్టర్స్‌లోకి చొరబడ్డారు. ఓ పోలీస్ అధికారి ఇంటికి కన్నం వేసి నగలు దోచుకెళ్లారు. మైసూరులోని జాకీ క్వార్టర్స్‌లో కేఎస్ఆర్‌పీకి చెందిన జమేదార్ ఎం.ఎ నరగుంద మర్ అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఈయన తన భార్యతో కలిసి శ్రీరంగ పట్టణంలో ఉన్న నిమిషాంబ ఆలయానికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా రూ. 2 లక్షల విలువైన 43 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి నజరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాజీ ఐఏఎస్ అధికారి శివరామ్ కన్నుమూత



శివరామ్(ఫైల్)

యశవంతపుర/శివమొగ్గ: నటుడు, మాజీ ఐఏఎస్ అధికారి కె శివరామ్(71) మృతి చెందారు. గతనెల 3న లోబీపీతో గుండెపోటుకు గురైన ఈయన బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం కన్ను మూసినట్లు ఆయన అల్లుడు ప్రదీప్ తెలిపారు. 2007లో టైగర్ సినిమా ద్వారా సినీ రంగానికి పరిచయమైన ఈయన వసంతకావ్య, యారిగె బేడ దుడ్డు, గేమ్ ఫర్ లవ్, నాగ, ఓ ప్రేమ దేవతెలాంటి కన్నడ చిత్రాల్లో శివరామ్ నటించారు. ఈయన శివమొగ్గ జెడ్పీ సీఈఓగా విధులు నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు విశేష సేవలు అందించి మన్ననలు పొందారు. శివరామ్ మృతికి సీఎం సిద్దరామయ్య సంతాపం వ్యక్తం చేశారు. పేరుగాంచిన నటుడిని కోల్పోయినట్లు మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, త్వరగా కోలుకుంటాడని ఆశించానని, ఇంతలోనే ఆయన మృతి వార్త వినాల్సి వచ్చిందన్నారు. మాతృభాష కన్నడలో ఐఏఎస్ పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన శివరామ్‌ను కన్నడ ఐఏఎస్ అధికారిని ప్రజలు పిలిచేవారు.

ఆస్తి పన్ను పెంపుపై సమావేశంలో నిరసన



పోడియంను చుట్టుముట్టిన కాంగ్రెస్ సభ్యులు

యశవంతపుర: మంగళూరు మహానగర పాలికెలో పెంచిన ఆస్తి పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం పాలికె సర్వసభ్య సమావేశంలో కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. స్వయం ప్రకటిత ఆస్తి పన్నులను నాలుగు రెట్లు పెంచారని ప్లకార్డులు ప్రదర్శించారు. కట్టడాలు, ఖాళీ స్థలాలపై పన్నులు పెంచటం ప్రజలకు ఇబ్బందిగా మారిందని, తక్షణం ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పోడియంను చుట్టుముట్టారు. దీంతో సమావేశాన్ని మేయర్ సుధీర్‌శెట్టి కొంత సేపు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సభ్యులు ఆందోళనకు దిగడంతో బీజేపీ సభ్యులు కూడా ఎదురు దాడికి దిగారు. దీంతో సమావేశంలో గందరగోళం నెలకొంది.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే మంజుల

కృష్ణరాజపురం: మహదేవపుర నియోజకవర్గం మండూరిలోని శ్రీ అంభా భవాని ఆలయంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మంజుల పాల్గొని ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన శోభ యాత్రలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఢోకా లేదు

- గ్యారంటీలపై అవాస్తవాల ప్రచారం
- బడ్జెట్‌పై చర్చలో సీఎం సిద్ధు



మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు స్తంభించి ఉంటే ఇంత పెద్ద మొత్తంలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సాధ్యపడేది కాదు. రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోలేదు. గ్యారంటీ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులు జరిగాయని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. గురువారం విధానసభలో బడ్జెట్‌పై చర్చకు సమాధానం ఇచ్చిన ఆయన.. గ్యారంటీ పథకాల వల్ల రాష్ట్రంలో అభివృద్ధి కార్యాలు కుంటుపడ్డాయనటంలో వాస్తవం లేదని అన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు అవాస్తవాలన్నారు. అభివృద్ధి పనులు జరుగకపోతే రూ.3 లక్షల 71 వేల కోట్లతో బడ్జెట్ సమర్పించడం సాధ్యమయ్యే పని కాదన్నారు. ఈ సందర్భంగా బడ్జెట్ లెక్కలను వివరించారు. గతంలో బీజేపీ బొమ్మై సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ కంటే తమది రూ. 62 వేల కోట్లు అధికమని చెప్పారు. రాష్ట్రంలో జీడీపీ కూడా వృద్ధి అయింది. బడ్జెట్ మొత్తం పెరిగిందని అన్నారు. విద్య, ఆరోగ్య, రోడ్డు అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. గతంలో బీజేపీ ప్రభుత్వంవారు అభివృద్ధి చేయలేదు. దోచుకోవడంలో మునిగిపోయారు, మేము గ్యారంటీ పథకాలతో అభివృద్ధిని చేశామని అన్నారు.

బీజేపీ, జేడీఎస్‌పై విమర్శలు

స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీగాని, ఆర్ఎస్ఎస్‌గాని పాల్గొనలేదు. వీరు రాజ్యాంగ వ్యతిరేకులు. రాజ్యాంగాన్ని మార్చటమే వీరి లక్ష్యం, ప్రజాస్వామ్యంపై వీరికి నమ్మకం లేదని సీఎం దుయ్యబట్టారు. జేడీఎస్‌వారు బీజేపీతో కలిశారు, అందుచేత వారు సెక్యులర్ అనే పదాన్ని తీసివేసి జనతాదళ బీజేపీ అని పేరు పెట్టుకోవటం మంచిదని హేళన చేశారు. వేరే రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రానికి అన్నిటిలోనూ అన్యాయం జరుగుతోంది. రోడ్డు నిర్మాణం, రైలు మార్గాల నిర్మాణం అన్నిటిలోనూ రాష్ట్రానికి అన్యాయమైందని ఆరోపించారు. చివరకు 2024-25వ సంవత్సరపు బడ్జెట్‌కు విధానసభలో ఆమోదం లభించింది.

రేషన్ డీలర్ల కమీషన్ పెంపు

రాష్ట్రంలో రేషన్ డీలర్లకు ప్రతి కేజీ బియ్యానికి ఇచ్చే కమీషన్‌ను ఒకటిన్నర రూపాయికి పెంచనున్నట్లు సీఎం చెప్పారు. ప్యాలెస్ మైదానంలో జరిగిన అన్నభాగ్య దశమానోత్సవంలో ఆయన మాట్లాడారు. తాము అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అన్న భాగ్యకు ప్రధాని నరేంద్ర మోదీ బియ్యం ఇవ్వలేదని సీఎం విమర్శించారు.

3న ఓపెన్ వర్సిటీ స్నాతకోత్సవం

మైసూరు : మైసూరు నగరంలో ఉన్న కర్ణాటక రాష్ట్ర ఓపెన్ యునివర్సిటీ 19వ ఘటికోత్సవం ఈనెల నెల 3వ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముగ్గురు ప్రముఖులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు వీసీ ప్రొఫెసర్ శరణప్ప వి. హలసె తెలిపారు. కర్ణాటక సమాచార కమిషన్ రాష్ట్ర సమాచార కమిషన్ డాక్టర్. హెచ్.సి. సత్యన్, చిత్రదుర్గ బాపూజీ సామూహిక విద్యా సంస్థల కార్యదర్శి కె.ఎం. వీరేష్, మండ్యలోని ఎస్‌బీ విద్యాసంస్థల కార్యదర్శి మిరా శివలింగయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామని ఆయన తెలిపారు. ముగ్గురికి పీహెచ్‌డీ పట్టాలు, 30 మందికి బంగారు పతకాలు, 37 మందికి నగదు బహుమతులు, 7869 మందికి డిగ్రీ పట్టాలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆర్మీ పరీక్ష పాస్ కాలేక ఆత్మహత్య



కార్తిక్(ఫైల్)

దొడ్డబళ్లాపురం: ఆర్మీ పరీక్షల్లో ఫెయిలు కావడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శృంగేరి తాలూకా యడదాళు గ్రామంలో చోటుచేసుకుంది. ఇండియన్ ఆర్మీలో సేవలందించాలని గ్రామానికి చెందిన కార్తిక్(23) అనే యువకుడు ఎంతో ఆశలు పెట్టుకున్నాడు. ఈక్రమంలో భారత సైన్యం నియామకాల పరీక్షలు రాశాడు. ఉత్తీర్ణత కాకపోవడంతో డెత్‌నోట్ రాసి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శృంగేరి పోలీసులు కేసు దర్యాప్తుచేపట్టారు.

బీకాం విద్యార్థినికి కేటుగాళ్ల టోపీ

దొడ్డబళ్లాపురం: కొంత పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం ఇస్తామని చెప్పి సైబర్ కేటుగాళ్లు ఓ యువతికి రూ.12 లక్షల మేర టోపీ పెట్టారు. ఈ ఘటన రామనగరలో వెలుగు చూసింది. రామనగర పట్టణ నివాసి నయనశ్రీ బీకాం చదువుతోంది. ఆమె టెలిగ్రాం యాప్ ఉపయోగిస్తోంది. అందులో ఒక కంపెనీ నుంచి ఒక మెసేజ్ వచ్చింది. ఓపెన్ చేసి చూడగా ఎంత పెట్టుబడి పెడితే అంతకు రెట్టింపు లాభం వస్తుందనే సమాచారం ఉంది. నమ్మిన యువతి ఆ మెసేజ్ పంపిన వ్యక్తులను ఫోన్‌లో సంప్రదించింది. వారు చెప్పిన మేరకు మొదట తక్కువ పెట్టుబడి పెట్టింది. తక్షణం అవతలి వైపు నుంచి రెట్టింపు నగదు పంపించారు. దీంతో పూర్తిగా నమ్మిన యువతి పలు విడతలుగా మొత్తం రూ.12 లక్షల 59వేలు పెట్టుబడి పెట్టింది. అయితే ఆ మొత్తానికి సంబంధించి ఎటువంటి డబ్బు తిరిగి పంపలేదు. మోసపోయినట్టు తెలుసుకున్న యువతి రామనగర పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భగవద్గీతతో సమస్యలకు పరిష్కారం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజేంద్రకుమార్, ఎం.లోకేశ్వరరావు తదితరులు

బనశంకరి: ప్రపంచంలోని అన్ని సమస్యలకు పరిష్కారం లభించే ఏకైక గ్రంథం భగవద్గీత అని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎం. లోకేశ్వరరావు తెలిపారు. ఆయన రచించిన మోడ్రన్ మేనేజ్‌మెంట్ ది గీత వే అనే పుస్తకంతో పాటు స్టాంపులను గురువారం బెంగళూరు నగరంలోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కేంద్ర తపాలా కార్యాలయంలో కర్ణాటక సర్కిల్ తపాలాశాఖ ప్రధాన అధికారి రాజేంద్ర కుమార్ ఆవిష్కరించారు. ఎం.లోకేశ్వరరావు మాట్లాడుతూ.. భగవద్గీత పురాణ మహాభారత ఇతిహాసంలో ముఖ్యమైన భాగమన్నారు. భగవద్గీతలో హిందూమతం కీలకమైన వేదజ్ఞానం సారాంశం ఉందన్నారు. ధర్మం, సహజన్యాయానికి, మన సాక్షికి సమానమన్నారు.

తల్లీబిడ్డలకు అత్యాధునిక వైద్య సేవలు



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డాక్టర్ మంజునాథ్

చిక్కబళ్లాపురం: తల్లీబిడ్డలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని నంది వైద్యకీయ విజ్ఞాన సంస్థ ఆస్పత్రి డైరెక్టర్ మంజునాథ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన తల్లీబిడ్డల ఆస్పత్రిని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. 135 పడకల ఆస్పత్రిలో సోమవారం నుంచి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఉన్నా ఈ ఆస్పత్రిలో సేవలు అందిస్తారన్నారు. వైద్యురాలు మంజుల మాట్లాడుతు కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్‌కు ధన్యవాదాలు తెలిపారు. వైద్యాధికారులు మహేశ్‌కుమార్, రమేశ్ రవికుమార్,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యాపారిపై దాడి చేసి నగదుతో ఉడాయింపు

మైసూరు : దుకాణదారుడిపై దాడి చేసి నగదు దోచుకెళ్లిన ఘటన మైసూరులో జరిగింది. వివరాలు.. ఉదయగిరిలోని పాత ఆర్ఎంసీ యార్డులో జబీర్‌బేగ్ అనే వ్యక్తి పండ్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతను షఫీఖాన్ అనే వ్యక్తికి రూ.రూ.5లక్షలు అప్పు ఇచ్చాడు. కొన్ని రోజుల క్రితం రూ.75వేలు తిరిగి ఇచ్చాడు. వ్యాపారం చేసేచోట తనకు సగం స్థలం ఇస్తే దుకాణం పెట్టుకొని మిగతా బాకీ తీర్చుతానని షఫీఖాన్ పేర్కొనగా జబీర్‌ఖాన్ అంగీకరించాడు. అయితే దుకాణం ఖాళీ చేయాలని షఫీఖాన్ దౌర్జన్యానికి దిగి జబీర్‌బేగ్‌ను బెదిరించాడు. కొంతమంది మనుషులను తీసుకొచ్చి దాడి చేసి వస్తు సామగ్రిని ధ్వంసం చేశారు. క్యాష్ బాక్స్‌లో ఉన్న రూ.40వేలు లాక్కున్నాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించి ఉడాయించాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతను ఇచ్చిన ఫిర్యాదుతో షఫీఖాన్, అయూబ్‌ఖాన్, జబీఖాన్, సాదిఖ్‌ఖాన్‌తో సహా మొత్తం ఏడు మందిపై పోలీసులు కేసు నమోదు చేశాడు.

2న ఘంటసాల పురస్కారాల ప్రదానం

శివాజీనగర: అమరగాయకుడు గాన గంధర్వ పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు శతమానోత్సవాన్ని పురస్కరించుకొని రంగమ్మ భీమప్ప చెట్టి లలితా కళా ట్రస్ట్, చెన్నై కళా ప్రదర్శిని సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 2న శనివారం సంగీత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. నగరంలోని ఏడీఏ రంగమందిరంలో సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో సంగీత సాహిత్యవేత్తలకు కళా ప్రదర్శిని ఘంటసాల పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పద్మశ్రీ ప్రొఫెసర్ చిత్రా విశ్వేశ్వరన్, డాక్టర్ హంసలేఖ, డాక్టర్ లలితా శ్రీనివాసన్, డాక్టర్ టీ.ఎస్.సత్యవతి కళా ప్రదర్శిని ఘంటశాల అవార్డును అందుకుంటున్నట్లు తెలిపారు. ఈ సంగీత నాట్య కార్యక్రమంలో కలైమామణి పార్వతి రావి ఘంటసాల, కర్ణాటక కళాశ్రీ డాక్టర్ వీణా మూర్తి విజయ్, కళాశ్రీ సత్యనారాయణరాజు తదితరులు తమ సంగీత నాట్య కార్యక్రమాన్ని ప్రదర్శించనున్నారు. జస్టిస్ డాక్టర్ మంజులా చెల్లూరు మాజీ ఎంపీ కే.సీ.రామమూర్తి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

కేఎస్ ఆర్టీసీ బస్సుకు తల్లీకుమార్తె బలి

యశవంతపుర: కేఎస్ఆర్‌టీసీ బస్సు స్కూటర్‌ను ఢీకొని తల్లీకుమార్తె మృతి చెందారు. ఈ ఘటన ఉత్తరకన్నడ జిల్లా హొన్నావర తాలూకా మంకిలో జరిగింది. మంకి గ్రామానికి చెందిన సవితా రాజు ఆచారి(40), అంకితా ఆచారి(17)లు స్కూటీపై జాత్రే పేటకు వెళ్తుండగా మంగళూరు నుంచి బెళగావి వెళ్తున్న కేఎస్ఆర్‌టీసీ బస్సు ఢీకొంది. కిందపడిన తల్లీకుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. భట్కళ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మంకి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బోర్డులు కన్నడలోనే ఉండాలి

గౌరిబిదనూరు: దుకాణాలు, ఇతర ప్రైవేటు సంస్థల బోర్డులు కన్నడ భాషలో ఉండాలని, ఇందుకు ప్రభుత్వం ఫిబ్రవరి 28 వరకు గడువు విధించినా పట్టణంలోని ఇప్పటికీ అనేక దుకాణాల బోర్డులు కన్నడ భాషలోనికి మార్చలేదని కన్నడ రక్షణా వేదికె అధ్యక్షుడు డా. ఆదిమూర్తి రెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ వారంరోజులలోగా అన్ని దుకాణాల బోర్డులను కన్నడభాషలోకి మార్చాలని, లేదంటే నగరసభ అధికారులతో కలిసి తాళాలు వేస్తామని చెప్పారు. కన్నడ భాషాభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు.

వృద్ధులకు సన్మానం

బొమ్మనహళ్లి : ఆనేకల్ పట్టణంలో ఉన్న శ్రీరామకుటీరలో శ్రీ మలెమహదేశ్వర స్వామి వృద్ధాశ్రమం ట్రస్టుకు చెందిన చంద్రా స్వామి ఆధ్వర్యంలో మహా సంభ్రమ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులను సన్మానించారు. పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులను అందజేశారు. కుంతూరు మఠానికి చెందిన అల్లమప్రభు స్వామీజీ, సమితి సభ్యులు హేమావతి, ఆర్. ప్రదీప్, యల్లప్ప, సునిల్, మొహన్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వివాహోత్సవం

బనశంకరి: నగరంలోని బనశంకరీదేవీ దేవస్థానంలో 54 జంటలు నూతన దాంపత్యజీవితంలోకి అడుగుపెట్టాయి. గురువారం బనశంకరి సామూహిక వివాహవేదిక ఆధ్వర్యంలో కులాంతర వివాహాలకు ప్రాధాన్యత ఇచ్చారు. 54 జంటల్లో దళిత, క్రైస్తవ, బీసీ, ఓసీ జంటలు ఉన్నారు. ఉదయం 11.30 గంటలకు అర్చకులు ఏ.చంద్రమోహన్, ఆర్.సత్యనారాయణశాస్త్రి వేద మంత్రాలు పఠిస్తుండగా మూడుముళ్ల వేడుక జరిగింది. శివసుజ్ఞానతీర్థ మహాస్వామీజీ, ద్వారకనాథగురూజీ, ఏహెచ్.బసవరాజ్, బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్, సినీ నటి తార తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

విద్యార్థుల ఆరోగ్యానికి మానసిక సమస్యలు చేటు

తుమకూరు : మానసిక సమస్యలు ప్రజలకు పెనుముప్పుగా పరిణమించాయని శివమొగ్గ పాసిటివ్ మైండ్ ఆస్పత్రి వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.టి. అరవింద్ తెలిపారు. తుమకురు వి.వి. స్నాతకోత్సవం సందర్భంగా వర్సిటీ మనోవిజ్ఞాన విభాగం గురువారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ నేరాల రికార్డుల సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం దేశంలో యేడాదికి సుమారు 1.81 లక్షల మంది మానసిక వత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వీరిలో 70 శాతం మంది విద్యార్థులు ఉన్నారన్నారు.

ఆశ్రమంలోకి చొరబడ్డారని ఫిర్యాదు

దొడ్డబళ్లాపురం: రామనగర తాలూకా బిడదిలోని వివాదాస్పద స్వామీజీ నిత్యానందస్వామి ఆశ్రమంలోకి ముగ్గురు అక్రమంగా ప్రవేశించారు. వివరాలు.. వెంకటాచలపతి, సురేందర్, మరో వ్యక్తిపై భక్తుడు సోమా దయానంద పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిబ్రవరి 27న వెంకటాచలపతి సర్వేయర్ అని చెప్పుకుని మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి ఒక గోడను కూల్చివేశాడని చెప్పాడు. అడ్డుకున్న భక్తులను బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

మహిళ దారుణ హత్య

అపరిచిత మహిళ హత్యకు గురైన సంఘటన బెంగళూరు ఉత్తర తాలూకా వడ్డరహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ శివారులోని నరసింహమూర్తి అనే వ్యక్తికి చెందిన పొలంలో సుమారు 35 ఏళ్ల వయసు గల మహిళను మొహాన్ని రాయితో బాది హత్య చేశారు. స్థలాన్ని ఏఎస్పీ పురుషోత్తం , డీఎస్పీ పీ.జగదీష్ పరిశీలించి విచారణ చేపట్టారు.

మూగజీవాలపై కొడవళ్లతో దాడి

- మూడు ఎడ్లకు తీవ్ర గాయాలు

మైసూరు : జొన్న పంట తిన్నాయనే కారణంతో మూగజీవాలపై కొందరు కొడవళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి అమానుషంగా వ్యవహరించారు. ఈ ఘోరమైన ఉదంతం చామరాజనగర జిల్లా హనూరు తాలూకా ఒడయర పాళ్య సమీపంలోని టిబేటియన్ క్యాంప్ డీ విలేజ్‌లో చోటుచేసుకుంది. ఒడెయర పాళ్య సమీపంలోని హిరియంబల గ్రామానికి చెందిర రఘు, సిద్దప్ప, బసవరాజులు తమ ఎడ్లను మేత కోసం డీ విలేజ్ గ్రామం వద్దదకు తీసుకొచ్చారు. ఎడ్లు అక్కడి పొలంలోకి వెళ్లి జొన్న పంటను తిన్నాయి. నాలుగైదు మంది టిబెటియన్ వ్యక్తులు వచ్చి కొడవళ్లతో వచ్చి బీభత్సం సృష్టించారు. ఎడ్ల కాళ్లపై దాడి చేయగా మూడు ఎడ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కొన్ని ఎడ్ల తోకలను కట్ చేశారు. కళ్లదెటే మూగజీవాలు తీవ్ర గాయాలతో, రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతుండగా రైతులు నిస్సహాయ స్థితిలో కన్నీటి పర్యంతమయ్యారు. తాను ఇటీవల రూ.3 లక్షలతో కొనుగోలు చేసిన ఎడ్లను కూడా కాళ్లు నరికివేశారని భాగ్యమ్మ అనే మహిళ వాపోయింది.

అసంఘటిత కార్మికుల ధర్నా

కెలమంగలం: తమ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ అసంఘటిత కార్మిక సంఘం కార్యకర్తలు గురువారం డెంకణీకోట తాలూకాఫీసు ముందు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో తళి ఎమ్మెల్యే టి.రామచంద్రన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గ్రామాధికార్లు సభ్యత్వ నమోదు చేసి గుర్తింపు కార్డులు అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. 60 ఏళ్లు దాటిన అసంఘటిత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం రూ. 6 వేల పెన్షన్ అందజేయాలని తదితర కోరికలను ముందుంచి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మెట్రో ఘటనపై సుమోటో కేసు నమోదు

దొడ్డబళ్లాపురం: మాసిన దుస్తులు ధరించాడని చెబుతూ రైతును మెట్రో సిబ్బంది అడ్డగించిన ఘటనపై జాతీయ మానవహక్కుల సంఘం స్వయంప్రేరితంగా కేసు నమోదు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సీఎస్‌కు, బెంగళూరు మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ కి నోటీసులు ఇచ్చింది.నెల రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించింది.

పాఠశాలలో సైన్స్ డే

గౌరిబిదనూరు: విజ్ఞానాన్ని ప్రతి మనిషి చదివి అవగతం చేసుకోవాలని, ఆలోచనా విధానాలు విజ్ఞానయుతంగా ఉండాలని తీర్థ పాఠశాల అధ్యక్షుడు డా కెవి ప్రకాశ్ తెలిపారు. మునేశ్వర కాలనీలోని పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినాచరణను నిర్వహించారు. నోబెల్ ప్రశస్తి పొందిన భారతరత్న సర్ సి.వి రామన్ కనిపెట్టిన వెలుగు వికిరణాల ప్రక్రియను వివరించారు. రామన్ ఈ వ్యాసాలను 1928 ఫిబ్రవరి 28న ప్రచురించినందున ఈ రోజును జాతీయ విజ్ఞాన దినంగా ఆచరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు శోభ , భార్గవి,హేమలత,సంధ్య,చంద్రమ్మ పాల్గొన్నారు.

పీయూసీ పరీక్షలకు సర్వం సిద్ధం





తుమకూరు: బెంచీలపై నంబర్లు వేస్తున్న సిబ్బంది, తుమకూరులోని ఒక కేంద్రంలో సీసీకెమెరా

- పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

తుమకూరు : పీయూసీ ద్వితీయ సంవత్సరం పీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈనెల 1నుంచి 22వరకు పరీక్షలు జరగనున్నాయి. తుమకూరు జిల్లా వ్యాప్తంగా 26,235 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. తుమకురు విభాగంలో 25, మధుగిరి విభాగంలో పది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పీయూ శాఖ జాయింట్ డైరెక్టర్ గంగాధర్ తెలిపారు.

మైసూరు: మైసూరు జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మైసూరు అదనపు జిల్లా అధికారి పి.శివరాజు తెలిపారు. 31,628 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కేంద్రాల్లో మంచినీరు, వెలుతురు తదితర ఏర్పాట్లు కల్పించినట్లు ఆయన తెలిపారు.

హోసూరు వార్తలు..

ఉత్సాహంగా జల్లికట్టు



జల్లికట్టును ప్రారంభిస్తున్న మాజీ మంత్రి పి.బాలక్రిష్ణారెడ్డి

హోసూరు: హోసూరు తాలూకా పెద్దముత్తాళి గ్రామంలో గ్రామస్తులు గురువారం జల్లికట్టును ఉత్సాహంగా జరుపుకొన్నారు. అన్నాడీఎంకే పార్టీ క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జల్లికట్టు ఎద్దును పరుగెత్తించి ప్రారంభించారు. హోసూరు, సూళగిరి, బాగలూరు, బేరికె, రాయకోట, ఉద్దనపల్లి, కెలమగలం తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పశుపోషకులు తరలివచ్చారు. యువకులు ధైర్యంగా వృషభాలను నిలువరించారు.

బడ్జెట్ తయారీపై రచ్చ

- వివరాలు సరిగా లేవని ఆగ్రహం

హోసూరు: హోసూరు సిటీ కార్పొరేషన్ బడ్జెట్ జాబితాపై గురువారం సిటి కార్పొరేషన్‌లో సమావేశం జరిగింది. మేయర్ ఎస్.ఏ.సత్య, కమిషనర్ స్నేహ, కార్పొరేటర్లు పాల్గొన్నారు. గత 2023-2024 బడ్జెట్ వివరాలు, రాబోయే 2024-2025 బడ్జెట్‌లో నిధుల గురించి చర్చించారు. కార్పొరేషన్‌లో వసూలు చేస్తున్న పన్నుల డబ్బులు, ప్రైవేటు కంపెనీలు అందజేస్తున్న సేవా నిధులు, ప్రభుత్వం అందజేస్తున్న నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల గురించి చర్చించారు. బడ్జెట్ పనుల జాబితాపై అన్నాడీఎంకే కార్పొరేటర్ జే.పి. జయప్రకాష్, డీఎంకే కార్పొరేటర్ ఎస్.ఎస్‌మాదేశ్వరన్ మండిపడ్డారు. కార్పొరేషన్ అధికారులు కళ్లకు కనిపించని విధంగా జాబితాను తయారు చేశారని, ఇవి ఎవరికీ అర్థం కావని అన్నారు. కమిషనర్‌తో చర్చించవలసిన అవసరం తమకు లేదని, మేయర్ మాత్రమే బదులివ్వాలని డిమాండ్ చేశారు. పనులను వెల్లడించలేమని మేయర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ ఆనందయ్య, అధికార్లు పాల్గొన్నారు.

కామాంధుని అకృత్యం

- గర్భవతైన బాలిక

క్రిష్ణగిరి: బాలికపై అకృత్యానికి పాల్పడి 8 నెలల గర్భవతిని చేసిన భవన నిర్మాణ కార్మికున్ని ఊత్తంగేరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కాళిదాస్ (23). ఇతనికి పెళ్లయి భార్య, ఏడాదిన్నర పాప ఉంది. పాపను చూసేందుకు పక్కింటికి చెందిన 16 ఏళ్ల ప్లస్టూ చదివే బాలిక వచ్చేది. ఈ సమయంలో కాళిదాస్ ఆమె మీద అత్యాచారానికి పాల్పడేవాడు. ఎవరికైనా తెలిపితే హత్య చేస్తానని బెదరించాడు. బాలిక బుధవారం అనారోగ్యానికి గురికావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన డాక్టర్లు ఎనిమిది నెలల గర్భవతి అని చెప్పారు. దీంతో వారు ఊత్తంగేరి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని కాళిదాస్‌ను అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు.

ప్రతిభావంతులకు సత్కారం



విద్యార్థులను సన్మానించిన దృశ్యం

హోసూరు: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో హోసూరు పారిశ్రామికవాడ బ్యాడరపల్లిలో నిర్వహిస్తున్న మాధ్యమిక పాఠశాలలో చదువుతున్న 10 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఏటా 8వ తరగతి చదివే విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఉత్తీర్ణులైనవారికి ప్రతి నెలా రూ. 1000 చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఉపకార వేతనం లభిస్తుంది. విజేతలను హెచ్ఎం పాన్‌నాగేష్, విద్యాశాఖాధికారి మునిరాజ్, విద్యాకమిటీ అధ్యక్షుడు శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కాలువ రంధ్రం.. ఇక్కడ భద్రం



పెచ్చులు ఊడిపోయిన డ్రైనేజీ

క్రిష్ణగిరి: నాసిరకమైన మురుగునీటి కాల్వల పనులతో ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారింది. జిల్లాలోని పోచ్చంపల్లి సమీపంలోని కట్టగారం పంచాయతీ సందూరు, పట్టగంబట్టి గ్రామాల్లో మురుగుకాల్వలు లేక మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని ప్రజలు పదేపదే ఫిర్యాదులు చేయడంతో అధికారులు కాలువల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. కానీ నిర్మాణ పనులను నాసిరకంగా చేశారని, నిర్మించిన ఆరునెలలకే డ్రైనేజీల పైకప్పు మట్టి మాదిరిగా ఊడిపోతోందని స్థానికులు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతోనే నాణ్యత లోపంతో పనులు చేశారన్నారు. కాంట్రాక్టర్‌లపై చర్యలు చేపట్టి మళ్లీ నాణ్యతతో నిర్మాణ పనులు చేయాలని కోరారు. రంధ్రాలు పడిన కాలువలలో మనుషులు, లేదా పశువుల కాలుపెడితే ప్రమాదం జరగవచ్చని వాపోయారు.

ఎన్నికల తర్వాత పవన్ పరార్

- శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



కొయ్యలగూడెం: ఎన్నికల ఫలితాల అనంతరం పవన్‌కళ్యాణ్ రాష్ట్రాన్ని విడిచి పరార్ అవుతారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఎద్దేవా చేశారు. గురువారం గవరవరం ఎంపీటీసీ బిరుదుగట్ల రత్నకుమారి నివాసంలో పార్టీ శ్రేణులతో చర్చించారు. ఎన్నికల అనంతరం తెలుగుదేశం పార్టీ ఒకటే భూస్థాపితం అవుతుందని అనుకుంటుండగా.. దానికి బోనస్‌గా జనసేన పార్టీ కూడా తోడైందని అన్నారు. చంద్రబాబు వలలో పడిన పవన్‌కళ్యాణ్ జనసేన కేడర్‌ను పట్టించుకోకపోవడంతో వారిలో అసంతృప్తి ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయన్నారు. టీడీపీ జనసేన పొత్తు పుణ్యమా అని 145 పైగా అసెంబ్లీ స్థానాలు, 24 పార్లమెంట్ స్థానాలు వైఎస్సార్‌సీపీ వశం చేసుకుంటుందని తాజాగా జాతీయ మీడియా, నేషనల్ సర్వేలు తేల్చి చెప్పాయన్నారు. పోలవరం ఎమ్మెల్యేగా తెల్లం రాజ్యలక్ష్మి 50 వేలకుపైగా ఓట్లతో, ఎంపీగా కారుమూరు సునీల్‌కుమార్ యాదవ్ లక్ష ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తాయని అన్ని సర్వేలు పేర్కొంటున్నాయన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ ఓ ఉన్మాది

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి




నెల్లూరు (బారకాసు): 'జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఏం మాట్లాడుతున్నాడో అతనికే అర్థం కాని పరిస్థితి. నిన్నటి సభలో ఆయన మాట్లాడిన మాటలు వింటుంటే అతనికి ఉన్మాదంతో కూడిన పిచ్చిపట్టిందనేది అర్థమవుతోంది' అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి కాకాణి మాట్లాడారు. బుధవారం జరిగిన టీడీపీ, జనసేన ఉమ్మడి బహిరంగ సభకు ఆశించిన మేర ప్రజలు రాకపోవడంతో పవన్‌కళ్యాణ్ అసహనానికి గురై తన పరిధి దాటి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారన్నారు. 'నేను పిచ్చోడ్ని.. నన్ను నమ్మొద్దు.. నన్ను నమ్మి ఓట్లు వేయొద్దు' అని చెప్పేందుకే పవన్ సభకు వచ్చినట్లుందని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు వామనావతారం ఎత్తి పవన్‌ను తొక్కేస్తున్నారని, పవన్ కూడా ఆ అవతారం ఎత్తి నమ్ముకున్న నేతలు, కార్యకర్తలను తొక్కేస్తున్నారని మంత్రి దుయ్యబట్టారు.

పవన్ ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరింది

- చంద్రబాబు దగ్గర ఊడిగం చేస్తూ అథఃపాతాళంలో ఉన్నది పవనే
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా

సాక్షి, విశాఖపట్నం: ఓటమి భయంతో పవన్‌కళ్యాణ్ ఫ్రస్టేషన్ పీక్స్‌కు చేరిందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా ఎద్దేవా చేశారు. విశాఖ పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం మీడియాతో రోజా మాట్లాడుతూ.. పవన్ చంద్రబాబు దగ్గర ఊడిగం చేస్తూ జనసేన పార్టీ శ్రేణుల్ని పాతాళానికి నెట్టేస్తూ.. తాను కూడా అథఃపాతాళానికి వెళ్లిపోయారని విమర్శించారు. జగన్, పవన్ దాదాపు ఒకేసారి పార్టీ పెట్టారని, రెండు పార్టీల పరిస్థితిని ప్రజలు గమనించాలనీ.. పదేళ్ల పాటు పార్టీ పెట్టి 24 సీట్లు అడుక్కోవడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు. పార్టీని బలోపేతం చేయకుండా బూత్ కమిటీల విషయంలో తాను చేసిన తప్పును జనసేన కార్యకర్తలపై నెట్టేయడం సిగ్గుచేటన్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు తనను ప్రశ్నించవద్దని పవన్‌కళ్యాణ్ చెప్పడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని చెప్పారు. చంద్రబాబు మాటల్లోనే సిద్ధం సభలు విజయవంతం అయినట్టు చెప్పారని స్పష్టం చేశారు. పవన్‌కళ్యాణ్ ఆవేశంతో ఊగి మాట్లాడాలని అనుకుంటే పొరపాటనీ.. గట్టిగా అరిస్తే పదవులు వస్తాయనుకుంటే.. ఇలా అరిచినవాళ్లంతా ఎప్పుడో ప్రధాన మంత్రి అయ్యేవారని వ్యాఖ్యానించారు. ముష్టి ముప్పై సీట్లు చంద్రబాబు నుంచి తీసుకోలేని దుస్థితిలో ఉన్న పవన్‌కు వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హతే లేదని రోజా స్పష్టం చేశారు.



రాయలసీమ రూపు మార్చిన
మెరుగైన పాలన
కుప్పానికి పరుగు పరుగున
వచ్చిన కృష్ణమ్మ
మెడికల్ కాలేజీల నుంచి
మెగా ఇండస్ట్రియల్ పార్క్ ల దాకా ..
అభివృద్ధి, సంక్షేమం
రెండు కళ్లుగా సుపరిపాలన
సీమ సిగలో సంక్షేమం
అనంతపురంలో ప్రజాప్రస్థానం
ఈరోజు రాత్రి 7గంటలకు మీ సాక్షి టీవీలో



కాపు కాయలేం

జనసేనకు దూరమవుతున్న అభిమానులు

బలం లేదు కాబట్టే 24 సీట్లకు ఒప్పుకున్నామనడంపై ఆగ్రహం.. కాపుల్లో వ్యతిరేకత.. అంతర్మథనం

ఇన్నాళ్లూ ఓ అసమర్థుడి వెంట నడిచామన్న చేదు నిజాన్ని ఆలస్యంగా తెలుసుకున్నందుకు సిగ్గు పడుతున్నాం. కాపులకు రాజ్యాధికారం అనే ఆశ మళ్లీ చిగురిస్తోందని సంబర పడుతున్న వేళ ఏమిటీ ప్రేలాపనలు? ఇదేం స్ట్రాటజీ? ఇవేం ఎత్తుగడలు? కనీస రాజకీయ పరిజ్ఞానం ఉన్న వారెవరైనా ఒక బహిరంగ సభలో ఇలా మాట్లాడతారా? ప్యాకేజీ స్టార్ అని వైసీపీ వాళ్లు అంటున్న మాట నిజమేనని ఆయన నోటే చెప్పకనే చెప్పారు. మా ఆశలను కూకటివేళ్లతో సహా పెకిలించేశారు.

- సోషల్ మీడియాలో జనసేన అభిమానులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జాతిని ఉద్ధరిస్తారని పవన్ కళ్యాణ్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ సామాజికవర్గం ఉడికిపోతోంది. ఆ వర్గాలు ఇక పవన్ కోసం కాపు కాయలేమంటున్నాయి. పవన్ తీసుకుంటున్న నిర్ణయాలు, చంద్రబాబుతో చేసుకున్న రాజకీయ ఒప్పందం మేరకు లభించిన సీట్లతో ఆ సామాజిక వర్గం విసుగెత్తిపోయింది. ఇక ముందు పవన్‌ను నమ్మి రాజకీయాలు చేయలేమని ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీరుపై ఆయన అభిమానులు, కాపు సామాజికవర్గం వారు బహిరంగంగానే దుమ్మెత్తి పోస్తున్నారు. టీజే (తెలుగుదేశం–జనసేన) ఉమ్మడి సభలో పవన్ దిగజారుడుతనం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్ రాజకీయాల్లో చక్రం తిప్పాలంటే ఒక రాజకీయ పార్టీగా ఏం చేయాలో, ఏం చేయకూడదో సామాజికవర్గంలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వృద్ధతరం మేధావులు సోదాహరణంగా వివరిస్తున్నా పవన్ పెడచెవిన పెట్టడం వారికి ఆవేదన కలిగించింది. పైగా ఆ పెద్దల మాటలు చెవికెక్కించుకోకపోవడం అటుంచి, అటువంటి వారు తనకు సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన అవసరమే లేదని తెగేసి చెప్పడాన్ని కాపు సామాజిక వర్గంతో పాటు పవన్ అభిమానులు సైతం ఒక పట్టాన జీర్ణించుకోలేకపోతున్నారు. రాజకీయ యవనికలో కుట్రలకు కేరాఫ్‌గా నిలిచే చంద్రబాబుతో సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు ప్రస్తావన వచ్చిన ప్రారంభంలోనే జనసేన నేతలు, పవన్ అభిమానుల్లో పెదవి విరుపు మొదలైంది. ఇందుకు చంద్రబాబుతో పవన్‌కు ఎదురైన అనుభవాలను వారందరూ ప్రస్తావిస్తున్నారు.

కనీసం 50 సీట్లు తీసుకుని ఉండాల్సింది



పొత్తులో భాగంగా జనసేన కేవలం 24 సీట్లకు పరిమితం కావడం నాలాంటి కాపు నాయకులకు ఇబ్బందిగా ఉంది. పవన్ జనసేన పార్టీ అధ్యక్షుడు. ప్రస్తుత పరిస్థితుల్లో స్థాయికి తగినట్టుగా కనీసం 50 సీట్లు తీసుకుని ఉండుంటే మాకు సంతృప్తిగా ఉండేది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలసి ప్రయాణిస్తున్న క్రమంలో సీఎం పదవిలో కూడా షేరింగ్ ఉండుంటే మేమందరం ఆనందించే వాళ్లం. కాపు నేతలు ముద్రగడ పద్మనాభం, చేగొండి హరిరామజోగయ్య ఆవేదన కూడా ఇదే.

– కల్వకొలను తాతాజీ, కాపు జేఏసీ నేత, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అయినప్పటికీ లెక్క పెట్టకుండా చంద్రబాబుతో పవన్ చేతులు కలిపారు.

వారందరిదీ అదే ఆవేదన

గౌరవప్రదమైన స్థాయిలో సీట్లు తీసుకునే అవకాశం పుష్కలంగా ఉన్నా కూడా, కాదని కాలదన్నుకోవడం పట్ల జనసేన శ్రేణులు, అభిమానుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సంఖ్యా బలానికి తగిన రీతిలో గౌరవప్రదమైన స్థానాలు దక్కలేదనే ఆవేదన ఆ సామాజికవర్గం అంతటా నెలకొంది. గోదావరి జిల్లాల్లో అపార రాజకీయ అనుభవం కలిగిన చేగొండి హరిరామజోగయ్య మొదటి నుంచీ ముఖ్యమంత్రి పదవితో పవర్ షేరింగ్, కనీసం 50 అసెంబ్లీ స్థానాలు సాధించుకోవాలని పలుమార్లు లేఖల ద్వారా చెబుతూనే ఉన్నారు. అలాగైతేనే జనసేన శ్రేణుల నుంచి ఓట్ షేరింగ్ ఉంటుందని, లేదంటే పొత్తు ధర్మం చిత్తు అవుతుందని అనేక సందర్భాల్లో కుండబద్దలు కొట్టారు. తాజాగా కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కూడా గురువారం బహిరంగ లేఖ ద్వారా అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. కాపులకు బీసీ రిజర్వేషన్ల కోసం అలుపెరగని పోరాటాలు చేసిన ముద్రగడ.. తాజా రాజకీయ పరిణామాలపై తొలిసారి పవన్‌ను ఉద్దేశించి ఈ లేఖ రాశారు. కాపు ఉద్యమం సందర్భంగా నాడు అధికారంలో ఉన్న చంద్రబాబు కాపుల పైన, తన కుటుంబం పైన జరిపిన దాష్టీకాలను సైతం దిగమింగుకుని పవన్‌కు మద్దతుగా నిలవాలని భావించానని చెప్పారు. అంతేకాకుండా ఆయనతో కలసి పని చేసి రాష్ట్రంలో కొత్త రాజకీయ ఒరవడి సృష్టించాలని కలలుగన్న విషయాన్నీ తన లేఖలో ప్రస్తావించారు. పవన్ అభిమానులు ఆయనను ఉన్నత స్థానంలో ఉండాలని కోరుకుంటే ఆయన మాత్రం 24 సీట్లకు మాత్రమే అంగీకరించడంపై ముద్రగడ విస్మయం వ్యక్తంచేశారు. పవర్ షేరింగ్ కోసం ప్రయత్నం, ముందుగా రెండేళ్ల సీఎం, 80 అసెంబ్లీ సీట్లు కోరాల్సిందని ముద్రగడ తన మనసులో మాట బయటపెట్టారు.

బాబు మాటే పవన్‌కు శాసనం

పవన్ తీరుతో మరో చారిత్రక తప్పిదం జరిగిపోయిందని కాపులు అంతర్మథనం చెందుతున్నారు. స్కిల్ స్కామ్‌లో అరెస్టయ్యి చంద్రబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉన్నప్పుడు జైలుకు వెళ్లి భరోసా ఇవ్వడం ద్వారా బాబు పరపతి పెరగడానికి పరోక్షంగా పవనే కారకులయ్యారు. కానీ ఆ స్థాయిలో సీట్లు తీసుకు రాలేకపోవడంతో పవన్‌పై పెట్టుకున్న ఆశలన్నీ అడియాసలై ఆ సామాజికవర్గంలో అంతర్మథనం మొదలైంది. సీట్లు, ఓట్లు బదిలీ, పవర్ షేరింగ్ కోసం అడుగుతున్న వారిపై పవన్ మాటలతో ఎదురుదాడికి దిగుతున్న పరిస్థితుల్లో ఓటు షేరింగ్ ఎందుకు చేయాలని వారు ప్రశ్నిస్తున్నారు. 'గత ఎన్నికల్లో రెండు చోట్లా ఓడించారు. ఎలక్షన్ అంటే డబ్బుతో కూడుకున్న పని. అంత సత్తా మనకు ఉందా? కనీసం మనం భోజనాలు పెట్టించలేం..' అని ప్రశ్నిస్తూ.. పవన్ తనకు తానుగానే పార్టీ శ్రేణులు, అభిమానుల్లో నిస్సత్తువ ఆవరించే పరిస్థితికి కారకులయ్యారని విశ్లేషిస్తున్నారు. అభిమానులు, ఆ సామాజికవర్గం మునుపటి మాదిరిగా ఉత్సాహంగా తాడేపల్లిగూడెం సభకు వెళ్లిన దాఖలాలు లేకపోవడానికి పవన్ నిర్ణయాలే కారణమని కాపు సామాజికవర్గ నేతలు అంటున్నారు. చంద్రబాబు మాటే పవన్‌కు శాసనమైందని వాపోతున్నారు.

పవన్ నిర్ణయం సరికాదు



పవన్ కాపు జాతిని నిరాశ పరిచారు. ఎన్నో ఏళ్లుగా కాపులు సీఎం అవ్వాలని కోరుకుంటున్నాం. పవన్ ద్వారా సాధ్యమవుతుందని కలలు కన్నాం. టీడీపీతో జనసేన పొత్తు పెట్టుకుని కేవలం 24 సీట్లలో పోటీకి సిద్ధమయ్యారు. ఇలా గైతే ఏ విధంగా సీఎం అవుతారు? చంద్రబాబుకు వత్తాసు పలకడానికే పవన్ ఉన్నట్టుంది. పవన్ నిర్ణయం సరికాదు.

– కురుమళ్ల చిన్ని, కాపు నాయకుడు, కిర్లంపూడి, కాకినాడ జిల్లా

50–60 సీట్లు తీసుకోవాల్సింది



రాష్ట్ర జనాభాలో 22 శాతం కాపులు ఉన్నారు. కాపు వర్గం వారు ఏ రోజైనా సీఎం అవుతారని ఊహించాం. టీడీపీతో పొత్తులో భాగంగా 50–60 సీట్లు వరకు తీసుకుంటారని ఆశించాం. కానీ 24 సీట్లకే పరిమితమవడం నిరుత్సాహానికి గురిచేసింది.

– గుండాబత్తుల శ్రీను గోవిందరావు, మామిడికుదురు మండల కాపు నాడు అధ్యక్షుడు, కోనసీమ జిల్లా

పవన్‌కు సీఎం పదవి ప్రకటిస్తారని ఆశించాం



కోస్తా జిల్లాల్లో ప్రాధాన్యత క్రమంలో అత్యధిక సంఖ్యలో కాపులు ఉన్నారు. పవన్ ద్వారా సీఎం పదవి వస్తుందని ఆశించాం. టీడీపీతో పొత్తు పేరిట 24 సీట్లకే పరిమితమయ్యారు. పొత్తులో భాగంగా పవన్‌కు సీఎం పదవిని ఏడాదో, రెండేళ్లో ప్రకటిస్తారనుకున్నాం. ఆయన ఎందుకు తగ్గి చంద్రబాబుకు మద్దతుగా నిలుస్తున్నారో అర్థం కావడం లేదు.

– వెలుగుబండి సుబ్బారావు, కాపు నాయకుడు, వాకలపూడి, కాకినాడ జిల్లా

బాబుకు తొత్తుగా పవన్

- ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

భీమవరం: చంద్రబాబుకు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ విమర్శించారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలంలోని కొత్త పూసలమర్రు, పాత పూసలమర్రు గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గురువారం గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. భీమవరంలోని గ్రంధి శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల వయసున్న చంద్రబాబును పక్కన పెట్టుకుని పార్టీలోకి యువరక్తం రావాలని పవన్‌కళ్యాణ్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జనసేనకు బలం లేదని పవన్ చెప్పడం ద్వారా ఆయన పదేళ్లలో పార్టీని నిర్మాణం చేసుకోలేకపోయిన అసమర్థుడని తేటతెల్లమైందన్నారు. భీమవరం నియోజకవర్గంలో జనసేనకు చెందిన యువత పవన్‌కళ్యాణ్ చేతగానితనాన్ని గ్రహించి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని గ్రంధి శ్రీనివాస్ తెలిపారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గ్రంధి

పవన్ బొమ్మ పెట్టినా కాపుల ఓట్లు రావు

ప్రజారాజ్యంలా జనసేననూ నిర్వీర్యం చేసే ప్రయత్నం

- నాదెండ్లను అడ్డుపెట్టుకుని జనసేనను దెబ్బతీస్తారన్న అనుమానాలున్నాయి
- 24 సీట్ల కోసం యుద్ధం చేయాల్సిన అవసరం మాకేంటి?
- చంద్రబాబుకు కాపు ఐక్య వేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: మంగళగిరి టీడీపీ కార్యాలయం మీద పవన్ బొమ్మ పెట్టినా, పత్రికల్లో ప్రకటనలు (యాడ్స్)లో పవన్ ఫొటో వాడినా టీడీపీకి కాపు ఓట్లు రావని చంద్రబాబుకు కాపు ఐక్య వేదిక కరాఖండిగా చెప్పింది. జనసేనకు జనబలం, ధనబలం లేదని పవన్‌తో ఎంత బలంగా చెప్పించినా నమ్మేందుకు జనం అంత అమాయకులు కాదని ఎద్దేవా చేసింది. నాదెండ్ల మనోహర్‌ను అడ్డుపెట్టుకుని ప్రజారాజ్యం మాదిరిగా జనసేనను నిర్వీర్యం చేసి దెబ్బతీస్తారనే అనుమానం బలపడుతోందని తెలిపింది. ఈ మేరకు చంద్రబాబుకు రాసిన బహిరంగ లేఖను కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్, కన్వీనర్లు పెద్దిరెడ్డి మహేష్, బోడపాటి పెదబాబు గురువారం మీడియాకు విడుదల చేశారు. ఆ లేఖ సారాంశమిదీ..

'కాపు సామాజికవర్గానికి చంద్రబాబుకు ఉన్నంత చాణక్య తెలివితేటలు లేకపోవచ్చుగానీ, చైతన్యం మెండుగా ఉంది. చంద్రబాబు తీరుతో టీడీపీ, జనసేన కూటమి విజయావకాశాలను చేజేతులారా పాడుచేసుకున్నారు. జనసేన అండ లేకుండా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఒంటరిగా పోరాటం చేయలేదు. కేవలం 24 ఎమ్మెల్యే, మూడు ఎంపీ సీట్లు ఇచ్చి పవన్‌తో యుద్ధం చేయించి కాపు సామాజికవర్గాన్ని అడ్డు పెట్టుకుని ఈ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం ఫలించదు. 2014లోనే జనసేనకు కనీసం 24 సీట్లు ఇచ్చినా పవన్‌కు ప్యాకేజీ స్టార్ అనే అప్రతిష్ట వచ్చేది కాదు. ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు అనే మాటలను బాబు ఇప్పటివరకు ఖండించలేదు. 2014లో చతికిలపడిపోయిన టీడీపీని జనసేన, బీజేపీ నిలబెట్టాయి. బాబు సహజగుణానికి తగ్గట్టుగానే 2019 ఎన్నికల్లో బీజేపీ, జనసేనను వదిలేసి ఫలితాన్ని చవిచూశారు. ఇప్పుడు చంద్రబాబు డైరెక్షన్‌లో మాట్లాడుతున్న పవన్ రెండు చోట్లా తనను ఓడించారని పదే పదే ప్రజలను నిందించడం సరికాదు. పవన్ ఓటమిలో టీడీపీ పాత్ర, వ్యక్తిగత వైఫల్యం ఏమిటో ప్రజలకు తెలుసు.'

2019లో మీ స్నేహాన్ని ఎవరు చెడగొట్టారు?

'బుధవారంనాటి జెండా సభలో పవన్ మాట్లాడుతూ స్నేహమంటే చివరి వరకు అని స్వయంగా ప్రకటించారు. మరి 2019లో మీ ఇరువురి స్నేహాన్ని ఎవరు చెడగొట్టారు చంద్రబాబూ? ఆ రోజు మీ డైరెక్షన్ మేరకే విడిగా పోటీ చేశారా? పవన్ ఓటమిలో మీ పాత్ర లేదా? ఆనాడు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవాలని మీరు చేసిన ప్రయత్నం ఫలించిందా? ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారు. నాలుగున్నరేళ్లపాటు ఎన్డీఏ ప్రభుత్వంలో అధికారాన్ని పంచుకుని, సడెన్‌గా యూటర్న్ తీసుకుని ప్రజాధనంతో కేంద్రంపై ఉద్యమాలు చేయించారు. ప్రధాని మోదీని తిట్టారు, తిట్టించారు. ఇపుడు బీజేపీతో పొత్తు కోసం పరితపిస్తున్నారు. రాజమండ్రి జైలుకు వచ్చి పవన్ మీకు మద్దతు ఇవ్వకపోతే మీ పరిస్థితి ఏమిటనేది ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు వాడుకుని పవన్‌ను మడత పెట్టేస్తే.. ఆయన అభిమానులు, కాపులు కలిసి మిమ్మల్ని మడత పెట్టేస్తారని గమనించండి.'

త్యాగాలు ఇతరులే చేయాలా? మీరు చేయరా?

'24 ఎమ్మెల్యే సీట్ల కోసం యుద్ధం చేయాల్సిన అవసరం మాకేంటి? 151 సీట్ల కోసం టీడీపీ వాళ్లే యుద్ధం చేసుకుంటార్లే అనే పరిస్థితి ఇప్పటికే వచ్చేసింది. పవన్‌ను లోక్‌సభకు పోటీ చేయించి ఢిల్లీ పంపేస్తారని, బాబుకు ఇబ్బంది లేకుండా చేసుకుంటారంటూ ప్రజల్లో చర్చ జరుగుతోంది. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను కలవడానికి పవన్ ఇష్టపడినప్పటికీ ఆయన్ని అడ్డుకున్నది చంద్రబాబే అని ప్రజల్లో బలమైన అభిప్రాయం ఉంది. నాదెండ్ల మనోహర్‌ను అడ్డుపెట్టుకుని ప్రజారాజ్యం మాదిరిగా జనసేనను నిర్వీర్యం చేసి దెబ్బతీస్తారనే అనుమానం బలపడుతోంది. ఇలా నమ్మించి మోసం చేయడాన్ని కాపులు ఏమాత్రం జీర్ణించుకోరన్న నగ్న సత్యాన్ని గత అనుభవాల దృష్ట్యా మీరు గ్రహించాల్సి ఉంది. త్యాగాలు చేయాలని తమరు ఇతరులకు చెప్పడమేనా? మీరు త్యాగాలు చేయరా? పవన్‌ను మోసం చేయడం ద్వారా మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటున్నారనే నగ్న సత్యాన్ని గ్రహించాలి' అని ఆ లేఖలో కాపు ఐక్య వేదిక నేతలు చంద్రబాబుకు స్పష్టం చేశారు.

24 సీట్లకు నేనెందుకు?

- పవన్‌కు ముద్రగడ లేఖ
- 80 సీట్లు, రెండేళ్ల సీఎం పదవి అడిగే సాహసం చేయలేరా?



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్ణయాలు ఆయన చేతుల్లో ఉండవని, ఎన్నోచోట్ల పర్మిషన్లు తీసుకోవాల్సి ఉంటుందని మాజీ మంత్రి, కాపు నేత ముద్రగడ పద్మనాభం పేర్కొన్నారు. జనసేన పోటీ చేసే 24 సీట్ల కోసం తన అవసరం రాకూడదని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఈ మేరకు పవన్‌కు రాసిన లేఖను గురువారం కాకినాడ జిల్లా కిర్లంపూడిలోని తన నివాసంలో ముద్రగడ మీడియాకు విడుదల చేశారు.

- కాపు జాతి కోరిక మేరకు నా గతం, బాధలు, అవమానాలు, ఆశయాలు, కోరికలు అన్నీ మరచిపోయి మీతో కలసి ప్రయాణం చేయడానికి సిద్ధపడితే నా వద్దకు వస్తానని మాటిచ్చి రాలేకపోయారు. మీరు పవర్ షేరింగ్ కోసం ప్రయత్నం చేసి 80 అసెంబ్లీ సీట్లు, ముందుగా రెండేళ్లు సీఎంగా చేయమని కోరి ఉండాల్సింది. ఆ సాహసం మీరు చేయలేకపోవడం బాధాకరం. మీరు తీసుకున్న 24 సీట్ల కోసం నా అవసరం రాదు, రాకూడదని కోరుకుంటున్నా.
- చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు టీడీపీ క్యాడర్ మొత్తం బయటకు రావడానికి భయపడి ఇళ్లకే పరిమితమైతే మీరు జైలుకు వెళ్లి వారికి భరోసా ఇవ్వడం సామాన్య విషయం కాదు. చరిత్ర తిరగరాసినట్లైంది.
- నేను 40 ఏళ్ల రాజకీయ జీవితంలో డబ్బు కోరుకోలేదు. పదవుల కోసం పెద్ద నాయకుల గుమ్మాల వద్ద పడిగాపులు కాయలేదు. మీలా గ్లామర్ ఉన్న వాడిని కాకపోవడంతో మీ దృష్టిలో నేను లాస్ట్ గ్రేడ్ వ్యక్తిగా, తుప్పుపట్టిన ఇనుములా మిగిలిపోయా. అందువల్లే నావద్దకు వస్తానని మాటిచ్చి కూడా మీరు రాలేదని భావిస్తున్నా.

పవర్ షేరింగ్ ప్రస్తావనేది?

- జనసేన, టీడీపీ జెండా సభ అట్టర్‌ఫ్లాప్
- సీఎం జగన్‌ను దూషించేందుకే ఆ సభ
- స్కిల్ కేసులో చంద్రబాబు జైలులో ఉంటే బాధ కలిగిందని పవన్ అంటున్నారు
- రంగాను చంపినప్పుడు, ముద్రగడను అవమానించినప్పుడు బాధ కలగలేదా?
- మంత్రి అంబటి రాంబాబు



ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం): 'టీడీపీ, జనసేన కలిసి తాడేపల్లిగూడెంలో పెట్టిన సభ అట్టర్ ఫ్లాప్. సభ ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇచ్చారు? పవర్ షేరింగ్ (అధికారం పంచుకోవడం) గురించి మాట్లాడుతారేమోనని జనసేన శ్రేణులు ఎదురుచూశాయి. కానీ, పవన్ ఆ ప్రస్తావనే లేవనెత్తలేదు. కేవలం సీఎం వైఎస్ జగన్‌ను దూషించేందుకే సభ పెట్టారు'.. అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. పవన్ అంటే తనకు గౌరవం ఉందని, కానీ రాజకీయాలకు పనికొచ్చే మనిషి కాదన్నారు. రాజమహేంద్రవరంలో గురువారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. పవన్ దేనికోసం ఆశ పడుతున్నారో అర్థంకావడంలేదని.. పిచ్చిపిచ్చి డైలాగులు కొడుతున్నారని, ప్రశ్నించడం కోసమే పార్టీ పెట్టానన్న పవన్ ఇప్పుడు తనను ప్రశ్నించొద్దంటున్నారని ఎద్దేవా చేశారు. స్కిల్ స్కాంలో చంద్రబాబును జైల్లో పెడితే బాధేసిందంటూ పవన్ విలపించారని.. వంగవీటి రంగాను హత్య చేసినప్పుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని టీడీపీ ప్రభుత్వం వేధించినప్పుడు బాధ కలగలేదా అని అంబటి ప్రశ్నించారు. సీఎం జగన్‌ను పాతాళానికి తొక్కకపోతే తన పేరు పవన్‌కళ్యాణే కాదంటున్నారని, ఆయనకు ఆ శక్తి ఉందా అని అన్నారు. బీజేపీ, సీపీఐ, సీపీఎంలతో స్నేహం ఏమైందని.. చంద్రబాబు, లోకేశ్‌తో శతృత్వం అన్నావు, ఆ మాటలకు నిలకడలేదా అని మండిపడ్డారు.

పవన్ ఆటలో అరటిపండు..

ఇక పవన్‌కు మూడు పెళ్లిళ్లు జరిగిన మాట వాస్తవం కాదా? అని అంబటి ప్రశ్నించారు. పవన్ నాలుగో పెళ్లాం నాదెండ్ల మనోహర్ అని, రాజకీయంగా టీడీపీ అధినేత చంద్రబాబుకు సీఎం వైఎస్ జగన్ మొగుడని వ్యాఖ్యానించారు. బాబు, పవన్‌ల కలయికపై కాపు సోదరులు, జనసేన కార్యకర్తలు పునరాలోచించుకోవాలని మంత్రి హితవు పలికారు. ప్రస్తుత రాజకీయాల్లో పవన్ ఆటలో అరటి పండని సంబోధించారు. కొన్నాళ్లకు పవన్‌తో పొత్తు పెట్టుకున్నందుకు చంద్రబాబే తలపట్టుకునే పరిస్థితి ఎదురవుతుందని.. జనసేన + టీడీపీ = జీరో అని అంబటి అభివర్ణించారు. మరోవైపు.. జనసేన, టీడీపీ సీట్ల ఒప్పందం కుదిరిన తర్వాత జరిగిన మొదటి ఉమ్మడి సభకు సా.6 గంటలైనా జనం రాలేదన్నారు. అధికారం తనకు తప్ప మిగిలిన వారికి షేర్ చేయనన్న సత్యాన్ని చంద్రబాబు తన బాడీ లాంగ్వేజ్‌లోనే చూపించారన్నారు. అధ్వానంగా ఉన్న పార్టీకి 24 సీట్లు ఇవ్వటమే గొప్ప అని పవన్ అంటున్నారని, ఆయన ప్రసంగిస్తున్నప్పుడే జనం వెళ్లిపోతుంటే ఓట్లు ఎవరు వేస్తారని అంబటి ప్రశ్నించారు.

రెండు జెండాలు మడత ఖాయం

- కాపులు ఆత్మాభిమానాన్ని చంపుకుని టీడీపీ జెండా మోయాలా?: పేర్ని నాని
- శల్యుడు, శిఖండి కలగలిస్తే పవన్ కళ్యాణ్
- సొంత క్యాడర్‌ను కించపరిచిన ఏకైక నేత పవనే

సాక్షి, అమరావతి: తమ పంపకాలపై సంజాయిషీ కోసమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తాడేపల్లిగూడెంలో జెండా పేరుతో సభ నిర్వహించారని మాజీ మంత్రి పేర్ని నాని(వెంకట్రామయ్య) విమర్శించారు. ఆ సభ సాక్షిగా రెండు పార్టీల జెండాలను ఎన్నికల్లో ప్రజలు మడతబెట్టడం ఖాయమన్నారు. సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ప్రతి ఎన్నికల్లోనూ వారిద్దరూ ఆడుతున్న డ్రామాలను ప్రజలు ముఖ్యంగా కాపు సామాజిక వర్గం గమనిస్తోందని చెప్పారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పేర్ని నాని మీడియాతో మాట్లాడారు.

జగన్ దగ్గర బేరాలు, బ్లాక్‌మెయిలింగ్ కుదరవ్..

జెండాల సభలో కేవలం జగన్ నామ స్మరణ మినహా ఏమైనా ఉందా? ప్రజలకు మేలు చేసేందుకు కాకుండా సీఎం జగన్, ఆయనతో ఉండే వారిపై దాడులు చేయడానికే వారిద్దరికీ అధికారం కావాలట. గతంలో ఐదేళ్లు అధికారం ఇస్తే చేసిన మేలు ఒక్కటంటే ఒక్కటీ చెప్పలేకపోయారు. కాపుల ఆత్మగౌరవాన్ని పెంచే ఒక్క మాటన్నా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెప్పారా? కాపులు ఆత్మాభిమానాన్ని చంపుకుని టీడీపీ జెండాను మోయాలని చెబుతున్నారు. జగన్ గురించి తనకు టన్నుల కొద్దీ తెలుసంటూ బ్లాక్ మెయిల్ ఎందుకు? పవన్ నిఖార్సైన మగాడైతే కనీసం కేజీ సమాచారమైనా బయట పెట్టాలి. జగన్ దగ్గర బ్లాక్ మెయిలింగ్ కుదరదు. ఆయన దగ్గర బేరాలుండవ్. నీకు చేతనైంది చేసుకో పవన్.

శల్యుడు, శిఖండి కలగలిస్తే పవన్

చంద్రబాబు వద్ద 24 సీట్లు దానం పొందిన నువ్వే వామనుడివి పవన్. నీకు సీట్లు దానం చేసిన చంద్రబాబునే పాతాళానికి తొక్కేయాలి. దాంతో రాష్ట్రంలో పేదరికం పోతుంది. శల్యుడు, శిఖండి కలగలిస్తే పవన్. మావాడు ముఖ్యమంత్రి కావాలని ఆశపడ్డ కాపులకు నువ్వు శల్యుడివే. జనసేనకు బలం లేదని, మీరు గెలిపించలేరంటూ పార్టీకి నువ్వే శల్య సారథ్యం వహిస్తున్నావ్. రాక్షస గణ నాయకుడైన చంద్రబాబు లాంటి దుర్మార్గుడికి, డబ్బు నామ స్మరణ చేస్తున్న లోకేశ్‌కు కొమ్ము కాస్తున్న శిఖండివి నువ్వే పవన్! చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వైఎస్ వివేకా హత్యకు గురయ్యారు. ఆ కేసులో నిందితులు దోషులు చంద్రబాబుతో తిరుగుతూ టీడీపీ జెండా మోస్తున్నారు.

2019లోనే నిన్ను తొంగోబెట్టారు..

జగన్‌కు యుద్ధాన్ని ఇస్తానంటావా పవన్? 2014, 2019 ఎన్నికల్లో ఏం చేశావ్? నీ దగ్గర సరుకు, మందుగుండు సామాగ్రి లేదా? జగనే నీకు పెద్ద సినిమా చూపించి మడిచి తొంగోబెట్టాడు. గతంలో అమరావతిని కుల రాజధాని అని విమర్శించింది నువ్వే కదా? పేద, మధ్య తరగతి వర్గాలకు అక్కడ చోటే లేదని అనలేదా? మరి ఇప్పుడు ఏమైంది? చంద్రబాబుతో ఎలాంటి లాలూచీ జరిగింది? ఎవరైనా నిన్ను ప్రశ్నిస్తే బయటకు వెళ్లిపోవాలంటావా? నువ్వు 24 కాకపోతే నాలుగు సీట్లే తీసుకో! లేదా రెండే తీసుకో! 2014లో నువ్వు తీసుకున్నది సున్నానే కదా? నువ్వు సీట్లు తీసుకోకపోతే ఎవరికి బాధ? నీ పార్టీ నాయకులు రామచంద్రరావు, దుర్గేష్, జగ్గంపేట సూర్యచంద్రకే బాధ. నువ్వు సీఎం కావాలని కోరుకున్న హరిరామజోగయ్యకు బాధ. అయోధ్య, కాశీ వెళ్లి వచ్చాక ముద్రగడ ఇంటికి వస్తావని చెప్పినవారికి బాధ.

సినిమా డైలాగులు కట్టిపెట్టు..

తనతో స్నేహమైనా, శతృత్వమైనా అవతలివారు చచ్చేదాకా అని పవన్ సినిమా డైలాగులు చెబుతున్నారు. ఆయన యువరాజ్యం అధ్యక్షుడిగా ఉన్నప్పుడు చంద్రబాబును ఎన్ని తిట్లు తిట్టారో గుర్తు లేదా? ఎన్టీఆర్ నుంచి పార్టీని, గుర్తును దొంగతనం చేశాడని అనలేదా? మరి చంద్రబాబుతో శతృత్వం చచ్చేదాకా ఉందా? మనం గెలవలేమంటూ జెండా మోసే కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని కించపరిచే ఏకైక నాయకుడు ప్రపంచంలో పవన్ కళ్యాణ్ మాత్రమే. ఆయన్ను నమ్ముకుని రాజకీయాల్లోకి దిగితే కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్లే. నువ్వు 24 సీట్లు కూడా తీసుకోవద్దు. ఏమీ తీసుకోకుండా చంద్రబాబుకు ఊడిగం చెయ్.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శుక్రవారం ॥ 1-3-2024





ఫ్యాషన్

చూపులను పట్టేస్తున్నాయి...



అందమైన పాదాలను అంటిపెట్టుకునే అందియలు అమ్మాయిలకు అత్యంత ఇష్టం అందుకే, పట్టీలు వారి అలంకరణలో ఎప్పుడూ ప్రత్యేకతను నింపుకుంటాయి. ఈ ఆధునిక యుగంలో అమ్మాయిలు పట్టీలు పెట్టుకోవడం లేదు అనే నిన్నటి తరం నిరాశను దూరం చేస్తూ అంకిల్స్ పేరుతో వచ్చి కొత్తగా చేరిపోయాయి. వాటితో పాటు బంగారు, వెండి, డైమండ్ ఆభరణాలలోనూ, ఇమిటేషన్ జ్యువెలరీలోనూ సగం పాదాన్ని కప్పేస్తున్నట్టుగా ఉండే పట్టీల డిజైన్లు ఎన్నో వచ్చాయి. సందర్భానికి తగినట్టు అలంకరించుకోవడానికి వేటికవి ప్రత్యేకతను కలిగి ఉంటున్నాయి. కాలికి ధరించేవే అయినా కళ్లనూ పట్టేస్తున్నాయి.

మొఘలాయ్ రాణివాసపు హంగు కాలి అందియలలోనూ కనిపిస్తుంది. పెళ్లి పల్లకీ, రాజు రాణీ, నెమళ్లు, పువ్వుల డిజైన్లతో ఆకట్టుకుంటున్న పట్టీలు నేటితరం అమ్మాయిలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

పూసలు, రత్నాలు

వరసలుగా అల్లుకుపోయిన పూసలు కాలి పట్టీలుగా అమరి ఆధునికతనూ, సంప్రదాయతకు మేళవింపుగా ఉన్నాయి. పెద్ద పెద్ద రత్నాలు వీటిలో విశేషంగా అమరిపోయాయి.

ఆధునికత...

స్నేక్, రౌండ్ స్టైల్‌లో ఉండే బంగారు, వెండి అంక్లెట్ మోడ్రన్ స్టైల్‌కి అదనపు హంగుగా అమరుతున్నాయి.







పరీక్షా కాలం

కలిసి మీరూ రాయండి

ఒకరోజు తేడాతో ఇంటర్మీడియెట్ పరీక్షలు రెండు రాష్ట్రాలలో మొదలయ్యాయి. పిల్లలు కొంత ఆందోళనగా, కొంత హైరానాగా ఉంటారు. ఈ సమయంలో పిల్లలు రాయాల్సిన వారుగా తాము రాయించే వారుగా తల్లిదండ్రులు ఉండరాదు. పిల్లల పరీక్షాకాలంలో తాము కూడా తోడుగా ఉన్న భావన కలిగించాలి. అలా కలిగించాలంటే వారిని వీలున్నంత సౌకర్యంగా ఉంచాలి. భయపెట్టని ప్రోత్సాహం అందించాలి. నిపుణుల సమగ్ర సూచనలు.



తండ్రి ఆఫీసులోఎనిమిది గంటలు పని చేయగలడు. మధ్యలో విరామాలు ఎన్నో ఉంటాయి. అమ్మ ఇంట్లో మూడు పూట్లా పని చేస్తుంది. మధ్యలో ఆమెకూ విరామాలుంటాయి. కాని పరీక్షలు వచ్చినప్పుడు మాత్రం విరామం లేకుండా పిల్లలు చదువుతూనే ఉండాలంటారు తల్లిదండ్రులు. పిల్లలకు ధారణశక్తి డిఫరెంట్‌గా ఉంటుంది. ప్రతి పిల్లవాడికీ అది మారుతుంది. కొందరు ఒక అంశాన్ని అలా కళ్లతో చూసి గుర్తుపెట్టుకోగలరు. కొందరు అరగంట సేపు చూసి నేర్చుకోగలరు. మరికొందరు గంట చదివితే తప్ప గ్రహించలేరు. వీరు ముగ్గురూ పుస్తకం పట్టుకుని మాత్రమే కనిపించాలని పరీక్షల సమయంలో తల్లిదండ్రులు ఆశిస్తే 'చదివిందే ఎంతసేపు చదవాలి' అని మొదటి రెండు రకాల పిల్లలు విసుక్కుంటారు. కాబట్టి తల్లిదండ్రులు పిల్లల చేత పరీక్షలు రాయించడమంటే వారిని పూర్తిగా అర్థం చేసుకుంటూ వారికి సహకరిస్తూ, విరామాలిస్తూ, ప్రోత్సహిస్తూ చదివించడమే.

వాళ్ల ప్లానింగ్‌ని వినాలి

పిల్లలు పరీక్షల టైమ్ టేబుల్ రావడానికి ముందే వాళ్లదైన పద్ధతిలో ఎలా చదవాలో ప్లాన్ చేసుకుంటారు. అంటే వాళ్లు వీక్‌గా ఉన్న సబ్జెక్ట్‌ను ముందే చదువుకుంటారు. స్ట్రాంగ్‌గా ఉన్న సబ్జెక్ట్‌ను ఉపేక్షిస్తారు. మేథ్స్ పరీక్షకు ఒక్క రోజు మాత్రమే టైమ్‌టేబుల్‌లో విరామం వస్తే తెలుగు/సంస్కృతం పేపర్‌లో స్ట్రాంగ్‌గా ఉండే పిల్లలు మరో రెండు రోజుల్లో తెలుగు పేపర్ ఉందనగా కూడా మేథ్స్ చేసుకుంటూ కనిపించవచ్చు. వారిని బలవంతంగా తెలుగు చదివించాల్సిన పని లేదు. వారి ప్లానింగ్‌ని తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి. కొన్ని పేపర్లకు మూడు రోజుల గ్యాప్ రావచ్చు. ఆ మూడు రోజుల్లో మొదటి రోజును ఇంకో పేపర్ సిలబస్ కోసం కొందరు పిల్లలు కేటాయిస్తే కంగారు పడాల్సిన పని లేదు. ఆ రాయాల్సిన పరీక్షకు వారి ఉద్దేశంలో రెండు రోజులు చాలనే. ఇలాంటివి పిల్లలు చెప్పినప్పుడు మన మొండితనంతో ఇలాగే చదవాలని తల్లిదండ్రులు బలవంతం చేయకపోవడం మంచిది.

బయటి తిండి వద్దు

పరీక్షలు అయ్యేంత వరకూ తల్లిదండ్రులకు వీలున్నా లేకపోయినా బయటి ఆహారం అది బ్రేక్ ఫాస్ట్ అయినా గాని ఇవ్వకపోవడం తప్పనిసరి. బయటి పదార్థాలు పొట్టని పాడు చేస్తే పరీక్ష రాయడం చాలా ఇబ్బంది అవుతుంది. పరిశుభ్రమైన ఇంటి తిండి పిల్లలకు అందించాలి. ఆకుకూరలు, కాయగూరలతో పాటు గుడ్డు తినే పిల్లలకు తినిపించాలి. బొప్పాయి, సపోటా మంచివి. పిల్లలు చదువుకునే డెస్క్ మీద, పరీక్ష హాలులో వాటర్ బాటిల్ ఉండేలా చూసుకోవాలి. పిల్లలు హైడ్రేట్‌గా ఉండేలా మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు ఇస్తుండాలి.

తోడు వెళ్లండి

పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఎవరో ఒకరు పరీక్షా కేంద్రానికి వెళితే పిల్లలకు ధైర్యంగా ఉంటుంది. పరీక్ష అయ్యే వరకూ బయటే ఉండి తీసుకొస్తాం అనంటే వారు లోపల ధైర్యంగా రాస్తారు. అలాగే పరీక్షలు అయ్యేంత వరకూ పిల్లలను ఒంటరిగా పనుల మీద బయటకు పంపరాదు. వెహికల్స్ నడపనివ్వరాదు. ఈ సమయంలో చిన్న ప్రమాదం కూడా పెద్ద నష్టానికి దారి తీస్తుంది. పరీక్షలు అయ్యేంత వరకూ పిల్లలు పెద్దల అజమాయిషీలోనే బయటకు వెళ్లాలి.

వారితో వాక్ చేయండి

పరీక్ష రాసి వచ్చాక, తర్వాతి పరీక్ష కోసం ప్రిపేర్ అవుతున్నప్పుడు పిల్లలతో సాయంత్రాలు తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు అరగంట సేపు వాకింగ్‌కు వెళ్లండి. ఆ సమయంలో వారితో ఏవైనా కబుర్లు చెప్పండి. ఆ సమయంలో కూడా చదువు గురించి కాకుండా ఏవైనా సరదా విషయాలు మాట్లాడండి. వారికి బ్రేక్ ఇచ్చినట్టూ ఉంటుంది... వ్యాయామమూ జరిగినట్టుంటుంది.

సిన్సియర్‌గా చదవమనండి: తమను తాము మోసం చేసుకోకుండా, తల్లిదండ్రులను మోసం చేయకుండా ఉన్న తెలివితేటలను బట్టి మేక్సిమమ్ ఎంత చదవగలరో అంతా సిన్సియర్‌గా చదివి పరీక్ష రాయమనండి. రాసిన దానిపై వాస్తవిక అంచనాతో ఉండమనండి. ఆ అంచనా ఎంతైనా గాని చెప్పమనండి. నిజాయితీగా రాయడమే తమ దృష్టిలో ముఖ్యమని, ఫలితాల సంగతి తర్వాత చూద్దామని చెప్పండి. వారు కొంత రిలీఫ్‌గా, మరింత శ్రద్ధగా పరీక్ష రాస్తారు.

చెట్టినాడు రుచుల్లో కరివేపాకు ప్రధానం. తోడుగా కొబ్బరి కూడా ఉంటుంది. అన్నంలోకి అధరవుగానూ ఉంటాయి. సాయంత్రాలకు స్నాక్‌గా కుదురుతాయి. కడుపు నిండుగా ఆరోగ్యం మెండుగా ఉంటాయి.

చెట్టినాడు ఘుమఘుమలు

వంటిల్లు

ఉర్లయ్ రోస్ట్

కావలసినవి: బేబీ పొటాటోలు – అర కిలో

మసాలా పొడి కోసం: ఎండుమిర్చి – 4; ధనియాలు – టీ స్పూన్; దాల్చిన చెక్క – అంగుళం ముక్క; యాలక్కాయ – 1; లవంగం– 1; సోంపు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; మిరియాల పొడి– టీ స్పూన్; కొబ్బరి తురుము – 3 టేబుల్ స్పూన్‌లు; కరివేపాకు – 2 రెమ్మలు.

పోపు కోసం: వేరుశనగ నూనె – 3 టేబుల్ స్పూన్‌లు; ఆవాలు – అర టీ స్పూన్; మినప్పప్పు – అర టీ స్పూన్; కరివేపాకు – 2 రెమ్మలు; ఉల్లిపాయలు – 2 (మీడియం సైజువి, తరగాలి); పచ్చిమిర్చి – 2 (చీరాలి); అల్లంవెల్లుల్లి తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; పసుపు – అర టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ధనియాల పొడి – రెండు టీ స్పూన్‌లు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్.



తయారీ: ● బంగాళాదుంపలను ఉడికించి తొక్క తీసి పక్కన పెట్టాలి ● బాణలి వేడి చేసి మసాలా పొడి కోసం తీసుకున్న దినుసులన్నింటినీ ఒకదాని తర్వాత ఒకటిగా వేసి వేగి చల్లారిన తర్వాత పొడి చేసి పక్కన పెట్టాలి ● బాణలిలో ఆయిల్ వేడి చేసి ఆవాలు వేయాలి. వేగిన తర్వాత మినప్పప్పు, కరివేపాకు వేయాలి. ఇప్పుడు ఉల్లిపాయ ముక్కలు వేసి ఎరుపు రంగులోకి వచ్చిన తర్వాత పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి తరుగు వేసి వేగిన తర్వాత మసాలా పొడిని చల్లాలి. ఆ తరవాత మిరప్పొడి, ధనియాల పొడి, ఉప్పు వేసి కలిపి ఉడికించి తొక్క తీసి సిద్ధంగా ఉంచిన బంగాళాదుంపలను వేసి మసాలా సమంగా పట్టేవరకు వేయించాలి. చివరగా కొత్తిమీర చల్లి దించేయాలి. దీనిని ఈవెనింగ్ స్నాక్‌గానూ, అన్నంలోకి సైడ్ డిష్‌గానూ తినవచ్చు.

గమనిక: ఉర్లయ్ అంటే బంగాళాదుంప. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా కొన్ని చోట్ల బంగాళాదుంపను ఉర్లగడ్డ అంటారు.

చెట్టినాడు ఫిష్ ఫ్రై

కావలసినవి: చేప ముక్కలు – నాలుగు; నూనె – 2 టేబుల్ స్పూన్‌లు; టొమాటో ముక్కలు – పావు కప్పు; కరివేపాకు – 2 రెమ్మలు; చింతపండు రసం– టేబుల్ స్పూన్; ఆవాలు – టీ స్పూన్; వెల్లుల్లి రేకలు – 8 (తరగాలి); అల్లం తరుగు – టీ స్పూన్; ధనియాలు – టీ స్పూన్; సోంపు గింజలు– టీ స్పూన్; మిరియాలు – పది; మిరప్పొడి– టీ స్పూన్; పసుపు– టీ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.



తయారీ: ● చేప ముక్కలను శుభ్రం చేసి పక్కన పెట్టాలి ● బాణలి వేడి చేసి కరివేపాకు, వెల్లుల్లి, ధనియాలు, సోంపు, మిరియాలు వేయించి చల్లారిన తర్వాత పొడి చేయాలి. పొడి చేసేటప్పుడు కొద్దిగా నూనె వేయాలి ● ఇప్పుడు చింతపండు రసం, టొమాటో ముక్కలు, అల్లం, పసుపు, మిరప్పొడి, ఉప్పు కలిపి గ్రైండ్ చేయాలి. ఈ పేస్ట్‌ను ఒకసారి రుచి చూసి అవసరమైతే ఉప్పు మరికొంత కలుపుకోవాలి. ఇందులో మసాలా పొడిని కూడా కలిపి ఈ మిశ్రమాన్ని చేప ముక్కలకు పట్టించాలి ● ఇరవై నిమిషాల తర్వాత బాణలిలో నూనె వేడి చేసి చేప ముక్కలను నూనెలో అమరేటట్లు ఒకదాని పక్కన ఒకటిగా పెట్టాలి. ఐదు నిమిషాల సేపు మీడియం మంట మీద కాలిన తర్వాత ముక్కలను జాగ్రత్తగా తిరగేయాలి. చేప ముక్కల అంచులు కరకరలాడే వరకు వేగిన తర్వాత తీసి నిమ్మకాయ ముక్కలతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

నారియల్ సోయా పనీర్ వడ

కావలసినవి: తురిమిన పనీర్– 4 కప్పులు; తురిమిన టోఫూ – 2 కప్పులు; అల్లం తరుగు – 3 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి తరుగు – టేబుల్ స్పూన్; వెల్లుల్లి తరుగు – 3 టేబుల్ స్పూన్‌లు; కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; గరం మసాలా పొడి– టీ స్పూన్; దాల్చిన చెక్క పొడి– టీ స్పూన్; మిరియాల పొడి– టీ స్పూన్; కొబ్బరి పొడి– 5 టేబుల్ స్పూన్‌లు; మైదా లేదా కార్న్‌ఫ్లోర్ – 4 టేబుల్ స్పూన్‌లు; బ్రెడ్ పొడి– 10 టేబుల్ స్పూన్‌లు; నూనె – వేయించడానికి తగినంత.



తయారీ: ● టోఫూ, పనీర్‌లను పలుచని క్లాత్‌లో కట్టి నీరు కారిపోవడానికి కనీసం ఓ అరగంట సేపు ఉంచాలి ● ఇప్పుడు పనీర్, టోఫూ తురుముని ఒక పాత్రలో వేసి మెత్తగా చిదమాలి. అందులో అల్లం, పచ్చిమిర్చి, వెల్లుల్లి, ఉప్పు, గరం మసాలా, దాల్చినచెక్క పొడి, మిరియాల పొడి, కొబ్బరి పొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత గోళీలుగా చేసుకుని పక్కన పెట్టాలి ● మైదా లేదా కార్న్‌ఫ్లోర్‌లో తగినంత నీటిని పోసి జారుడుగా కలుపుకోవాలి ● పనీర్ మిశ్రమం గోళీలను వడల్లా వత్తి కార్న్‌ఫ్లోర్‌లో ముంచి ఆ తర్వాత బ్రెడ్ పొడిలో వేసి వడ అంతటికీ బ్రెడ్ పొడి పట్టేటట్లు రోల్ చేయాలి ● ఇప్పుడు బాణలిలో నూనె వేడి చేసి ఒక్కో వడను జాగ్రత్తగా నూనెలో వేసి తిరగేస్తూ రెండు వైపులా ఎర్రగా కాలిన తర్వాత తీసి టిష్యూ పేపర్ మీద వేయాలి. నూనె వదిలిన తర్వాత సర్వ్ చేయాలి.

బ్యూటిప్స్



- గోళ్లు అందంగా ఉండాలంటే దేహం ఆరోగ్యంగా ఉండాలి. గోళ్లలో చీలికలు, పొడిబారిపోవడం కనిపిస్తే విటమిన్ లోపం ఉన్నట్లు అర్థం
- తెల్ల చుక్కలు కనిపిస్తే ఎప్పుడూ నెయిల్ పాలిష్ వేస్తుంటారని లేదా మీకు గోళ్లు కొరికే అలవాటుందని అర్థం చేసుకోవాలి
- అడ్డంగా గీతలు, గాడి ఏర్పడినట్లు ఉంటే విపరీతమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నట్లు, తీవ్రమైన జ్వరం బారిన పడినట్లు అర్థం
- ఉబ్బెత్తుగా ఉండాల్సిన గోరు గుంట పడినట్లు పలుచగా మారితే అది ఐరన్‌లోపానికి గుర్తు. సమతుల ఆహారం తీసుకుంటూ, దేహం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా తగినంత నీటిని తీసుకుంటూ ఉండాలి. దాంతోపాటు కొన్ని చుక్కల ఆల్మండ్ ఆయిల్/ ఆలివ్ ఆయిల్ లేదా కొబ్బరి నూనె వేసి వలయాకారంలో రుద్దుతూ ఉండాలి. అప్పుడు గోరు గులాబీరంగులో ఆరోగ్యంగా మెరుస్తూ ఉంటుంది.

ఇంటిప్స్

- కూరలో నీరు ఎక్కువైతే కూరగాయ ముక్కలు ఉడికిన తర్వాత కూడా కూర చిక్కబడదు. అలాంటప్పుడు వేయించిన వేరుశనగపప్పులు పొడి కలిపితే చిక్కదనంతోపాటు రుచి కూడా ఇనుమడిస్తుంది. కూరల్లో ఉప్పు ఎక్కువైనప్పుడు కూడా ఈ చిట్కా మంచి ఫలితాన్నిస్తుంది.



- బంగాళాదుంపలు వాడిపోయినట్లయితే... ఒక పాత్రలో వేసి అవి మునిగేటట్లు నీటిని పోసి ఓ అరగంట ఉంచితే తాజాగా మారుతాయి.
- అల్లంవెల్లుల్లి పేస్ట్ గ్రైండ్ చేసేటప్పుడు అందులో చిటికెడు ఉప్పు, అర టీ స్పూన్ నూనె వేయాలి. ఇలా గ్రైండ్ చేసిన పేస్ట్‌ను గాలిచొరబడని డబ్బాలో నిల్వ చేసి ఫ్రిజ్‌లో పెడితే రెండు వారాల పాటు తాజాగా ఉంటుంది.



- వెల్లుల్లిపొట్టు త్వరగా వదలాలంటే... రేకలను ఒక పాత్రలో వేసి కొద్దిగా నూనె వేసి అన్నింటికీ పట్టేటట్లు వేళ్లతో రుద్ది ఇరవై నిమిషాల సేపు ఎండలో పెట్టాలి.
- పచ్చిమిర్చి ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఫ్రిజ్‌లో పెట్టేముందు తొడిమలు ఒలిచి న్యూస్ పేపర్‌లో చుట్టి పాలిథిన్ కవర్‌లో పెట్టాలి.
- మార్కెట్‌లో కొన్న పనీర్‌ని వండే ముందు పది నిమిషాల సేపు గోరువెచ్చటి నీటిలో నానబెడితే, పనీర్ ముక్కలు మృదువుగా మారుతాయి.



సాక్షి బిజినెస్

శుక్రవారం
1-3-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
195	32
72,500	21,983

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,003	▽	56
డోజోన్స్	38,895	▽	54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,630	▲	5
డాక్స్	17,678	▲	77
షాంఘై	3,015	▲	57
నికాయ్	39,166	▽	41

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
62,241	▲	106
బంగారం (99.5 స్వచ్ఛత)		
61,992	▲	106
వెండి (కిలో)		
69,312	▽	31

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.49	83.51
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.85	106.42
€	యూరో	ఎస్‌బీఐ	88.76	91.11
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.78	56.02
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.11	55.03
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.38	64.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.20	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.68	23.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.40	12.48

సువెన్ ఫార్మాలో కోహ్యాన్స్ విలీనం



న్యూఢిల్లీ: ఔషధ రంగ సంస్థ సువెన్ ఫార్మాలో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, తయారీ ప్లాట్‌ఫాం కోహ్యాన్స్ లైఫ్‌సైన్సెస్ విలీనమవుతోంది. విలీన స్కీము ప్రకారం కోహ్యాన్స్ షేర్‌హోల్డర్ల వద్ద ఉండే ప్రతి 295 షేర్లకు గాను 11 సువెన్ షేర్లు లభిస్తాయి. వచ్చే 12–15 నెలల్లో ఈ డీల్ పూర్తి కావచ్చని సువెన్ ఫార్మా తెలిపింది. సమగ్ర సీడీఎంవో సంస్థగా ఎదిగే దిశగా సువెన్ ప్రయాణంలో ఇది తోడ్పడగలదని సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అన్నాస్వామి వైదీష్ తెలిపారు. 2022 డిసెంబర్‌లో ప్రమోటర్లయిన జాస్తి కుటుంబం.. సువెన్ ఫార్మాలో 50.1 శాతం వాటాలను ఆడ్వెంట్ ఇంటర్నేషనల్‌కి విక్రయించింది. అదే ఏడాది ఆడ్వెంట్ సంస్థ తమ ఏపీఐ, సీడీఎంవో కార్యకలాపాల కోసం కోహ్యాన్స్ లైఫ్‌సైన్సెస్‌ను ఏర్పాటు చేసింది.

నేటి నుంచి అజియో ఆల్ స్టార్స్ సేల్ ఆఫర్




బెంగళూరు: అడిడాస్ సమర్పణ, సూపర్‌డ్రై సహ సమర్పణలో ఆన్‌లైన్ ఈ–ఫ్యాషన్ రిటైలర్ అజియో 'ఆల్ స్టార్స్ సేల్' ఆఫర్ ప్రకటించింది. నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్న ఈ గొప్ప ఆఫర్‌లో 6 వేలకు పైగా బ్రాండ్లు, 17 లక్షల ఫ్యాషన్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. ప్రత్యేక డీల్స్‌పై 50–90% డిస్కౌంట్లు అందిస్తోంది. ఉత్తమ షాపింగ్ చేసిన కస్టమర్లు ఐఫోన్, ఆపిల్ మ్యాక్‌బుక్, శాంసంగ్ స్మార్ట్ ఫోన్లు గెలుచుకోవచ్చు. ఐసీఐసీఐ క్రెడిట్, డెబిట్ కార్డ్స్‌తో 10% వరకు తగ్గింపు పొందవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

1-3-2024	
విశాఖ	500–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	416–00
విజయవాడ	460–00
రిటైల్ ధర (డజను)	72.00
29-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	460–00
వరంగల్	462–00
రిటైల్ ధర	5.20

భారత్ దూకుడు

- అంచనాలకు మించి క్యూ3లో 8.4 శాతం వృద్ధి
- తయారీ, మైనింగ్ – క్వారీ, నిర్మాణ రంగాలు చేయూత
- వ్యవసాయం తీవ్ర నిరాశ
- 2023–24లో 7.6 శాతం పురోగతి: కేంద్రం



న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ దూసుకుపోతోంది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో (అక్టోబర్–డిసెంబర్) అంచనాలకు మించి 8.4 శాతంగా నమోదయ్యింది. ఎస్‌బీఐ రీసెర్చ్, జర్మనీ బ్రోకరేజ్– డాయిష్ బ్యాంక్ వంటి సంస్థలు 7 శాతం వరకూ వృద్ధి అంచనాలను వెలువరించాయి. తాజా ప్రోత్సాహకర ఎకానమీ ఫలితాల నేపథ్యంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 7.6 శాతం నమోదవుతుందని విశ్వసిస్తున్నట్లు కేంద్ర గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) ప్రకటించింది. ఈ మేరకు తన రెండవ అడ్వాన్స్ అంచనాలను వెలువరించింది. మొదటి అడ్వాన్స్ అంచనాలు 7.3 శాతం. సమీక్షా కాలంలో (క్యూ3)లో తయారీ, మైనింగ్ అండ్ క్వారీ, నిర్మాణ రంగాలు మంచి పనితనాన్ని ప్రదర్శించినట్లు ఎన్‌ఎస్‌ఓ పేర్కొంది. కాగా, వ్యవసాయ రంగం తీవ్ర విచారకరమైన రీతిలో 0.8 శాతం క్షీణ రేటును నమోదుచేసుకుంది. ఇదిలావుండగా, గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో (క్యూ3) వృద్ధి రేటు 4.3 శాతం.

క్యూ1, క్యూ2 శాతాలు అప్..

2022–23 వృద్ధి అంచనాలను 7.2 శాతం నుంచి 7 శాతానికి ఎన్‌ఎస్‌ఓ తగ్గించడం మరో అంశం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఒకటి, రెండు త్రైమాసికాలకు సంబంధించి వృద్ధి అంకెలు వరుసగా 7.8 శాతం (క్యూ1), 7.6 శాతాలుగా (క్యూ2)నమోదయ్యాయి. అయితే ఈ అంకెలను ఎగువముఖంగా 8.2 శాతం, 8.1 శాతాలుగా ఎన్‌ఎస్‌ఓ సవరించడం మరో సానుకూల అంశం. తాజా ప్రోత్సాహకర ఫలితంతో 2023 ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య ఎకానమీ 8.2 శాతం పురోగమించినట్లు కేంద్ర గణాంకాల కార్యాలయం పేర్కొంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ వృద్ధి 7.3 శాతం.

8.4 శాతం వృద్ధి ఎలా అంటే..

2022–23 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి విలువ (ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటూ... 2011–12 బేస్ ఇయర్ ప్రాతిపదిక వాస్తవిక జీడీపీ) రూ.40.35 లక్షల కోట్లు. తాజా 2023–24 ఇదే త్రైమాసికంలో ఈ విలువ 43.72 లక్షల కోట్లకు పెరిగింది. అంటే అంకెల్లో వృద్ధి 8.4 శాతం అన్నమాట. ఇక ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకోని కరెంట్ ప్రైస్ ప్రకారం ఈ విలువ రూ.68.58 లక్షల కోట్ల నుంచి రూ.75.49 లక్షల కోట్లకు ఎగసింది. ఈ ప్రాతిపదిక వృద్ధి రేటు 10.1 శాతంగా ఉంది. ఆర్థిక సంవత్సరం 7.6 శాతం అంచనాలు చూస్తే.. (వాస్తవ వృద్ధి) జీడీపీ విలువ రూ.160.71 లక్షల కోట్ల నుంచి రూ.172.90 లక్షల కోట్లకు పెరగనుంది. కరెంట్ విలువ ప్రాతిపదికన ఈ వృద్ధి అంచనా 9.1 శాతంగా ఉంది. విలువల్లో రూ.269.50 లక్షల కోట్ల నుంచి రూ.293.90 లక్షల కోట్లకు జీడీపీ విలువ పెరగనుంది.

క్యూ3లో వివిధ రంగాల వృద్ధి (శాతాల్లో)

రంగం	2023-24	2022-23
తయారీ	11.6	-4.8
మైనింగ్ అండ్ క్వారీ	7.5	1.4
నిర్మాణం	9.5	9.5
వ్యవసాయం	-0.8	5.2
విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు	9.0	8.7
ట్రేడ్, హోటల్, ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ సేవలు	6.7	9.2
ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలు	7.0	7.7
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సేవలు	7.5	3.5

జనవరిలో మౌలిక రంగం నిరాశ

8 పరిశ్రమల గ్రూప్ 3.6 శాతం వృద్ధి

ఎనిమిది పరిశ్రమల మౌలిక రంగం గ్రూప్ జనవరిలో 15 నెలల కనిష్ట స్థాయిలో 3.6 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది. 2023 జనవరిలో ఈ రేటు 4.9 శాతం. ఏప్రిల్ నుంచి జనవరి మధ్య కాలంలో ఈ గ్రూప్ వృద్ధి రేటు 8.3 శాతం నుంచి 7.7 శాతానికి తగ్గింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ గ్రూప్ వాటా దాదాపు 40 శాతం. సమీక్షా కాలంలో రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువుల రంగాల్లో వృద్ధి లేకపోగా, క్షీణత నమోదయ్యింది. బొగ్గు, స్టీల్, విద్యుత్ రంగాల్లో వృద్ధి మందగించింది. క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, సిమెంట్ రంగాల్లో వృద్ధి రేటు సానుకూలంగా ఉంది.

తలసరి ఆదాయాలు ఇలా...

మరోవైపు వాస్తవ గణాంకాల (ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని) ప్రాతిపదికన 2021–22లో దేశ తలసరి ఆదాయం రూ.1,50,906కాగా, 2022–23లో ఈ విలువ రూ. 1,69,496కు ఎగసినట్లు ఎన్‌ఎస్‌ఓ పేర్కొంది. కరెంట్ ప్రైస్ ప్రకారం చూస్తే ఈ విలువలు రూ.1,05,092 నుంచి రూ.1,18,755కు ఎగశాయి.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు డీలా

- తొలి 9 నెలల్లో 13 శాతం క్షీణత
- 32 బిలియన్ డాలర్లకు పరిమితం



న్యూఢిల్లీ: గత కొద్ది నెలలుగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) వెనకడుగు వేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి 9 నెలల్లో(ఏప్రిల్–డిసెంబర్) 13 శాతం క్షీణించాయి. అంతర్గత వాణిజ్యం, పరిశ్రమల ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) తాజాగా వెల్లడించిన గణాంకాల ప్రకారం 32.03 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రధానంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, టెలికం, ఆటో, ఫార్మా రంగాలకు ఎఫ్‌డీఐలు నీరసించాయి. గతేడాది(2022–23) ఏప్రిల్–డిసెంబర్‌లో 36.74 బిలియన్ డాలర్ల విలువైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు లభించాయి. అయితే ఈ ఏడాది మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో 18% ఎగసి 11.6 బిలియన్ డాలర్లను తాకాయి.

7 శాతం డౌన్: తాజా సమీక్షా కాలంలో ఈక్విటీ పెట్టుబడులుసహా మొత్తం ఎఫ్‌డీఐలు 51.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది తొలి 9 నెలల్లో లభించిన 55.27 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇవి 7 శాతం తక్కువ.

ఆల్టెరో లగ్జరీ ఫర్నిచర్


హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఖరీదైన యూరోపియన్ ఫర్నిచర్ విభాగంలోకి ఆల్టెరో ప్రవేశించింది. తొలి స్టోర్‌ను మాదాపూర్‌లో ప్రారంభించింది. యూరప్‌లో డిజైన్, తయారైన లగ్జరీ ఫర్నిచర్ ఇక్కడ కొలువుదీరింది. ఉత్పత్తుల ధర రూ.5 కోట్ల వరకు ఉందని ఆల్టెరో ఎండీ చందన కోగంటి తెలిపారు. 'అరాన్ కుచీనే, జార్జియో కలెక్షన్, ఫీడీని 1961, కాంటోరీ, రోజీనీ డివానీ, స్కాప్పినీ హోమ్, మరెల్లి, ఫ్లస్ట్, మిండో బ్రాండ్ల ఫర్నిచర్‌ను విక్రయిస్తున్నాం. ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ప్యారిస్, డెన్మార్క్ నుంచి దిగుమతి చేస్తున్నాం' అని వివరించారు.



చందన కోగంటి

ఒడిదుడుకులున్నా.. లాభాలే

సూచీలకు రిలయన్స్ దన్ను



ముంబై: జీడీపీ వృద్ధి డేటా వెల్లడి, ఫిబ్రవరి డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు గురువారం లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2% రాణించి దన్నుగా నిలిచింది. ట్రేడింగ్‌లో 631 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 195 పాయింట్ల లాభంతో 72,500 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 72,099 – 72,730 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 200 పాయింట్ల రేంజ్‌లో 21,861 వద్ద కనిష్టాన్ని, 22,061 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 32 పాయింట్లు పెరిగి 21,983 వద్ద స్థిరపడింది. గత ట్రేడింగ్‌లో భారీ పతనం చూసిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

- జీపీటీ హెల్త్‌కేర్ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ(రూ.186)తో పోలిస్తే 16% ప్రీమియంతో రూ.216 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 18% ఎగసి రూ.220 వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 8% లాభపడి రూ.201 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.1,647 కోట్లుగా నమోదైంది.
- రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు అరశాతానికి పైగా లాభపడి రూ.2,924 వద్ద స్థిరపడింది.

సాక్షి స్పోర్ట్స్



సింగిల్స్ క్వార్టర్స్‌లో సహజ

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో తెలంగాణ అమ్మాయి, భారత రెండో ర్యాంకర్ సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 329వ ర్యాంకర్ సహజ 7–6 (10/8), 7–5తో భారత్‌కే చెందిన రియా భాటియాను ఓడించింది. మరోవైపు తెలంగాణకే చెందిన మరో ప్లేయర్ శ్రీవల్లి రష్మిక రెండో రౌండ్‌లో 6–1, 3–6, 6–7 (5/7)తో ఏడో సీడ్ జాక్వెలిన్ కబాజ్ అవాద్ (స్వీడన్) చేతిలో పోరాడి ఓడిపోయింది.

గాయత్రి–ట్రెసా జోడీ ముందంజ

జర్మన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్ చేరింది. గురువారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో గాయత్రి–ట్రెసా ద్వయం 21–10, 21–11తో సోనా హొరిన్‌కోవా–కాటరీనా జుజకోవా (చెక్ రిపబ్లిక్) జంటపై గెలిచింది.



విన్నర్స్ ట్రోఫీతో పుణేరి పల్టన్ కెప్టెన్ అస్లమ్ ఇనామ్‌దార్, హరియాణా స్టీలర్స్ సారథి జైదీప్ దహియా

నేడే 'ఫైనల్' కూత...

ప్రొ కబడ్డీ లీగ్ టైటిల్ కోసం పుణేరి పల్టన్‌తో హరియాణా స్టీలర్స్ 'ఢీ'

రాత్రి గం. 8 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, హైదరాబాద్: మూడు నెలలుగా క్రీడాభిమానులను ఉర్రూతలూగిస్తోన్న ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్ ఆఖరి అంకానికి రంగం సిద్ధమైంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నేడు జరిగే ఫైనల్ పోరుతో పదో సీజన్‌కు తెర పడనుంది. తొలిసారి తుది సమరానికి చేరుకున్న హరియాణా స్టీలర్స్‌తో గత ఏడాది రన్నరప్ పుణేరి పల్టన్ అమీతుమీ తేల్చుకోనుంది. రాత్రి 8 గంటలకు మొదలయ్యే ఈ ఫైనల్‌కు సంబంధించి టికెట్లన్నీ అమ్ముడుపోవడం విశేషం. ఇప్పటి వరకు తొమ్మిది సీజన్‌లు జరగ్గా... పుణేరి పల్టన్ రెండోసారి... హరియాణా స్టీలర్స్ తొలిసారి ఫైనల్ చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో అంతిమ సమరంలో ఏ జట్టు గెలిచినా తొలిసారి ప్రొ కబడ్డీ లీగ్ ట్రోఫీ టైటిల్‌ను ముద్దాడుతుంది.

ఈ లీగ్ చరిత్రలో ఇప్పటి వరకు పుణేరి పల్టన్, హరియాణా స్టీలర్స్ జట్లు ముఖాముఖిగా 14 సార్లు తలపడ్డాయి. 8 సార్లు పుణేరి జట్టు... 5 సార్లు హరియాణా జట్టు గెలుపొందాయి. ఒక మ్యాచ్ 'టై'గా ముగిసింది. తాజా సీజన్‌లో నిర్ణీత 22 లీగ్ మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న పుణేరి జట్టు 17 మ్యాచ్‌ల్లో నెగ్గి, రెండింటిలో ఓడి, మూడింటిని 'టై' చేసుకొని 96 పాయింట్లతో 'టాపర్'గా నిలిచి నేరుగా సెమీఫైనల్ చేరుకుంది. మరోవైపు హరియణా 70 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచింది. ఎలిమినేటర్–2లో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించి, సెమీఫైనల్ చేరిన హరియాణా ఈ కీలక పోరులో 31–27తో డిఫెండింగ్ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌ను బోల్తా కొట్టించి ఫైనల్లోకి అడుగు పెట్టింది. పుణేరి పల్టన్ తరఫున మోహిత్ గోయట్ ఈ సీజన్‌లో అత్యధికంగా 117 రెయిడింగ్ పాయింట్లు సాధించాడు. డిఫెన్స్ విభాగంలో మొహమ్మద్ రెజా 97 ట్యాకిల్ పాయింట్లు సంపాదించాడు. పుణేరి పల్టన్ జట్టు కెప్టెన్ అస్లమ్ ఇనామ్‌దార్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 164 పాయింట్లతో అదరగొట్టాడు. మరోవైపు హరియాణా స్టీలర్స్ రెయిడర్ వినయ్ ఏకంగా 160 పాయింట్లు కొల్లగొట్టాడు. డిఫెండర్ రాహుల్ 71 పాయింట్లు, కెప్టెన్ జైదీప్ 69 పాయింట్లతో ఆకట్టుకున్నారు.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ మ్యాచ్ 'డ్రా'



సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు మూడో 'డ్రా' నమోదు చేసుకుంది. లీగ్ 'టాపర్' మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌ను శ్రీనిధి డెక్కన్ జట్టు 1–1తో 'డ్రా'గా ముగించింది. ఆట మూడో నిమిషంలో డేవిడ్ కాస్టనెడా గోల్‌తో శ్రీనిధి జట్టు 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 84వ నిమిషంలో మొహమ్మద్ జాసిమ్ గోల్‌తో మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ స్కోరును సమం చేసింది. రెండు జట్లకు చెరో పాయింట్ లభించింది. ప్రస్తుతం మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ 35 పాయింట్లతో అగ్ర స్థానంలో కొనసాగుతుండగా... శ్రీనిధి డెక్కన్ జట్టు 33 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

స్మృతి మెరుపులు వృథా

- బెంగళూరు జట్టుకు తొలి ఓటమి
- 25 పరుగులతో నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్
- మరిజాన్ కాప్, జెస్ జొనాసెన్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- షఫాలీ వర్మ అర్ధ సెంచరీ



షఫాలీ

స్మృతి

మరిజాన్ కాప్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో 'హ్యాట్రిక్' నమోదు చేయాలని ఆశించిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు నిరాశ ఎదురైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో స్మృతి మంధాన సారథ్యంలోని బెంగళూరు జట్టు 25 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఢిల్లీ ప్లేయర్లు మరిజాన్ కాప్, జెస్ జొనాసెన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. ఈ లీగ్‌లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన బెంగళూరుకు ఇదే మొదటి పరాజయం కావడం గమనార్హం. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసి ఓడిపోయింది. స్మృతి మంధాన కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడినా ఫలితం లేకపోయింది. ఆరంభం నుంచే ఢిల్లీ బౌలర్ల భరతం పట్టిన స్మృతి 43 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లతో 74 పరుగులు చేసింది. సోఫీ డివైన్ (17 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించిన స్మృతి... రెండో వికెట్‌కు ఆంధ్రప్రదేశ్ అమ్మాయి సబ్బినేని మేఘన (31 బంతుల్లో 36; 2 ఫోర్లు, 1 సిక్స్) జత చేసింది. మరిజాన్ కాప్ వేసిన ఇన్నింగ్స్ 12వ ఓవర్లో చివరి బంతికి భారీ షాట్ ఆడేందుకు ప్రయత్నించి గురి తప్పిన స్మృతి క్లీన్ బౌల్డ్ అయింది. అప్పటికి బెంగళూరు స్కోరు 112. స్మృతి అవుటయ్యాక వచ్చిన బ్యాటర్లు ఇలా వచ్చి అలా పెవిలియన్ బాట పట్టడంతో బెంగళూరు విజయతీరానికి చేరలేకపోయింది. ఢిల్లీ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజాన్ కాప్ (2/35), జెస్ జొనాసెన్ (3/21), అరుంధతి రెడ్డి (2/38) రాణించారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 194 పరుగులు సాధించింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (17 బంతుల్లో 11; 2 ఫోర్లు) విఫలమైనా... షఫాలీ వర్మ (31 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), అలైస్ క్యాప్సీ (33 బంతుల్లో 46; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. రెండో వికెట్‌కు 83 పరుగులు జోడించారు. వీరిద్దరు అవుటయ్యాక మరిజాన్ కాప్ (16 బంతుల్లో 32; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), జెస్ జొనాసెన్ (16 బంతుల్లో 36 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించి ఢిల్లీకి భారీ స్కోరును అందించారు. **నేడు జరిగే మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది.**

చివరి టెస్టుకూ కేఎల్ రాహుల్ దూరం

- జట్టుతో చేరనున్న బుమ్రా
- రంజీ సెమీఫైనల్ కోసం వాషింగ్టన్ సుందర్ విడుదల





ధర్మశాల: తొడ కండరాల గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఇంగ్లండ్‌తో జరిగే ఐదో టెస్టుకూ దూరమయ్యాడు. మొదటి నుంచీ అతను ఈ మ్యాచ్‌లో ఆడటంపై సందేహాలు ఉన్నాయి. అందుకే జట్టును ఎంపిక చేసిన సమయంలో 'ఫిట్‌నెస్‌కు లోబడి' అంటూ బీసీసీఐ స్పష్టంగా పేర్కొంది. అతను 90 శాతం వరకు కోలుకున్నా... ఇంకా పూర్తి ఫిట్ కాకపోవడంతో మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. ఈ సిరీస్‌లో హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టులో మాత్రమే రాహుల్ బరిలోకి దిగాడు. 'రాహుల్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. అతని పరిస్థితిని బీసీసీఐ వైద్యబృందం పర్యవేక్షిస్తోంది. ఈ విషయంలో తదుపరి చికిత్సకు సంబంధించి లండన్‌లో ఉన్న వైద్యులతో వారు సంప్రదిస్తున్నారు' అని బోర్డు పేర్కొంది. రాంచీ టెస్టు నుంచి విశ్రాంతి తీసుకున్న ప్రధాన పేసర్ బుమ్రా మార్చి 7 నుంచి జరిగే చివరి టెస్టులో బరిలోకి దిగుతాడని బోర్డు ప్రకటించింది. రాహుల్ గైర్హాజరులో రజత్ పటిదార్ తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 6 ఇన్నింగ్స్‌లలో కలిపి 63 పరుగులే చేసిన పటిదార్‌కు తుది జట్టులో చోటు దక్కేది సందేహమే. పటిదార్ స్థానంలో కర్ణాటక బ్యాటర్ దేవ్‌దత్ పడిక్కల్ అరంగేట్రం చేసే అవకాశముంది. టీమ్‌తో ఉన్న ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను బీసీసీఐ విడుదల చేసింది. రేపటి నుంచి ముంబైతో జరిగే రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో తమిళనాడు తరఫున అతను బరిలోకి దిగుతాడు. లండన్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్న పేసర్ షమీ కోలుకుంటున్నాడని... త్వరలోనే జాతీయ క్రికెట్ అకాడమీలో అతని రీహాబిలిటేషన్ మొదలవుతుందని బోర్డు వెల్లడించింది.

బోపన్న జోడీకి షాక్



దుబాయ్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించిన తర్వాత బరిలోకి దిగిన తొలి టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నిరాశ ఎదురైంది. దుబాయ్ ఓపెన్ ఏటీపీ–500 టోర్నీలో ఈ జోడీ క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించింది. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 6–3, 3–6, 8–10తో బెహర్ (ఉరుగ్వే)–పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) జంట చేతిలో ఓడిపోయింది. 71 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట ఆరు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది.

యూకీ–హాస్ జంట సంచలనం

మరోవైపు ఇదే టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జంట సంచలన విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో యూకీ–హాస్ జోడీ 6–4, 7–6 (7/1)తో మూడో సీడ్ జేమీ ముర్రే (బ్రిటన్)–మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జంటను బోల్తా కొట్టించింది.

గ్రీన్ అజేయ సెంచరీ



వెల్లింగ్టన్: న్యూజిలాండ్ జట్టుతో గురువారం మొదలైన తొలి టెస్టులో ఆస్ట్రేలియా జట్టును మిడిలార్డర్ బ్యాటర్ కామెరాన్ గ్రీన్ (155 బంతుల్లో 103 బ్యాటింగ్; 16 ఫోర్లు) అజేయ సెంచరీతో ఆదుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 279 పరుగులు చేసింది. ఓపెనర్లు స్టీవ్ స్మిత్ (31; 4 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (33; 3 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 61 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే స్మిత్ అవుటయ్యాక ఆసీస్ 28 పరుగుల తేడాతో నాలుగు వికెట్లు కోల్పోయి 89/4తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో గ్రీన్ సహచరుడు మిచెల్ మార్ష్ (40; 6 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి ఐదో వికెట్‌కు 67 పరుగులు జత చేశాడు. మార్ష్ అవుటయ్యాక ఒకవైపు ఆసీస్ వికెట్లు కోల్పోతుంటే మరోవైపు గ్రీన్ దూకుడుగా ఆడుతూ కెరీర్‌లో రెండో టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కివీస్ బౌలర్లలో హెన్రీ 4 వికెట్లు తీయగా... ఒరూర్కీ, కుగెలిన్ 2 వికెట్లు చొప్పున పడగొట్టారు.

యువర్స్

● సక్సెస్ స్టోరీ



విక్రాంత్ శివాలిక్

దీర్ఘాయు కౌశిక్

ధైర్యం ఇస్తూ... దారి చూపుతూ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాంకేతికతతో విదేశీ విశ్వవిద్యాలయాలకు సంబంధించిన అడ్మిషన్ ప్రాసెస్‌ను సులభతరం చేసి 'అంబిటియో' పేరుతో ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేశారు ఐఐటీ గ్రాడ్యుయేట్స్ దీర్ఘాయు కౌశిక్, విక్రాంత్ శివాలిక్, వైభవ్ త్యాగీ. మన దేశంలోని తొలి ఏఐ అడ్మిషన్ ప్లాట్‌ఫామ్ 'అంబిటియో' విజయపథంలో దూసుకుపోతోంది....

ఐఐటీ–బీహెచ్‌యూ(వారణాసి)లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన కౌశిక్ ఫారిన్ యూనివర్శిటీలో ఎంబీఏ చేయడం కోసం అప్లై చేయాలనుకున్నప్పుడు స్టూడెంట్స్‌కు సహాయపడే ప్లాట్‌ఫామ్‌లాంటిదేమీ తనకు కనిపించలేదు. 'విదేశీ యూనివర్శిటీలలో చేరే విషయంలో సహాయం అందించడానికి కౌన్సెలర్‌లు ఉన్నప్పటికీ ఎక్కువ డబ్బులు తీసుకుంటారు. ఆ ఆర్థికభారం అందరికీ సాధ్యం కాదు. మరో విషయం ఏమిటంటే వారు ఒకటి రెండు కాలేజీల గురించి మాత్రమే చెబుతారు' అంటాడు కౌశిక్. ఈ నేపథ్యంలోనే స్టూడెంట్స్‌కు సంబంధించి కాలేజీ అప్లికేషన్స్, సరియైన కాలేజీ ఎంపిక చేసుకోవడం, పర్సనల్ ఎస్సేస్...మొదలైన వాటి గురించి ఒక ప్లాట్‌ఫామ్‌ను క్రియేట్ చేయాలనుకున్నాడు.

కాలేజీ ఫ్రెండ్స్ విక్రాంత్, వైభవ్ త్యాగీలకు తన ఆలోచన చెప్పాడు. వారికి ఐడియా నచ్చి కౌశిక్‌తో కలిసి పనిచేయడానికి ముందుకు వచ్చారు. అలా 'అంబిటియో' అంకురం మొలకెత్తింది. 'అంబిటియో' ప్లాట్‌ఫామ్ ద్వారా మొదట పాతిక మంది స్టూడెంట్స్‌కు టాప్ ఇనిస్టిట్యూట్స్‌లో అడ్మిషన్ దొరికేలా సహాయం చేశారు. స్టూడెంట్స్ ప్రొఫైల్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టి వాటికి మార్పులు, చేర్పులు చేశారు. కార్నెగి మెలన్ యూనివర్శిటీ, ఎన్‌వైయూ, ఇంపీరియల్ కాలేజ్, యూసీ బర్కిలి...మొదలైన ఇంటర్నేషనల్ యూనివర్శిటీలకు సంబంధించి 175 మంది స్టూడెంట్స్‌కు సహాయపడ్డారు. 'అంబిటియో గురించి తెలియడానికి ముందు ఒక కౌన్సెలర్ సలహాలు తీసుకున్నానుగానీ అవి నాకు ఉపయోగపడలేదు. అంబిటియో ఉపయోగించడం మొదలు పెట్టిన తరువాత నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. సరియైన దారి కనిపించింది' అంటున్న ప్రహార్ కమల్‌కు లండన్‌లోని వార్‌విక్ బిజినెస్ స్కూల్‌లో ప్రవేశం దొరికింది.

'అంబిటియో' ప్లాట్‌ఫామ్‌లో ఏఐ ఎలా ఉపకరిస్తుంది అనే దాని గురించి కో–ఫౌండర్, సీయీవో కౌశిక్ మాటల్లో... 'రెండు ప్రైమరీ ఏరియాలలో ఏఐ టెక్నాలజీని ఉపయోగిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మోస్ట్ సూటబుల్ ప్రోగ్రామ్ లేదా యూనివర్శిటీని ఎంపిక చేసుకోవడంలో స్టూడెంట్స్‌కు సహాయపడడం అందులో ఒకటి. తమకు అర్హత ఉన్న కోర్సులను ఫిల్టర్ చేసి చూడడానికి ప్రస్తుతం ఫిల్టరేషన్ టూల్స్ ఉన్నప్పటికీ మేము ఏఐ ద్వారా మరో అడుగు ముందుకు వేశాం'

విస్తృతస్థాయిలో సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా ఈ ప్లాట్‌ఫామ్ పర్సనలైజ్‌డ్ రికమండేషన్‌లను వేగంగా అందిస్తూ స్టూడెంట్స్ టైమ్‌ను సేవ్ చేస్తుంది. 'స్టూడెంట్స్ తమకు అవసరమైన కాలేజీని ఎంపిక చేసుకున్న తరువాత, తదుపరి దశ అద్భుతమైన వ్యాసం రాయడం. వివిధ యూనివర్శిటీలకు సంబంధించి 5,000 వ్యాసాలతో మా మోడల్‌కు శిక్షణ ఇచ్చాం. సరియైన కాలేజీని ఎంపిక చేసుకోవడం నుంచి స్కాలర్‌షిప్‌కు అప్లై చేసుకోవడం వరకు మా ప్లాట్‌ఫామ్‌లో అన్నీ ఉచితమే' అంటున్నాడు కౌశిక్.

> యూనివర్శిటీలలో అడ్మిషన్‌లకు సంబంధించి విద్యార్థులకు ఇంటెలిజెంట్ డిజిటల్ అడ్వైజర్‌లుగా సేవలు అందించడమే మా లక్ష్యం.
> – దీర్ఘాయు కౌశిక్, అంబిటియో–సీయీవో, కోఫౌండర్

ఏంజెల్ ఇన్వెస్టర్‌ల ద్వారా కంపెనీ 1.5 కోట్ల నిధులను సమీకరించింది. 'భారత్ మార్కెట్‌లో వేగంగా దూసుకుపోయి మరింతగా విస్తరించాలనేది మా లక్ష్యం' అంటున్నాడు కౌశిక్.

● టెక్.. టాక్

మిల్క్ వే ట్యాబ్



మన దేశ విద్యారంగంలోని కీలకమైన అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రముఖ టెక్ సంస్థల సహకారంతో 'ఎపిక్' ఫౌండేషన్ రూపొందించిన ట్యాబ్ మిల్క్ వే. కొన్ని వివరాలు:
● సైజ్: 8 అంగుళాలు ● రిజల్యూషన్: 1,280×800 పిక్సెల్స్ ● మీడియా టెక్ 8766 ఏ ప్రాసెసర్ ● 4జీబి ర్యామ్/64జీబి ఇంటర్నల్ స్టోరేజ్ ● 5,100 ఎంఏహెచ్

హానర్ మ్యాజిక్ బుక్ 16 ప్రో



సైజ్: 16.00 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 165 హెచ్‌జడ్ **రిజల్యూషన్:** 3072×1920 పిక్సెల్స్ **ఆపరేషన్ సిస్టమ్:** విండోస్ 11 **స్టోరేజ్:** 16జీబి ప్లస్ 512జీబి **సపోర్ట్:** ఫింగర్‌ప్రింట్ సెన్సర్ **బరువు:** 1.75 కేజీ **కలర్స్:** వైట్ పర్పుల్

ఫ్రెండ్ మ్యాప్ ఫీచర్



'ఫ్రెండ్ మ్యాప్' అనే కొత్త ఫీచర్‌పై పనిచేస్తోంది ఇన్‌స్టాగ్రామ్. ప్లాట్‌ఫామ్‌లోని యూజర్‌లకు తమ స్నేహితుల లోకేషన్‌ను చెక్ చేయడానికి ఈ ఫీచర్ ఉపకరిస్తుంది. స్నాప్‌చాట్‌లోని 'స్నాప్ మ్యాప్'ను పోలిన ఫీచర్ ఇది. తమ లొకేషన్‌ను ఎవరు చూడాలో ఎంపిక చేసుకోవడానికి అనుమతిస్తుంది. 'ఫ్రెండ్ మ్యాప్'లో యూజర్ తన చివరి యాక్టివ్ లొకేషన్‌ను దాచే 'ఘోస్ట్ మోడ్' కూడా ఉంటుంది.

స్టిక్కీ నోట్స్



మైక్రోసాఫ్ట్ వారి 'స్టిక్కీ నోట్స్' యాప్ కొత్త హంగులతో ముందుకు వచ్చింది. పాత 'స్టిక్కీ నోట్స్'ను రీవ్యాంప్ చేసి ఎన్నో కొత్త ఫీచర్‌లు తీసుకువచ్చారు. నోట్స్ క్రియేట్ చేయడానికి, స్క్రీన్ షాట్‌లను తీసుకోవడానికి, ఆడియోను రికార్డ్ చేయడానికి ఇది యూజర్‌లను అనుమతిస్తుంది.

● మ్యూజిక్ వరల్డ్


వెన్నెల గీతం



'నా జీవితంలో సంగీతం భాగం అయిపోయింది' అంటుంది అదితి సెహగల్. రాక్ మ్యూజిషియన్ అమిత్ సెహగల్, నటి షెనా గమత్‌ల కుమార్తె అయిన అదితి 'డాట్' పేరుతో కూడా మ్యూజిక్ వరల్డ్‌లో పాపులర్ అయింది. ఆరేళ్ల వయసులో పియానో ప్లే చేయడం నేర్చుకుంది. పన్నెండేళ్ల వయసులో మ్యూజిక్ కంపోజింగ్‌లోకి వచ్చింది. 'ప్రాక్టిస్ రూమ్స్' ఆల్బమ్ ఆమెకు ఎంతో పేరు తెచ్చింది. 'ఎవ్రీబడీ డ్యాన్సెస్ టు టెక్నో' మ్యూజిక్ వీడియో వైరల్ హిట్ అయింది. గాఢమైన స్నేహబంధానికి అద్దం పట్టే 'గర్ల్స్ నైట్' సాంగ్ కూడా అదితికి ఎంతో పేరు తెచ్చింది. 'ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30' తాజా జాబితాలో సంగీత విభాగంలో చోటు సాధించిది అదితి. అదితి సంగీతకారిణి మాత్రమే కాదు మంచి నటి కూడా. జోయా అక్తర్ 'ది ఆర్చీస్' సినిమాలో నటిగా మంచి మార్కులు తెచ్చుకుంది.

పెనిషియస్
చెడు ప్రభావం, హాని కలిగిస్తుంది అనే చెప్పే సందర్భంలో వాడే మాట...పెనిషియస్
ఉదా: ది పెనిషియస్ ఎఫెక్ట్స్ ఆఫ్ ఎయిర్ పోల్యూషన్

పెర్ఫిడీ
నమ్మకద్రోహం, మోసం జరిగిన సందర్భంలో వాడే మాట పెర్ఫిడీ
ఉదా: ఇట్ వాజ్ యాన్ ఎగ్జాంపుల్ ఆఫ్ హిజ్ పెర్ఫిడీ



పెన్యూరీ
కొరత. పేదరికం, వేదన.... మొదలైన సందర్భాలలో ఉపయోగించే మాట పెన్యూరీ.
ఉదా: హీ వాజ్ బ్రాట్ అప్ ఇన్ పెన్యూరీ. విత్‌ఔట్ ఎడ్యుకేషన్

● గేమింగ్

పోరాటమే ఊపిరిగా...



ట్యాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ 'యూనికార్న్ వోవర్‌లార్డ్' మార్చి 8న విడుదల కానుంది. తన జెనోయిరాన్ సామ్రాజ్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి రాజ్యం నుంచి బహిష్కృతుడైన యువరాజు అలైన్ తన మిత్రులను సమీకరించి చేసే పోరాటమే ఈ గేమ్. అలైన్, అతడి బలగాల పోరాటాన్ని గేమ్‌ప్లే ఫాలో అవుతుంది. అన్ని క్యారెక్టర్లు, లొకేషన్‌లు, స్ప్రైట్స్ 2డీ ఆర్ట్‌తో డిస్‌ప్లే అవుతాయి.
జానర్: ట్యాక్టికల్ రోల్–ప్లేయింగ్ **మోడ్:** సింగిల్–ప్లేయర్, మల్టీప్లేయర్
ప్లాట్‌ఫామ్స్: నిన్‌టెండో స్విచ్/ప్లేస్టేషన్ 4/ప్లేస్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

అవును...ఇది నిజమే!



'ది ఫేస్‌బుక్'తో కాలేజీ క్యాంపస్‌లో సెన్సేషన్ క్రియేట్ చేశాడు మార్క్ జుకర్ బర్గ్. ఫేస్‌బుక్ ఎంతోమంది ఇన్వెస్టర్‌ల దృష్టిని ఆకర్షించింది. ఒకప్పుడు పాపులర్ అయిన సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ 'ఫ్రెండ్ స్టర్' ఫేస్‌బుక్‌ను కొనుగోలు చేయడానికి ముందుకువచ్చింది. వచ్చిన బంపర్ ఆఫర్‌లను తిరస్కరించడం ద్వారా మరింత సంచలనం సృష్టించాడు జుకర్ బర్గ్. ఫేస్‌బుక్ అమ్మడంపై కాకుండా 'ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందికి చేరువ కావాలి' అంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు.

సినిమా

గామి చాలా అరుదైన సినిమా

– సందీప్ రెడ్డి వంగా



● సందీప్ రెడ్డి వంగా, విశ్వక్ సేన్

''గామి' ట్రైలర్ చాలా బాగుంది. ఇది చాలా అరుదైన సినిమా అనిపిస్తోంది. ఆరేళ్ల పాటు ఒక సినిమాని అంకితభావంతో చేయడం మామూలు విషయం కాదు. యాక్టర్స్, డైరెక్టర్, నిర్మాతలకు చాలా ప్యాషన్ ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఈ మూవీ సౌండ్ డిజైన్, కలర్ గ్రేడింగ్ చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమాని థియేటర్స్‌లో చూసినప్పుడు మంచి అనుభూతి వస్తుంది'' అని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అన్నారు. విశ్వక్ సేన్, చాందినీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'గామి'. విద్యాధర్ కాగిత దర్శకుడు. వి సెల్యులాయిడ్ సమర్పణలో కార్తీక్ శబరీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 8న విడుదలకానుంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ వేడుకకి సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్ లాంచ్ చేశారు. విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ప్రతి తెలుగు ఫిల్మ్ మేకర్ గర్వంగా చెప్పుకునే సినిమా 'గామి'. మా మూవీ బాగా ఆడితే చాలామంది కొత్త ఫిల్మ్ మేకర్స్ ఇండస్ట్రీకి వస్తారు. తెలుగోళ్ల కాలర్ ఎత్తుకునేలా చేశారు సందీప్ రెడ్డిగారు'' అన్నారు. ''గామి' చూస్తున్నంత సేపూ తర్వాత ఏం జరుగుతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో ఉంటుంది'' అన్నారు విద్యాధర్ కాగిత. ''ఈ సినిమాకి ఫండింగ్ చేసి సపోర్ట్ చేసిన వారికి థ్యాంక్స్'' అన్నారు కార్తీక్ శబరీష్. ''ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'' అన్నారు చాందనీ చౌదరి.

హ్యాపీ... హ్యాపీ



● రణ్‌వీర్, దీపిక


'పేరెంట్స్‌గా ఎప్పుడు ప్రమోట్ అవుతారు?' అనే ప్రశ్నకు పెళ్లయినప్పట్నుంచి చిరునవ్వే సమాధానంగా ఇస్తూ వచ్చారు రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్. ఫైనల్‌గా తాము తల్లిదండ్రులు కానున్నట్లు ఈ భార్యాభర్తలు గురువారం ఇన్‌స్టా వేదికగా వెల్లడించారు. సెప్టెంబర్‌లో డెలివరీ డేట్ ఇచ్చినట్లు దీపిక పేర్కొన్నారు. ఈ హ్యాపీ న్యూస్‌ను సోషల్ మీడియాలో షేర్ చేయగానే పలువురు ప్రముఖులు రణ్‌వీర్–దీపికలకు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు షేర్ చేశారు. ఇక 2013లో 'రామ్‌లీల' సినిమాలో తొలిసారి కలిసి నటించారు రణ్‌వీర్, దీపిక. ఆ సమయంలోనే ఇద్దరి మధ్య ప్రేమ మొదలైందట. ఆ తర్వాత 'పద్మావత్' కోసం రణ్‌వీర్–దీపిక కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఈ చిత్రం 2018 జనవరిలో విడుదల కాగా, అదే ఏడాది నవంబరులో రణ్‌వీర్, దీపిక ఇటలీలో పెళ్లి చేసుకున్నారు.

పది దేశాల్లో భారతీయ దృశ్యం

– హాలీవుడ్ రీమేక్‌కు రంగం సిద్ధం

హాలీవుడ్ తెరపై భారతీయ 'దృశ్యం' ప్రదర్శితమయ్యేందుకు రంగం సిద్ధమవుతోంది. హీరో మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్‌ల కాంబినేషన్‌లో 2013లో ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించిన మలయాళ చిత్రం 'దృశ్యం' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా మలయాళ 'దృశ్యం 2' 2021లో డైరెక్ట్‌గా ఓటీటీలో రిలీజైంది. కాగా 'దృశ్యం' ఫ్రాంచైజీలోని చిత్రాలు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ వంటి కొన్ని భారతీయ భాషల్లో రీమేక్ అయి, ప్రేక్షకులను అలరించాయి. కాగా 'దృశ్యం', 'దృశ్యం 2' చిత్రాలకు సంబంధించిన ఇంగ్లిష్, నాన్ ఇండియన్ లాంగ్వేజెస్ రీమేక్ హక్కులను పనోరమ స్టూడియోస్ ఇంటర్నేషనల్ అధినేత కుమార్ మంగత్ గతంలోనే సొంతం చేసుకున్నారు. (ఫిలిప్పినో, ఇండోనేషియా, సింహళ భాషల హక్కులు కాదు.. ఎందుకంటే ఈ భాషల్లో ఆల్రెడీ 'దృశ్యం' రీమేక్ అయ్యింది). తాజాగా 'దృశ్యం' 'దృశ్యం 2' సినిమాలను హాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు కుమార్ మంగత్ కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. గల్ఫ్ స్ట్రీమ్ పిక్చర్స్, జోట్ ఫిల్మ్స్‌తో కలిసి 'దృశ్యం'ను హాలీవుడ్‌లో రీమేక్ చేయనున్నట్లు తాజాగా కుమార్ మంగత్ వెల్లడించారు. అలాగే రానున్న ఐదేళ్లలోపు 'దృశ్యం' సినిమాను పది దేశాల్లో రీమేక్ చేయాలన్నదే తన లక్ష్యమని కుమార్ వెల్లడించారు. ఇక హిందీ 'దృశ్యం', 'దృశ్యం 2' సినిమాలకు కుమార్ మంగత్ ఓ నిర్మాతగా ఉన్న సంగతి తెలిసిందే. హాలీవుడ్ రీమేక్‌కు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది.

డబుల్ ట్రీట్



● 'శ్వాగ్' లో శ్రీవిష్ణు

బర్త్ డేకి శ్రీ విష్ణు డబుల్ ట్రీట్ అందుకున్నారు. గురువారం (ఫిబ్రవరి 29) శ్రీవిష్ణు బర్త్ డే. ఈ సందర్భంగా ఆయన నటించనున్న రెండు కొత్త చిత్రాలను అధికారికంగా ప్రకటించారు ఆయా మేకర్స్. 'నిను వీడని నీడను నేనే' ఫేమ్ కార్తీక్ రాజు దర్శకత్వంలో శ్రీవిష్ణు హీరోగా ఓ సినిమా తెరకెక్కనుంది. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్‌పై విద్యా కొప్పినీడి, భానుప్రతాప, రియాజ్ చౌదరి ఈ సినిమాను నిర్మిస్తారు. ప్రేమకథతో కూడిన ఫన్ రోలర్ కోస్టర్ మూవీ ఇది. మరోవైపు 'రాజ రాజ చోర' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత శ్రీవిష్ణు, హసిత్ గోలి కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమాకు 'శ్వాగ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ స్వరకర్త.

నా కెరీర్‌లో బెస్ట్ మూవీ ఇది


– అనన్య నాగళ్ల



● ధనుష్ రఘుముద్రి, అనన్య

''తంత్ర' డిఫరెంట్ మూవీ. నా కెరీర్‌లో బెస్ట్ మూవీ అవుతుందనే నమ్మకం ఉంది. ఇకపై నన్ను 'తంత్ర' అనన్య అని పిలుస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనన్య నాగళ్ల. ధనుష్, రఘుముద్రి ప్రధాన పాత్రల్లో శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేష్ బాబు పి, రవి చైతన్య నిర్మించిన చిత్రం హారర్ ఫిల్మ్ 'తంత్ర'. ఈ చిత్రం ఈ నెల 15న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా 'తంత్ర' ట్రైలర్ లాంచ్ వేడుకలో ధనుష్ రఘుముద్రి మాట్లాడుతూ– ''హారర్‌తో పాటు ఈ సినిమాలో రొమాన్స్, సెంటిమెంట్ అంశాలూ ఉన్నాయి'' అన్నారు ''తాంత్రిక శాస్త్రంలోని విస్తుగొలిపే రహస్యాలను చూపించే ప్రయత్నం చేశాం. ప్రతి తాంత్రిక పూజ నెగటివ్ కాదనే అంశాన్ని కూడా చూపించాం'' అన్నారు శ్రీనివాస్ గోపిశెట్టి. ఈ సినిమా సంగీత దర్శకుడు ఆర్‌ఆర్ ధ్రువన్ మాట్లాడారు.

థ్రిల్ చేయడం ఖాయం



● శివ కందుకూరి

అద్భుతమైన మైథలాజికల్ కంటెంట్‌తో చేసిన 'భూతద్ధం భాస్కర్ నారాయణ' ప్రేక్షకులను థ్రిల్ చేయడం ఖాయం'' అని హీరో శివ కందుకూరి అన్నారు. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా నటించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. శివ కందుకూరి మాట్లాడుతూ– ''క్రైమ్, డిటెక్టివ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. దిష్టి బొమ్మ గురించి పురాణాల్లో ఒక కథ ఉంది. దాన్ని ఈ చిత్రకథకు అద్భుతంగా జోడించి తీశాడు పురుషోత్తం రాజ్. ఇందులో నేను చేసిన డిటెక్టివ్ భాస్కర్ నారాయణ పాత్ర విభిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం శర్వానంద్ హీరోగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించిన సినిమాలో సెకండ్ లీడ్‌గా చేశాను. అలాగే నేను హీరోగా కొత్త దర్శకుడు ప్రమోద్‌తో ఓ సినిమా, మరో రెండు సినిమాలు ఒప్పుకున్నాను'' అన్నారు.

గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ మృతి



ప్రముఖ సినీ, జానపద నేపథ్య గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూశారు. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం సికింద్రాబాద్‌లోని తన నివాసంలో మృతి చెందారు. వడ్డేపల్లి శ్రీనివాస్ దాదాపు 100కి పైగా పాటలు, జానపద గేయాలు పాడారు. 2012లో విడుదలైన 'గబ్బర్ సింగ్' సినిమాలోని 'గన్నులాంటి కన్నులున్న జున్నులాంటి పిల్ల..' పాటతో బాగా పాపులర్ అయ్యారు శ్రీనివాస్. అదే విధంగా నాగార్జున 'కింగ్' చిత్రంలో 'ఎంత పని చేస్తివిరో..' పాటతో యువతని ఆకట్టుకున్నారు. 'కిక్, బెంగాల్ టైగర్, నమస్తే అన్న' వంటి పలు సినిమాల్లో పాటలు పాడారు. పలు వేదికలపై తనదైన ఆటపాటలతో అలరించారాయన. వడ్డేపల్లి శ్రీనివాస్ మృతిపై పలువురు సినీ, జానపద కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు.



వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం

శాలివాహన, దేవాంగ నాయకుల పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని, అన్నివర్గాల పేదలను సంపూర్ణంగా ఆదుకుంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకుందామని శాలివాహన, దేవాంగ నేతలు పిలుపునిచ్చారు. గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శాలివాహన, దేవాంగుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎంతమందితో పొత్తు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు అగ్రవర్ణ పేదలందరి జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ప్రత్యక్ష నగదు బదిలీ పథకంతో నేరుగా రూ.లక్షల కోట్లు లబ్ధి చేకూరుతోందన్నారు. ఈ కారణంగానే సీఎం జగన్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారన్నారు. దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌ను నేరుగా ఎదుర్కోలేక టీడీపీ, జనసేన పొత్తులతో వస్తూ.. ఇంకా బలం సరిపోక బీజేపీ దోస్తీ కోసం అర్రులు చాస్తున్నాయన్నారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్, ఉనికి కోల్పోయిన సీపీఐ, సీపీఎంతో పరోక్షంగా జతకట్టిన టీడీపీ, జనసేన జగన్‌ను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కనకరావు మాదిగ, దేవాంగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డీకే నాగరాజు, ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, నవరత్నాల అమలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఏపీ ఆదర్శం



వ్యవసాయ పథకాలపై ఏపీ రైతులకే ఎక్కువ అవగాహన

- అన్ని పథకాలపై అవగాహనకు రైతు భరోసాయే మూలం
- ఈ పథకాన్ని జగన్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోంది

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గ్రామ స్థాయిలో నెలకొల్పిన వలంటీర్లు, రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) వ్యవస్థ రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుస్తున్నాయి. రైతులకు అవసరమైన మందులు, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలతో పాటు ప్రభుత్వ పథకాలను కూడా అన్నదాతలకు చేరువ చేస్తున్నాయి. వీటితో పాటు వ్యవసాయ అధికారులూ క్షేత్రస్థాయిలో రైతులకు అన్ని విధాలుగా సహాయ పడుతున్నారు. మరీ ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టి, సమర్థంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం రైతుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇతర పథకాలపైనా పూర్తి స్థాయిలో అవగాహన పెరగడానికి దోహదపడింది. ఈ పథకాలను ఏపీ రైతులు సమర్థంగా వినియోగించుకుంటున్నారు. పథకాల అమలు, రైతులకు అవగాహన కల్పించడంలో ఆంధ్రప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ పథకాలపై రైతుల అవగాహనపై నాబార్డు నిర్వహించిన సర్వే ఈ విషయాలను వెల్లడించింది. ప్రధానంగా రుణాలు, బీమా, నిల్వ, మార్కెటింగ్‌పై రైతుల్లో అవగాహన, రైతులకు పథకాల అనుకూలత తదితర అంశాలపై నాబార్డు సర్వే నిర్వహించి, నివేదిక విడుదల చేసింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాల పట్ల దేశంలో ఇతర రాష్ట్రాలకన్నా ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు అత్యధిక అవగాహన ఉందని ఈ సర్వే తెలిపింది.

రైతులకు సీఎం జగన్ ఇచ్చిన 'భరోసా'

ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న రైతు భరోసా పథకం పట్ల రైతుల్లో సానుకూలత నెలకొందని, వారికి ఈ పథకం ప్రయోజనకరంగా ఉందని సర్వే పేర్కొంది. కిసాన్ క్రెడిట్ కార్డు (కేసీసీ)ల పట్ల ఏపీ రైతుల్లో అత్యధికంగా 86 శాతం అవగాహన ఉందని, మహారాష్ట్రలో కేవలం 27 శాతమే అవగాహన ఉందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రైతుల్లో పంటల బీమా పథకాల పట్ల అత్యధిక అవగాహన ఉందని తెలిపింది. ఇందుకు ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయడమేనని పేర్కొంది. దీంతో పాటు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల పట్ల కూడా ఏపీ రైతుల్లో పూర్తిస్థాయిలో అవగాహన ఉందని చెప్పింది. పంటల బీమా పథకంపై ఏపీ రైతుల్లో 83 శాతం, రాజస్థాన్ రైతుల్లో 66 శాతం అవగాహన ఉందని తెలిపింది.

ఇతర రాష్ట్రాలకు ఏపీనే ఆదర్శం

వివిధ పథకాలు, పంటల బీమా అమలు, అవగాహనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఇతర రాష్ట్రాలకు ఓ మంచి ఉదాహరణ అని నాబార్డు తెలిపింది. ఏపీలో ప్రతి గ్రామంలో వ్యవసాయ అధికారి ఉన్నారు. ఆ అధికారి ప్రతి నెలా రైతులకు సంబంధించిన పథకాలపై సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. రైతు భరోసా కేంద్రాల వారీగా గ్రామ స్థాయిలో వలంటీర్లు ప్రతి గ్రామంలో సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ రైతులకు అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. వివిధ పథకాలపై రైతులతో దరఖాస్తులు చేయించడం, పునరుద్ధరణ, సమస్యలు, క్లెయిమ్స్ పరిష్కారాల్లో వలంటీర్లు సహకరిస్తున్నారు. అలాగే ఈ-క్రాప్ పోర్టల్ –అప్లికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో రైతులు, పంటలు మొదలైన వాటి గురించి సమాచారం ఉంటుంది. పంటల బీమా, క్లెయిమ్‌ల సమాచారం పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రైతులు సాగు కోసం చేసిన వ్యయం, క్లెయిమ్ మొత్తాన్ని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతులకు క్లెయిమ్ మొత్తాన్ని బదిలీ చేస్తోంది. ఇది ఈ-యాప్‌తో సాధ్యమవుతోంది అని నాబార్డు తెలిపింది. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం, పథకాలను వినియోగించుకోవడంలో రైతుల్లో అవగాహన చాలా బాగుందని, ఇది రైతు భరోసా కేంద్రాల ఫలితమేనని నాబార్డు సర్వే వివరించింది.

2047 నాటికి విశ్వగురువుగా భారత్

రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు జి.సతీష్‌రెడ్డి



మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

తిరుపతి సిటీ (తిరుపతి జిల్లా): రక్షణ రంగంలో 2047 నాటికి భారత్ విశ్వగురువుగా వెలుగొందుతుందని రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి చెప్పారు. తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్‌లో అఖిల భారత రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమీషియన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జరిగిన 'ఆత్మ నిర్భర భారత్ ఇన్‌సైన్స్ అండ్ టెక్నాలజీ' అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రక్షణ రంగంలో భారత్ పది ఏళ్లలో అద్భుతమైన ఆవిష్కరణలు చేసి పరిశోధనలు జరిపిందన్నారు. రక్షణ పరికరాలు కొనుగోల్లో విదేశాలపై ఆధారపడటం తగ్గిందని చెప్పారు. సైనిక రంగానికి అవసరమైన పరికరాలు, ఆయుధాలు స్వయం శక్తితో, దేశీయ పరిజ్ఞానంతో చేస్తున్నామన్నారు. రక్షణ పరికరాలను విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారత్ ఎదగడం గర్వకారణమన్నారు. దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ప్రపంచంలోని ఏ దేశం కూడా భారత్‌పై దాడి చేసే సాహసం చేయలేదన్నారు. ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటన కార్యదర్శి గుంత లక్ష్మణ్, ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు వైవీ రామిరెడ్డి, వాణి, వాయిస్ ఆఫ్ తిరుపతి కన్వీనర్ ప్రొఫెసర్ రాజశేఖర్, సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూకు రెండు పేటెంట్‌లు

- మెషీన్ లెర్నింగ్ సాయంతో కచ్చితత్వంతో వ్యాధి నిర్ధారణ
- రహస్య సమాచారాన్ని సురక్షితంగా పంపించేలా టెక్నాలజీ అభివృద్ధి



పేటెంట్ సర్టిఫికెట్లతో వీసీ ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రెండు అంతర్జాతీయ పేటెంట్‌లు లభించాయి. ఏయూలోని అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, డాక్టర్ కె.వెంకటలక్ష్మి.. మెషీన్ లెర్నింగ్ సాయంతో బయో మెడికల్ ఇమేజ్ విశ్లేషణ చేసి కచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేసే విధానాన్ని అభివృద్ధి చేసినందుకు పేటెంట్ మంజూరైంది. తొలి దశలోనే వ్యాధి నిర్ధారణ చేయడం వల్ల రోగికి సకాలంలో చికిత్స అందించి.. దానిని నయం చేయవచ్చు. తొలుత భారత పేటెంట్ ఆఫీస్ దీనిని పబ్లిష్ చేయగా, దక్షిణాఫ్రికా దీనికి పేటెంట్ మంజూరు చేసింది. ఉద్దానంలో కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారి నుంచి సేకరించిన డేటాను.. దీనితో అనుసంధానం చేస్తామని జేమ్స్ స్టీఫెన్ చెప్పారు. అలాగే ఎం.జేమ్స్ స్టీఫెన్, పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, ఇనకోటి రవికుమార్.. రహస్య సమాచారాన్ని నెట్‌వర్క్ ఆధారంగా పంపే సమయంలో ప్రత్యేక కోడ్‌ను ఉపయోగించడం ద్వారా సురక్షితంగా పంపించే విధానాన్ని అభివృద్ధి చేసినందుకు పేటెంట్ లభించింది. రక్షణ రంగంలో, పరిశ్రమలు, ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారాలను సురక్షితంగా పంపించడానికి ఈ నూతన సాంకేతికత ఎంతో ఉపయోగపడుతుంది. దేశంలోనే తొలిసారిగా ఏయూలోని అంబేడ్కర్ చైర్ పేరుతో రెండు పేటెంట్‌లను సాధించామని జేమ్స్ స్టీఫెన్ ఆనందం వ్యక్తం చేశారు. ఇది ఏయూకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువస్తుందన్నారు. కాగా, ఏయూను అంబేడ్కర్ ఫౌండేషన్ అధికారులు అభినందించారు.

రాజధాని పేదల పక్షపాతి జగన్

1,250వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: రాజధాని ప్రాంతంలో కూలి పనులు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదల జీవనభృతి రూ.2,500 నుంచి రూ.5వేలకు పెంచుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయడం పట్ల ఈప్రాంతంలో జనం నీరాజనాలు పడుతున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,250వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. చంద్రబాబు రాజధానిని పెట్టుబడిదారీ వర్గానికి పరిమితం చేయాలనే దురాశతో అమరావతి పేరుతో అడ్డగోలు జీవోలు ఇచ్చి.. పేదలను ఈప్రాంతం నుంచి తరిమి కొట్టాలనుకున్నాడన్నారు. కాని సీఎం జగన్ పేదల పక్షాన నిలిచి తమకు మేలు చేశారన్నారు. అమరావతి అభివృద్ధికి చంద్రబాబే అడ్డంకి అనేందుకు పేదలకో ప్యాకేజీ, పెద్దలకు మరో ప్యాకేజీ ఇచ్చి చూపించిన వివక్షే కారణమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పల్లెబాబు, కొమరవల్లి కిషోర్‌బాబు, కారుమూరి పుష్పరాజు, బొలిమేర సామేలు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి: కమిషనర్ నివాస్

సాక్షి, అమరావతి: మహిళల్లో గర్భాశయ ఆరోగ్యంపై వైద్యశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ తెలిపారు. ఈ క్రమంలో 'గర్భాశయాన్ని సంరక్షించు' పేరిట ప్రచార కార్యక్రమాన్ని వైద్య శాఖ చేపడుతోందన్నారు. ఈ ప్రచారానికి సంబంధించి బేయర్–జైడస్ ఫార్మాతో గురువారం మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ నివాస్ ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తొలిదశలో విశాఖపట్నం జిల్లా, రెండో దశలో అన్ని జిల్లాలకు కార్యక్రమాన్ని విస్తరిస్తామని వివరించారు. గైనకాలజిస్టులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. బేయర్–జైడస్ ప్రతినిధి దీపక్ పాల్గొన్నారు.

ముంపు ప్రాంతంలో ఉన్నందునే ఓట్ల మార్పు

- ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే చేశాం
- ఓట్ల మార్పునకు, ప్యాకేజీకి సంబంధం లేదు
- ఆర్అండ్ఆర్ కాలనీని సందర్శించిన రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్



నిర్వాసితులతో మాట్లాడుతున్న రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

గోకవరం: అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నంలోని పోలింగ్ బూత్ పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతంలో ఉందని.. అందువల్లే నిర్వాసితుల ఓట్లను వారు నివాసముంటున్న ప్రాంతంలోకి మార్చినట్లు రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్ చెప్పారు. ఈ ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేశారు. దీనికి, ప్యాకేజీకి ఎలాంటి సంబంధం లేదని.. అలాంటి అపోహలు పెట్టుకోవద్దని నిర్వాసితులకు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలో పోలవరం నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీని గురువారం ఆయన సందర్శించారు. నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం 670 మందికి గానూ 605 మందికి ప్యాకేజీ అందిందని చెప్పారు. మిగిలిన వారికి కూడా వేగంగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవీపట్నం, తొయ్యేరు నిర్వాసితుల ఓట్ల మార్పుపైనా సబ్ కలెక్టర్ స్పందించారు. ఓటర్లు తమ సమీపంలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుందన్నారు. 2021లో రేషనలైజేషన్ ప్రకారం బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా తొయ్యేరు, దేవీపట్నం ప్రజలకు కూడా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి.. వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాతే ఓట్లను మార్చామని చెప్పారు. దీని వల్ల ఆర్అండ్ఆర్ కాలనీ వాసులకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. వారి సమీపంలోని పోలింగ్ బూత్‌లోనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లభించిందన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. 2023–24 వరకూ పేరుకుపోయిన పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ ప్రకటించి ఊరట కల్పించింది. పన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ గురువారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ఏడాదితో పాటు, గతంలోని పన్ను బకాయిలను వన్ టైం సెటిల్‌మెంట్(ఓటీఎస్)లో చెల్లించే వారికి వడ్డీ మాఫీ కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు వచ్చే మార్చి 31లోగా ఓటీఎస్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రాయితీ చేసిన వడ్డీ మొత్తాన్ని భవిష్యత్‌లో చెల్లించాల్సిన ఆస్తిపన్నులో సర్దుబాటు చేస్తామన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటకంలో నవశకం

- అందుబాటులోకి వచ్చిన టూరిజం సర్క్యూట్ బస్సులు
- 12 బస్సుల్ని విశాఖలో ప్రారంభించిన మంత్రి రోజా
- 6 బస్సుల్ని విజయవాడలో ప్రారంభించిన మంత్రి కొట్టు సత్యనారాయణ



ప్యాకేజీ టూర్ల బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: ప్రసిద్ధ ఆలయాల్ని భక్తులు దర్శించుకునేలా పర్యాటక, దేవదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నవశకానికి నాంది పలికింది. ప్రభుత్వం అభివృద్ధి చేసిన ఆధ్యాత్మిక పర్యాటకంతో (టెంపుల్ టూరిజం) సర్క్యూట్ సేవలు గురువారం ప్రారంభమయ్యాయి. యాత్రికుల కోసం విశాఖలో 12 బస్సుల్ని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, విజయవాడలో 6 బస్సుల్ని దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. శీఘ్ర దర్శనం, విశేష పూజా టికెట్లు, అభిషేకం, వ్రతాలు మొదలైన అన్నిరకాల టికెట్లను భక్తులకు అందుబాటులో ఉంచుతారు. తిరుమల, శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి, శ్రీకాళహస్తి, అన్నవరం, సింహాచలం, అరసవల్లి, శ్రీకూర్మం, పంచారామ క్షేత్రాలు, పిఠాపురం తదితర ప్రసిద్ధ ఆలయాలను అనుసంధానం చేస్తూ 18 ప్రత్యేక ప్యాకేజీలు సిద్ధం చేశారు. భక్తులకు ముఖ్యమైన దేవాలయాల్ని, తిరుమలలో బ్యాక్ ఎండ్ సర్వీసులను ప్యాకేజీల్లో అనుసంధానం చేశారు. పలు ప్యాకేజీల్లో అరకు, బొర్రా గుహలు సందర్శనీయ స్థలాల్ని కూడా పొందుపరిచారు. బస్సులు, హోటల్స్, బోటింగ్ మొదలైన అందుబాటులో ఉన్న ఏపీటీడీసీ హోటల్స్, రిసార్టులకు బుకింగ్‌లో అధిక ప్రాధాన్యత కల్పించారు.

ఆధ్యాత్మిక పర్యాటకానికి పెద్దపీట: మంత్రి కొట్టు

విజయవాడలో వాహనాలను ప్రారంభించిన అనంతరం మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక పర్యాటకానికి పెద్దపీట వేస్తూ భక్తులకు ప్రముఖ ఆలయాల దర్శనాలను సులభతరం చేయటంలో భాగంగా ఏపీ టీడీసీతో కలిసి ప్రత్యేక ప్యాకేజీలు తీసుకొచ్చామన్నారు. నిత్యం 18 సర్క్యూట్లలో 20 ఆలయాల దర్శనాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఏపీ టీడీసీ ఈడీ ఏఎల్ పద్మావతి, జనరల్ మేనేజర్ (ట్రాన్స్ పోర్ట్) శ్రీధర్, డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి ఆధ్యాత్మిక పర్యాటకం: రోజా

విశాఖ బీచ్ రోడ్డులో సర్క్యూట్ బస్సుల్ని ప్రారంభించిన సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి రోజా మాట్లాడుతూ.. ఏపీలో ఆధ్యాత్మిక పర్యాటకాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నూతన సర్క్యూట్ టూరిజం ప్యాకేజీలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలోని ముఖ్యమైన, చారిత్రాత్మక ఆలయాలను అనుసంధానం చేయడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటక సేవల్ని అందరికీ అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. ఏపీటీడీసీ వెబ్‌సైట్‌లో 'బుక్ మై దర్శన్' ద్వారా ప్యాకేజీల్ని ఎంపిక చేసుకునే అవకాశాన్ని యాత్రికులకు కల్పించామన్నారు.

నేటి నుంచి వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ

65.92 లక్షల మంది పింఛనుదారులకు రూ.1,958.52 కోట్ల విడుదల

- సీఆర్‌డీఏ పరిధిలో భూమిలేని నిరుపేదల పింఛను రూ.2,500 నుంచి రూ.5.000లకు పెంపు
- ఐదు రోజుల్లో నూరు శాతం పింఛన్లు పంపిణీ చేయనున్న వలంటీర్లు
- డీఆర్‌డీఏ కాల్ సెంటర్ల ద్వారా పంపిణీ పర్యవేక్షణ
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వెల్లడి



సాక్షి, అమరావతి: వైఎస్సార్ పెన్షన్ కానుక కింద 65.92లక్షల మంది సామాజిక పింఛను లబ్ధిదారులకు శుక్రవారం నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ నెల నుంచి సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న భూమి లేని నిరుపేదల పెన్షన్‌ను రూ.2,500 నుంచి రూ.5,000లకు పెంచినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ) బూడి ముత్యాలనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి నెల పింఛన్‌ను మార్చి ఒకటో తేదీన నేరుగా లబ్ధిదారుల చేతికి వారి ఇంటి వద్దే అందించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పంలో భాగంగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేరకు పింఛన్ల కోసం ప్రభుత్వం రూ.1,958.52 కోట్లను ఇప్పటికే విడుదల చేసిందని ఆయన వివరించారు. ఈ నగదును గ్రామ, వార్డు సచివాలయాలకు పంపిణీ చేశామని, సచివాలయాల ద్వారా వలంటీర్లు తీసుకువెళ్లి పింఛనుదారులకు వారి ఇంటి వద్ద నేరుగా అందిస్తారని తెలిపారు. ఇందుకోసం 2.66 లక్షల మంది వలంటీర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు పింఛను అందజేసే సమయంలో గుర్తింపు కోసం ఆధార్ నిర్ధారిత బయోమెట్రిక్, ఐరిస్, ముఖ ప్రమాణీకరణ విధానాలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. అలాగే ఆర్‌బీఐఎస్ విధానం కూడా అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఏ ఒక్కరికీ పింఛను అందలేదనే ఫిర్యాదు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో పింఛన్లను నూరు శాతం పంపిణీ చేయాలని వలంటీర్లను ఆదేశించామని తెలిపారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియలో 15వేల మంది వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శులు భాగస్వాములు అవుతారని, రాష్ట్రంలోని 26 జిల్లాల డీఆర్‌డీఏ కార్యాలయాల్లో ఉన్న కాల్ సెంటర్ ద్వారా పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తామని ముత్యాలనాయుడు వివరించారు.

రుషికొండ భవనాల వినియోగంపై త్వరలోనే నిర్ణయం

- హరిత రిసార్ట్‌ల స్థానంలో వీటిని నిర్మించాం
- ఈ ప్రపంచ స్థాయి నిర్మాణాలు విశాఖకే తలమానికం
- ఇందులో సీఎం క్యాంపు కార్యాలయం ఉంటే మంచిదని త్రిమెన్ కమిటీ సూచించింది
- మంత్రులు ఆర్కే రోజా, గుడివాడ అమర్‌నాథ్
- రుషికొండ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుని ప్రారంభించిన మంత్రులు
- హాజరైన శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



ప్రాజెక్టు ప్రారంభిస్తున్న మంత్రులు రోజా, అమర్‌నాథ్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: విశాఖ నగరంలోని రుషికొండపై నిర్మించిన భవనాలను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై త్వరలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వెల్లడించారు. రుషికొండపై నిర్మించిన ఆ భవనాలను విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద సరస్వతితో కలిసి మంత్రులు అమర్‌నాథ్, రోజా, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు అమర్‌నాథ్, రోజా మీడియాతో మాట్లాడుతూ.. రుషికొండపై 9.88 ఎకరాల్లో టూరిజం ప్రాజెక్టు నిర్మించామని, గతంలో ఈ ప్రాంతంలో ఉన్న హరిత రిసార్టుల స్థానంలో ఈ నిర్మాణాలు జరిగాయన్నారు. అత్యంత సుందరమైన విశాఖ నగరానికి తగ్గట్లుగా పూర్తి అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ భవన నిర్మాణాలు సాగాయని తెలిపారు. పర్యాటకంగా విశాఖను తీర్చిదిద్దడంలో భాగంగా రూపుదిద్దుకున్న ఈ భవనాలు నగరానికే తలమానికమన్నారు. ఈ భవన నిర్మాణాలకు అనేక అడ్డంకులు కల్పించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ అనేక కుట్రలు పన్నాయని, వాటన్నింటినీ దాటుకుంటూ ప్రాజెక్టును పూర్తిస్థాయి అనుమతులతో పూర్తిచేశామని వారు వివరించారు. విశాఖపట్నం రాజధానిగా చేయాలని సంకల్పించిన సీఎం వైఎస్ జగన్ ఈ విషయంపై ఇప్పటికే ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో త్రీమెన్ కమిటీని ఏర్పాటుచేశారన్నారు. ఇందులో సీఎం క్యాంపు కార్యాలయం ఉంటే మంచిదని ఆ కమిటీ సూచించిందని మంత్రి రోజా అన్నారు. అయితే, ఈ భవనాల్ని పూర్తిగా పర్యాటకం కోసం వినియోగించాలా? లేదా ముఖ్యమంత్రి కార్యాలయంగా ఉపయోగించాలా? అన్న అంశంపై త్వరలోనే స్పష్టత వస్తుందని మంత్రి అమర్‌నాథ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ చైర్మన్ డా.ఎ. వరప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్మన్ సుభద్ర, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, కె.రవిబాబు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డా.రజత్‌భార్గవ, మేనేజింగ్ డైరెక్టర్ కె.కన్నబాబు, జేసీ కె.మయూర్ అశోక్, పర్యాటక శాఖ ఆర్.డి. శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ లొడగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు వివరాలివీ..

- నూతన రిసార్ట్స్‌ని 9.88 ఎకరాల విస్తీర్ణంలో 1,48,413 చ.అడుగుల విస్తీర్ణంలో ఏడు బ్లాకులుగా నిర్మించారు.
- అంతర్జాతీయ ప్రమాణాలతో పచ్చదనం, ల్యాండ్ స్కేపింగ్ పనులతో వీటిని అభివృద్ధి చేశారు. రహదారులు, డ్రైనేజీ, నీటిసరఫరా, వీధిదీపాలు, పార్కింగ్, ఇతర మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేశారు.
- 2021లో సీఆర్‌జెడ్ ఆమోదం, 2022లో స్థానిక సంస్థల ఆమోదం, 2023లో అగ్నిమాపక శాఖ ఎన్ఓసీ కూడా తీసుకోవడంతో పాటు సంబంధిత చట్టబద్ధమైన ఆమోదాలు తీసుకున్నారు.
- వేంగి–ఏ, బీ, కళింగ, గజపతి, విజయనగర ఏ, బీ, సీ బ్లాకులుగా మొత్తం ఏడు బ్లాక్‌లు నిర్మించారు. వీటిల్లో రిసెప్షన్, రెస్టారెంట్లు, బ్యాంక్వెట్ హాల్స్, గెస్ట్‌రూమ్‌లు, ప్రీమియం విల్లా సూట్స్, స్పా, ఇండోర్ గేమ్స్, ఫిట్‌నెస్ సెంటర్, బ్యాక్‌ఆఫీస్, సర్వీస్ ఏరియాలు అభివృద్ధి చేశారు.
- నీటి సరఫరా సౌకర్యం కోసం 150 కేఎల్, ఫైర్ సంప్, పైప్ నెట్‌వర్క్‌తో పాటు 100 కేఎల్ డొమెస్టిక్ సంప్ ఏర్పాటుచేశారు.
- వ్యర్థ జలాల శుద్ధి, పునర్వినియోగం కోసం 100 కేఎల్‌డీ మురుగునీటి శుద్ధి ప్లాంట్ కూడా నిర్మించారు.
- 1,000 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 2, 1010 కేవీఏ జనరేటర్లు 3, ఎలక్ట్రికల్ కాంపోనెంట్ పనులు, వీధిదీపాలు ఏర్పాటుచేశారు.
- రిసార్ట్ అభివృద్ధికి స్థలం చదును చేయడం, నిర్మాణం, మౌలిక సదుపాయాలు.. ఇలా మొత్తం ప్రాజెక్టుకు రూ.365.24 కోట్లు ఖర్చుచేశారు.
- వేంగి–ఏ బ్లాక్‌లో సెక్యూరిటీ, బ్యాక్ ఆఫీస్, సూట్ రూమ్‌లు, రెస్టారెంట్స్ ఉన్నాయి.
- వేంగి–బీ బ్లాక్‌లో అతిథి గదులు, సమావేశ మందిరాలు, రెస్టారెంట్‌తో కూడిన బిజినెస్ హోటల్ ఉంది.
- కళింగ బ్లాక్‌లో రిసెప్షన్, వెయిటింగ్ ఏరియా, లగ్జరీ సూట్ రూమ్‌లు, కాన్ఫరెన్స్ హాల్స్, బ్యాంక్వెట్ హాల్స్ ఉన్నాయి.
- గజపతి బ్లాక్‌లో హౌస్ కీపింగ్, కేఫ్టేరియా, వ్యాపార కేంద్రాలున్నాయి.
- విజయనగరం–ఏ, బీ, సీ బ్లాక్‌లలో ప్రెసిడెన్షియల్ సూట్, విల్లా సూట్స్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్, బ్యాంక్వెట్ హాల్స్ ఏర్పాటుచేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400 708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

రైతు సమస్యలను పరిష్కరించాలి



ట్రాక్టర్లతో రైతు సంఘం నేతల నిరసన ర్యాలీ

కంప్లి: ఒకవైపు వర్షాలు లేక సాగును నిలిపివేసి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని నిరసిస్తూ తాలూకాలో రైతు సంఘం నేతలు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రైతు సంఘం రాష్ట్ర సమితి గౌరవ అధ్యక్షులు సీ. మాలిపాటిల్ మాట్లాడుతూ... కరువు పరిహారం ప్రకటించిన నెలలు గడుస్తున్నా పరిహారం రాలేదన్నారు. వర్షాలు లేక రాష్ట్రంలో జలాశయాల పరిస్థితి ఎండిపోయాయని, తుంగభద్ర జలాశయం నీటి పరిస్థితి మరింత భయంకరంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సండూరు తాలూకా ప్రముఖులు రైతు సంఘం పదాధికారులు ఊరేగింపులో పాల్గొన్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

కంప్లి: అనుకున్న గడవులోగా పనులు పూర్తి చేసి వంద పడకల ఆస్పత్రిని ప్రజల వినియోగానికి తీసుకురావాలని జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. గురువారం ఆయన కంప్లి పట్టణంలో రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆస్పత్రిని పరిశీలించి మాట్లాడారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

స్పిరిట్ ట్యాంకర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ట్యాంకర్

హుబ్లీ: ఎక్సైజ్ అధికారులు స్పిరిట్ ట్యాంకర్‌ను గురువారం పట్టుకున్నారు. రూ. 25 లక్షల విలువ చేసే అక్రమ స్పిరిట్ ట్యాంకర్‌ను కలగటిగి తాలూకా దేవికొప్ప గ్రామం వద్ద స్వాధీనం చేసుకొన్నారు. ధార్వాడా నుంచి అంకోల మీదుగా గోవాకు వెళ్తుండగా అనుమానించిన కలగటిగి ఇన్‌స్పెక్టర్ ఆ వాహనాన్ని పరిశీలించగా స్పిరిట్ తేలింది. అంతేకాకుండా లోడుకు సంబంధించి పత్రాలు లేని కారణంగా వాహనంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు ఎక్సైజ్ డీసీ అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ వాహనానికి రెండు నెంబర్ ప్లేట్లు ఉన్నట్లు గుర్తించారు.

బంజారాల అభివృద్ధి అభినందనీయం

కంప్లి: పూర్వీకులు చూపిన సన్మార్గంలో ముందుకు సాగుతున్న బంజార సముదాయం సామాజికంగా అభివృద్ధి పథంలో సాగుతున్నారని అది అభినందనీయమని బంజారా సముదాయ మఠద ఓంకార శివాచార్యులు తెలిపారు. అరసికేరి పరిధి కడెకల్ తండాలో సంత్ సేవాలాల్, మరియమ్మదేవి దేవస్థాన కళా సాధారణ, మూర్తి ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ప్రాతినిత్యం వహించి మాట్లాడుతూ శ్రమికులైనా బంజార సమాజ ప్రజలు ప్రభుత్వ యోజనలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన



కంప్లి: కంప్లి సమీపంలోని కల్లుకంబ మేఘనా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు సౌరమండలం, మానవ శరీరం, వాటి కార్యకలాపాలపై నిర్వహించిన ప్రదర్శన అబ్బురపరిచింది. పాఠశాల ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను ప్రశంసించింది.

వైభవంగా నీరమాన్వి యల్లమ్మ జాతర

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా నీరమాన్విలో యల్లమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాయచూరుతో పాటు లింగసుగూరు, సింధనూరు, మాన్వి, ఆదోని, కర్నూలు, హైదరాబాద్, మహబూబ్ నగర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

బయో డీజిల్ అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా స్వామి

రాయచూరు రూరల్: రాష్ట్ర బయోడీజిల్ అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా రాయచూరుకు చెందిన రాజశేఖర్ రామస్వామిని నియమిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదేశాలు జారీ చేశారు. గురువారం గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే సిఫార్సుల మేరకు రామస్వామి నియమితులయ్యారు.

వ్యవసాయంపై పరిశోధనలు జరపాలి



స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్

- రాయచూరు వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండ ఇతర దేశాలతో పోటీ పడే విధంగా వ్యవసాయంపై ఆధునిక పరిశోధనలు చేయాలని రాష్ట్ర గవర్నర్, చాన్స్‌లర్ థావర్‌చంద్ గెహ్లాట్ పిలుపునిచ్చారు. గురువారం రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయం 13వ స్నాతకోత్సవాన్ని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతికతను అభివృద్ధి పరచుకోవాలన్నారు. నేడు పర్యావరణం, జల సంరక్షణ, వాయు సంరక్షణలపై ఆలోచన చేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఢిల్లీ ఐసీఏఆర్ సభ్యుడు ఝూ మాట్లాడుతూ... ప్రతి పంచాయతీకి వ్యవసాయ ఇంజినీర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులకు పట్టాలు, 26 మందికి డాక్టరేట్ పట్టాలను అందించారు. వేడుకలో వీసీ హనుమంతప్ప, రిజిస్ట్రార్ వీరన గౌడ, అధికారులు పాల్గొన్నారు.



ఐదు బంగారు పతకాలు సాధించిన శోభా



నాలుగు బంగారు పతకాలతో దివ్యా

బుడా అధ్యక్షుడుగా ఆంజనేయులు



బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులను సన్మానిస్తున్న దృశ్యం

- రెండోసారి ఛాన్స్
- మంత్రి, ఎమ్మెల్యే వర్గీయులకు మొండిచేయి

సాక్షి,బళ్లారి: బళ్లారి నగరాభివృద్ధి ప్రాధికార (బుడా) అధ్యక్షుడుగా జే.ఎస్ ఆంజనేయులు రెండోసారి ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సంబంధిత అధికారి జే.ఎస్ ఆంజనేయులు బళ్లారి బుడా అధ్యక్షుడుగా ఎంపికైనట్లు ప్రకటించారు. దీంతో గురువారం సాయంత్రం బుడా కార్యాలయంలో కమిషనర్ సమక్షంలో జేఎస్ ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ...నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో బెస్టు స్కూల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయ నాయకుడు మరిస్వామిరెడ్డి, కార్పొరేటర్లు, మాజీ మేయర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జేఎస్‌కు రెండోసారి చాన్స్

ఈయన గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కూడా బుడా అధ్యక్షుడుగా పనిచేశారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి నగర ఎమ్మెల్యే టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి రావడంతో పాటు, బళ్లారి జిల్లాలో ఐదు స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఘన విజయం సాధించారు. బళ్లారి గ్రామీణ ఎమ్మెల్యే నాగేంద్ర రాష్ట్ర మంత్రి పదవి కూడా వరించడంతో పాటు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పదవి కూడా దక్కింది. ఈ నేపథ్యంలో మంత్రి, ఎమ్మెల్యే వర్గానికి చెందిన బలమైన కాంగ్రెస్‌పార్టీ నాయకులు బుడా అధ్యక్ష స్థానంపై కన్నేశారు. తమకే బుడా అధ్యక్ష స్థానం దక్కుతుందని ప్రచారం కూడా చేసుకున్నారు. మంత్రి, ఎమ్మెల్యే అండదండలు ఎవరికి ఉంటే వారు బుడా అధ్యక్ష స్థానం దక్కుతుందని అందరూ ఊహించారు. అనుహ్య పరిణామాలతో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నమ్మినబంటుగా ఉంటూ ఆయన ప్రధాన అనుచరుల్లో ఒకరైన జేఎస్ ఆంజనేయులు చక్రం తిప్పారు. బుడా అధ్యక్ష స్థానం దక్కించుకున్నారని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. బుడా అధ్యక్ష స్థానంపై ఆశలు పెట్టుకున్న మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంది.

మేయర్ వినూత్న నిరసన

- టాంగాలో సమావేశానికి రాక

సాక్షి,బళ్లారి: ఆమె అధికార పార్టీకి చెందిన పాలికె మేయర్.. అయినప్పటికి నిబంధనలు ప్రకారం వాహనంతో పాటు, డ్రైవర్‌ను కూడా పాలికె ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే పాలికె అధికారులు నడుచుకోవడంతో ఆమె వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేసింది.

గురువారం విజయపుర మహానగర పాలికె సామాన్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మేయర్ అధ్యక్షత సమావేశం జరగాల్సి ఉండగా, ఆమెకు వాహనం, డ్రైవర్ లేకపోవడంతో విజయపుర మేయర్ మహాజబీన్ హర్తీ టాంగాలో సామాన్య సమావేశానికి హాజరయ్యారు. ఆమె ఆలస్యంగా రావడంతో సమావేశం కూడా ఆలస్యంగానే ప్రారంభమైంది. తనకు వాహనం కూడా లేదని, డొక్కు వాహనం ఇచ్చారని, అందుకు డ్రైవర్ కూడా ఏర్పాటు చేయలేదని, పాలికె కమిషనర్‌కు ఎన్నిసార్లు చెప్పినాపట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. నగరాభివృద్ధి పనుల్లో తిరిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికార పార్టీకి చెందిన తననే పట్టించుకోవడం లేదని పాలకులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో బీజేపీ సభ్యులు కూడా ఆమెకు మద్దతుగా నిలిచారు. అనంతరం పాలికె కమిషనర్ స్పందించారు. తక్షణం వాహనం ఏర్పాటు చేయడంతో పాటు వాహన డ్రైవర్ కూడా నియమిస్తామని హామీ ఇచ్చారు.



టాంగాలో సమావేశానికి వస్తున్న మేయర్

ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలి

రాయచూరు రూరల్: వ్యవసాయ కూలీలకు ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలని మాడగిరి పంచాయతీ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన అధ్యక్షురాలు తారమ్మ మాట్లాడుతూ...ఐదేళ్లుగా సిరివార తాలూకా పంచాయతీ ఇన్‌చార్జ్ శర్ఫిన్నుషా నరేగాలో పనిచేసి వారిని కంప్యూటర్ నుంచి తొలగించి అధ్యక్షులకు తెలియకుండా పనులు చేపడుతున్నారని, కూలీలకు డబ్బులు చెల్లించని అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

సిడి బండి రథోత్సవంపై ముందస్తు సమావేశం

బళ్లారి టౌన్: నగరంలో మార్చి 19న జరగనున్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం సిడి రథోత్సవంపై ముందస్తు సమావేశం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర పాల్గొని మాట్లాడుతూ...ఆలయం చుట్టు పక్కల పరిశుభ్రత చేపట్టి తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, పోలీసు బందోబస్తును కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. అదే విధంగా వైద్య బృందాలు, అంబులెన్స్ సదుపాయాలు, సహాయవాణి కేంద్రాలు, అగ్నిమాపకదళ సేవలు భక్తులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ... రథోత్సవం సందర్భంగా ప్రముఖ కూడలిలో దీపాలంకరణలు చేపట్టి అమ్మవారి దర్శనానికి వచ్చే వీఐపీలకు ప్రత్యేక సమయాన్ని కేటాయించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. అదే విధంగా మార్చి 2న మోకాలో జరగనున్న ముదిమల్లేశ్వర దేవస్థానం రథోత్సవానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మేయర్ శ్వేతా, ఉపమేయర్ జానకి, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప సంకనూరు, ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, ఏసీ హేమంత్ పాల్గొన్నారు.

కిరాతక తండ్రి ఘాతుకం

హుబ్లీ: బిడ్డ ఏడుస్తుండటంతో ఓ వ్యక్తి ఆ చిన్నారిని గోడకేసి కొట్టి తీవ్రంగా గాయపరిచిన అమానవీయ ఘటన ధార్వాడ తాలూకా యాదవాడ గ్రామంలో గురువారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన శంభలింగయ్య ఈ దారుణానికి పాల్పడిన వ్యక్తి. తండ్రి దారుణ ఘటనతో ఏడాది చిన్నారి చావు బతుకుల మధ్య కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మద్యానికి బానిసైన శంభులింగయ్య ఏడుస్తున్న తన కూతురుని బుజ్జగించలేక కాళ్లను పట్టుకుని గోడకేసి కొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయం కావడంతో కిమ్స్ ఐసీయూకు తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు గరగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి విచారణ చేస్తున్నారు.

రక్తదానం మహాదానం

కంప్లి: అత్యవసర సమయాల్లో ప్రాణాలను నిలబెట్టే రక్తదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎస్‌జీటీ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ఎస్ విభాగ కళాశాల పాలక మండలి అధ్యక్షులు ఎస్ఎన్. రుద్రప్ప, కార్యదర్శి నాగరాజ్‌లు యువతకు పిలుపునిచ్చారు. కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

నగర స్వచ్ఛతపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న మంత్రి నాగేంద్ర

సాక్షి బళ్లారి: మహానగర పాలికె పరిధిలో అన్ని వార్డుల్లో స్వచ్ఛతను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పంచాయతీ నజీర్ సభాంగణంలో మేయర్ శ్వేత అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు నగరంలోని సమస్యలపై సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నగరంలో 15 రోజులైనా పలు వార్డుల్లో మంచినీరు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... నగర సర్వతోముఖాభివృద్ధికి నిధుల కొరత లేదని, అధికారులు పూర్తి సహకారం అందించాలన్నారు. ఇక రోడ్లలో పశువులు, శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప మేయర్ జానకీ, కార్పొరేటర్లు, స్థాయీ సమితి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

యోగేష్‌గౌడ హత్య కేసు..

- సోదరుడికి బెదిరింపులు



పోలీసు అధికారికి ఫిర్యాదు చేస్తున్న గురునాథ్‌గౌడ

హుబ్లీ: జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు, దివంగత యోగేష్‌గౌడ సోదరుడు గురునాథ్‌గౌడకు ఫోన్ చేసి ప్రాణాలను తీస్తామంటూ బెదిరించిన ఘటనపై ధార్వాడా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు. తాలూకాలోని గోపనకుప్ప గ్రామంలో తన ఇంటికి వచ్చి సోమాపుర గ్రామ మంజూబేగూర అనే వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డారని గురునాథ్ గౌడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొబైల్ ద్వారా బుధవారం అర్ధరాత్రి కాల్ చేసి ఇష్టమొచ్చినట్లుగా దూషించాడని బాధితుడు పేర్కొన్నారు. అంతేగాక తాను ఇంట్లో లేని సమయంలో కాంగ్రెస్ కార్యకర్త అయినా మంజు మా ఇంటికి వచ్చి తీవ్ర పదజాలంతో నిందించి బెదిరించారన్నారు. వెంటనే మంజూపై తగిన చర్యలు తీసుకొని తనకు రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్రీడలకు ప్రాముఖ్యత కల్పించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లా స్థాయి ఉద్యోగులు క్రీడలకు ప్రాముఖ్యత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శంకర గౌడ పేర్కొన్నారు. గురువారం మహాత్మ గాంధీ క్రీడామైదానంలో జిల్లా, తాలుకా స్థాయి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రెండు రోజుల క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక యుగంలో క్రీడలు కనుమరుగువుతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఉద్యోగులు క్రీడల్లో మనోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భీమన్న నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అలనాటి వచనల్లో విజ్ఞానం దాగి ఉంది

రాయచూరు రూరల్: నేటి ఆధునిక సమాజంలోని శరణుల, దాసుల, వైచారికత వచనల్లో కూడా విజ్ఞానం దాగి ఉందని రాష్ట్ర విజ్ఞాన పరిశోధన కలబుర్గి డివిజన్ ప్రధాన కార్యదర్శి శివరంజన్ పేర్కొన్నారు. గురువారం కలబుర్గి వీరమ్మ గంగసిరి మహిళా కళాశాలలో అంతర్ కళాశాలల విజ్ఞాన వస్తు ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్ర, అక్క మహాదేవి విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్, గిరిజా, పరమేశ్వర్, ఉమా, వీణా, ప్రేమ చంద్, వైజ్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వర పాటిల్‌కు కనకగిరి కేసరి ప్రశస్తి



కనకగిరి కేసరి ప్రశస్తితో కామేశ్వర పాటిల్

గంగావతి: కనకగిరి ఉత్సవాల సందర్భంగా జరిగిన కుస్తీ పోటీల్లో బెళగావి కామేశ్వర పాటిల్‌కు కనకగిరి కేసరి ప్రశస్తి లభించింది. ఈ ఉత్సవాల సందర్భంగా బుధవారం రోజున రాష్ట్ర స్థాయి 74 కేజీల విభాగంలో కుస్తీ పోటీలను నిర్వహించగా ఇందులో కామేశ్వర్‌పాటిల్‌కు కనకగిరి కేసరి లభించింది. కేసరి ప్రశస్తితో పాటు వెండి గద, రూ. 15 వేల నగదు బహుమతిని అందజేశారు. ఇదే విభాగంలో దావణగెరెకు చెందిన నాగేశ్‌కు కనకగిరి కుమార ప్రశస్తి, బాగల్‌కోటెకు చెందిన అల్తాఫ్‌కు ద్వితీయ ప్రశస్తి లభించింది. 61 కేజీల విభాగంలో రోహన్‌కు కనకగిరి కిశోర్ ప్రశస్తి అందుకున్నారు.

ఉగ్రవాదులకు కాంగ్రెస్ అండగా నిలబడుతోంది

- అసెంబ్లీ వద్దనే పాకిస్థాన్ జిందాబాద్ అంటూ వ్యాఖ్యలా
- మాజీ మంత్రి శ్రీరాములు ఆగ్రహం

సాక్షి,బళ్లారి: సాక్షాత్తు దేవాలయంగా భావించే అసెంబ్లీ వద్దనే పాకిస్థాన్ జిందాబాద్ అంటే తగిన చర్యలు తీసుకోవాల్సిన పాలకులు వెనక్కి తగ్గుతున్నారంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉగ్రవాదులకు అండగా నిలబడుతుందన్న అనుమానం కలుగుతోందని మాజీ మంత్రి శ్రీరాములు ధ్వజమెత్తారు.

ఆయన గురువారం నగరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బళ్లారికి చెందిన నాసిర్ హుస్సేన్ రెండవసారి లోక్‌సభ సభ్యుడుగా ఎంపిక అయినందుకు తాను కూడా ఎంతో సంతోషించామని, అయితే ఆయనకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన వారిలో కొందరు అసెంబ్లీ అవరణంలోనే పాకిస్థాన్‌కు జిందాబాద్ అనడంలో వీరికి పాకిస్థాన్‌పై ఉన్న దేశ భక్తి భారత్‌పై లేదన్నారు. పాకిస్థాన్‌పై అభిమానం ఉన్న వాళ్లు ఆ దేశంలోకి వెళ్లి జీవించవచ్చునని, తాము వారికి విమాన టికెట్లు కొనిస్తామన్నారు. ఈ దేశంలో రాజ్యసభ సభ్యుడుగా ఎన్నికైన నాసిర్ హుస్సేన్ ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం శోచనీయం అన్నారు. ఎన్ఐఏ దర్యాప్తు చేసిన తర్వాత నిజాలు బయటకు వస్తాయన్నారు. భారత్‌లో ఉంటూ, ఈ దేశం గాలి, నీరు, ఆహారం, సంపద తీసుకుంటూ పాకిస్థాన్‌కు జిందాబాద్ అంటున్నారంటే వీరిని ఏమనాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదులా, లేదా పాకిస్థాన్ అభిమానులా! అంటూ మండిపడ్డారు. వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపాలని డిమాండ్‌చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని, ఈసారి కచ్చితంగా బీజేపీ కూటమి అన్ని స్థానాల్లో గెలుపొందుతుందని అన్నారు. తాను కూడా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నానని, అయితే పార్టీ పెద్దలు ఏ నిర్ణయం తీసుకున్న దానికి కట్టుబడి పనిచేస్తామన్నారు. మాజీ మంత్రి, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి బీజేపీలోకి మళ్లీ వస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ బుడా అధ్యక్షుడు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరాములు

కోలారు వార్తలు...

అటవీ అధికారిని సస్పెండు చేయాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: ఆక్రమణల పేరుతో రైతులకు అపారనష్టం కలిగించిన జిల్లా అటవీ అధికారిని సస్పెండు చేసి అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కెపిఆర్ఎస్ కార్యకర్తలు గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు., ఈ సందర్భంగా మాట్లాడిన కెపిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ పోరాటాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి ఏడుకొండలు ఇటీవల తాలూకాలోని 97 గ్రామాల 166 సర్వే నెంబర్‌లలో ఉన్న 25 వేల ఎకరాల భూమిని తహసీల్దార్ సమక్షంలో కార్యాచరణ జరిపి రైతుల భూ దాఖలాలు పరిశీలన చేయకుండ ఆక్రమణల పేరుతో రాత్రికి రాత్రే ఎంతో విలువైన మామిడి చెట్లను తొలగించి రైతులకు అపార నష్టం కలిగించారని అన్నారు. అటవీ అధికారిని హైకోర్టు న్యాయమూర్తి కూడా చీవాట్లు పెట్టారు. కేసు కోర్టులో ఉన్నందున అటవీశాఖ అధికారులు ఇకపై ఎట్టి పరిస్థితిలోను ఆక్రమణల పేరుతో తొలగించడానికి రాకూడదన్నారు. అనంతరం తహసీల్దార్ సుధీంద్రకు వినతి పత్రం సమర్పించారు. ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్, నారాయణస్వామి, ఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వొద్దు

కోలారు : ధార్మిక స్థలాలు, పాఠశాలల సమీపంలో మద్యం దుకాణాలకు అనుమతి ఇవ్వొద్దని కోరుతూ గౌనిపల్లి గ్రామస్తులు తాపం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ధార్మిక కేంద్రాల వద్ద మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఉంటారని, అలాంటి చోట మద్యం దుకాణాలు ఉండటం తగదన్నారు. విద్యార్థులకు సైతం అసౌకర్యంగా ఉంటుందన్నారు. ధర్నాలో గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు హెచ్ హరమత్తుల్లా, అమీర్ ఖాన్, జికె సుబ్రమణి, అరీఫ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ద్వితీయ పరీక్షలు

కోలారు: జిల్లాలోని 28 పరీక్షా కేంద్రాలలో మార్చి 1 నుంచి జరిగే ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పరీక్షల సంబంధించి ఇంటర్ విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన పూర్వ సిద్ధతా సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి లోపాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప మాట్లాడుతూ... పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, ఈసారి 13,958 మంది విద్యార్థులు కొత్తగా 1089 మంది సప్లిమెంటరీ, 877 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రశ్నపత్రాలు తీసుకు వచ్చే వాహనాలకు జీపీఎస్ అమర్చినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల వరకు నిషేధాజ్ఞలు విధించామని, పరీక్ష కేంద్రాల చుట్టూ ఉన్న జెరాక్స్ సెంటర్లను మూసి వేయిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్, ఎస్పీ ఎం నారాయణ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో కలెక్టర్ పాషా

వైభవంగా కుంభాభిషేకం

కెజీఎఫ్: తాలూకాలోని పిచ్చహళ్లి గ్రామంలో చాముండేశ్వరి దేవాలయంలో కుంభాభిషేక మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. 150 సంవత్సరాల అత్యంత పురాతన దేవాలయంలో పుష్కరాలకొకసారి కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహిస్తారు. 211 కలశాలను మహిళలు ఆలయానికి తీసుకు వచ్చి అమ్మవారికి సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్చకులు వేదమంత్ర పారాయణం పఠించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



విజేతలను సన్మానించిన దృశ్యం

క్రీడలతో ఆటవిడుపు

కోలారు: నిరంతరం ఒత్తిళ్ల మధ్య జీనవం సాగిస్తున్న న్యాయవాదులు క్రీడలు, చిన్నపాటి వ్యాయామాలు చేసి ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చని న్యాయమూర్తి జీఏ మంజునాథ్ తెలిపారు. గురువారం ముళబాగిలు నగరంలో న్యాయవాదుల క్రికెట్ పోటీలలో విజేతలైన కోలారు న్యాయవాదుల జట్టును సన్మానించి మాట్లాడారు. క్రీడలు ఆరోగ్యంతో పాటుగా మనసు ప్రశాంతంగా ఉంచుతాయన్నారు. నిరంతరం కోర్టు కార్యకలాపాలలో ఉండే న్యాయవాదులకు క్రీడలు ఆటవిడుపుగా ఉంటాయన్నారు. ఈ మధ్య మారుతున్న ఆహారపు అలవాట్లతో ప్రజల ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఆరోగ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరు క్రీడలలో పాల్గొనాలన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం మునేగౌడ మాట్లాడుతూ... కోలారు న్యాయవాదుల సంఘం సభ్యులు మూడు జిల్లాల క్రీడాకారులను ఓడించి విజేతలు కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి దివ్య దేవమానె, బాలకృష్ణ భట్ తదితరులు పాల్గొన్నారు.